ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 | సంచిక - 11 | ఆగస్టు - 2020 | కృష్ణా | పేజీలు 68 | వెల రూ. 20




సాహితీస్రవంతి



## సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనెల శ్రీనివాస్ మృతి

అభ్యుదయ కవి, రచయిత, సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యులు, సాహితీస్రవంతి విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు (51) జూలై 22 రాత్రి ఆకస్మాత్తుగా కన్నుమూశారు. ఆయనకు భార్య రేణుక, కుమార్తెలు స్ఫూర్తి, స్పందన, కుమారుడు అన్వేష్ ఉన్నారు. శ్రీనివాస్ తన తండ్రి మహాలక్ష్మి అడుగుజాడల్లో అభ్యుదయ భావాలను పునికిపుచ్చుకున్నారు. 1996లో పోర్టులో ఉద్యోగిగా చేరాక సిఐటియులో పని చేశారు. పోర్టులో పనిచేస్తూనే విశాఖ సాహిత్య రంగంలోనూ విశేష కృషిచేశారు. సాహితీస్రవంతి కార్యక్రమాల నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. వర్తమాన అంశాలపై అనేక కవితలు, పాటలూ రాశారు. "శ్రామిక గీతాలు' పేరిట కార్మిక చైతన్య గీతాలను పుస్తకంగానూ, సిడి రూపంలోనూ వెలవరించారు. నూనెల శ్రీనివాస్ మృతి సాహితీస్రవంతికి తీరని లోటు. సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ, సాహిత్య ప్రస్థానం సంపాదక వర్గం తరపున నూనెల శ్రీనివాస్‌కు జోహార్లర్పిస్తున్నాం.

## సగం పగిలిన కెరటం

*అనవసరంగా చచ్చిపోయినవాళ్ళంటే*
*నాకు మహా కోపం*
*ఇంకా అంతకంత వయసు కలిపి బతకాల్సిన వాళ్ళు*
*కనీసం కొంతైనా జతచేసి ఓ అరవై, డెబ్భై..*
*ఇపుడదీ ఓ పెద్ద లెక్క కాదు*
*ఎనభై దాటితే ఇష్టం లేకపోయినా*
*మరేం చేస్తాంలే అని సర్దుకుపోతాం కానీ*
*మరీ నలభై ఏభై ఏళ్ళవాడు వెళ్ళిపోయే పనేముందని*
*వెళిపోతే ఇక్కడ పనెవరు చక్కబెడతారనీ?*
*అలాంటివాళ్ళు తెల్లారి మైకుల దగ్గరికి రాకూడదు*
*కలం పట్టుకు కాలాన్ని కెరలృకూడదు*
*బోలెడు నిర్మాణాలకు శంకుస్థాపనలు చెయ్ కూడదు*
*ఆరోగ్యాన్ని అశ్రద్ధ చెయ్యకూడదు*
*ఆ మధ్యన ఆ రామతీర్థా అలాగే చేశాడు*
*అందులో అతని తప్పేమీ లేదు*
*అతని గుండె అతనికంటే అతిస్పందించింది*
*ఆతని జగద్ధాత్రీ సహచరించింది కొద్దిరోజుల తేడాలోనే*
*అందరికీ విన్నపం మనకి మించిన ఆశయాలు మనవి*
*ఐనా అవి బొందితోనే పెనవేసుకున్నవి*
*రేపటికి 'రిప్'లే ప్రతీ'లిప్'లూ పలికేవి*
*నలుగురొకచోట చేరడాన్ని కాలదన్నిన కరోనా*
*'జూమ్'లలోనే సంతాప సభలు!*
*ఒకరి కన్నీరొకరు వొత్తలేని చాతకాని స్థితి*
*ఎడతెగని వర్షంలో చావులా*
*అందరూ ముంజూర్లలోంచే చూస్తూ*
*కదలలేని పరిస్థితి*
*నూనెల శ్రీనూ*
*నువ్విలాంటి పని చెయ్యాల్సింది కాదు*
*నీ పనిని సాహితీ స్రవంతి తరపున*
*నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాను*
*ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు*
*స్వీకరించడానికి నీ బాధ్యత నెవరికీ*
*దఖలు పర్చలేదు!*

(నూనెల శ్రీనివాసరావు అకాల మరణానికి చింతిస్తూ..)

– పి.ఎస్. శ్రీనివాస్ – 6303013646

# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం


## లాక్ లేదు, డౌన్ కాదు

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడం కోసం మాస్కులు వేసుకుంటూ లాక్‌డౌన్‌లలో గడిపినా అది పెరుగుతుందే గాని తగ్గడం లేదు. మన దేశంలోనే మృతుల సంఖ్య 33 వేలు దాటింది. బయిటకు రాని మరణాలు మరెన్ని వున్నాయో తెలియదు. 14 లక్షల పాజిటివ్ కేసులూ నమోదైనాయి. వారంలో 20 శాతం వైరస్ వ్యాప్తితో ఇండియా ఇప్పుడు ప్రపంచంలోనే ప్రథమ స్థానంలోకి వచ్చింది. పరీక్షలు జరపడంలో రాష్ట్రాలు రకరకాలుగా వ్యవహరిస్తున్నాయి గనక అన్ని కేసులు వెల్లడి అయ్యాయని చెప్పడం కష్టం. ఎపి తెలంగాణలలోనూ కరోనా బెడద తీవ్రంగానే వుంది. ఎపిలో పరీక్షలు ఎక్కువగా చేస్తున్నా చికిత్సా సదుపాయాలు చాలడం లేదు. తెలంగాణలోనైతే పరీక్షలు కూడా తగినన్ని జరగడం లేదనే భావం వుంది. కార్పొరేట్ వైద్య వ్యవస్థ ఎంతగా విస్తరించినా కరోనాను ఎదుర్కొవడంలో అక్కరకు రావడం లేదు. వాటి భారం దుర్భరంగా వుంటోంది. వలస జీవులు వ్యవసాయ కార్మికులు చిన్న వ్యాపారులు ఇంకా ఉద్యోగాలు కోల్పోయిన కోట్లాది శ్రామికులు ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. వాక్సిన్ గురించి మందు గురించి కబుర్లు వినిపిస్తున్నా అవి కూడా చాలావరకూ వ్యాపార పందెంలా వున్నాయి. పిల్లలచదువులూ అయోమయంగా వున్నాయి. ఆన్‌లైన్ బోధన పరీక్షలపై కోర్టుల్లో విచారణలు సాగుతున్నా బయిట నడుస్తూనే వున్నాయి. కరోనాను అరికట్టడంలో దాదాపు విజయం సాధించేశామన్నట్టు మాట్లాడిన కేంద్ర పాలకులు ఇప్పటికీ తమ నిర్ణయాలు గొప్పవని చెప్పుకుంటున్నారే గాని పొంచివున్న ముప్పుకు తగినట్టు వ్యవహరించడం లేదు. ఆర్థిక సంక్షోభం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా మరింత ఉచిత రేషన్, నగదు సాయం చేయడానికి ముందుకు రావడం లేదు. పైగా రాజకీయ కుతంత్రాలు కుల మతతత్వ రాజకీయాలు, హక్కులపై దాడులూ అన్నీ షరామామూలుగా సాగుతున్నాయి. వరవరరావు వంటివారిని విడుదల చేసి ప్రాణాలు కాపాడాలన్నా ఆలకించడం లేదు. ఏ విధంగా చూసినా ఇది ప్రజలకు అత్యంత క్లిష్టమైన సమయం. అన్ని జాగ్రత్తలతో ఆరోగ్యం కాపాడుకుంటూ పరస్పరం సహకరించుకుంటూ ప్రభుత్వాల నుంచి యాజమాన్యాల నుంచి సహాయం సాధించుకోవడానికి ఉద్యుక్తం కావలసిన తరుణం ఇది. లాక్‌డౌన్‌లు లేదా అరకొర చర్యలు ఈ విపత్తును ఎదుర్కోవడానికి సరిపోవనే వాస్తవం గ్రహించి పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థను పెంపొందించుకోవాలి. వైద్యులు సహాయసిబ్బంది, పారిశుద్య కార్మికులు, పోలీసులు, మీడియా సిబ్బందితో సహా ముందు భాగాన వుండి కృషి చేసేవారికి తగు భద్రత కల్పించాలి.

ఈ కరోనా తరుణంలోనూ కవులూ, రచయితలూ ఆన్‌లైన్ తరహాలోనే సాహిత్యాన్ని సజీవంగా వుంచుతున్న తీరు అభినందనీయమైంది. ఎప్పుడు ఫేస్‌బుక్ చూసినా ఏదో ఒక లైవ్ నడుస్తూనే వుంటోంది. తమ రచనలతో, పాటలతో వారు ప్రజల ఆత్మ స్థయిర్యాన్ని నిలబెడుతున్నారు.

ఈ విశ్వవ్యాపిత వ్యాధి మిత్రులెందరినో బలిగొంటోంది. ఉ.సాంబశివరావు కన్నుమూశారు. సాహితీ స్రవంతిరాష్ట్ర కమిటీ సభ్యుడు, విశాఖ జిల్లా కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు కరోనాతో పెనుగులాడి కింగ్‌జార్జి ఆస్పత్రిలో మరణించారు. ప్రజాస్వామిక భావజాల విస్తరణకు సాహిత్యోద్యమాల నిర్మాణానికి ఎంతగానో కృషి చేసిన ఈ మిత్రులకు సాహిత్య ప్రస్థానం జోహారులర్పిస్తున్నది.

◆


ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
ముఖచిత్రం పెయింటింగ్:
మజా గ్రెసి



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2020

### కథలు


**రూపం – ప్రతిరూపం –** అంపశయ్య నవీన్............ 5

**బొమ్మ –** వేణు మరీదు................................. 21

**ఆటా పాటా –** డా॥ ఎం. హరికిషన్................... 31

**బలిమోడ్పి –** దాసరి రామచంద్రరావు.................. 39

**బేరసారాలు –** పొన్నాడ సూర్యప్రకాశరావు........... 53


### కవితలు


**వీడ్కోలు** – దాకరపు బాబూరావు.......................... 13

**పుస్తకం** – ఈదర శ్రీనివాస రెడ్డి.......................... 13

**కరోనా! అబ్ తూ మరోనా!** – డా॥ ఎన్. గోపి...........16

**కరోనా హైకూలు** – వై. రవీంద్ర..........................16

**జైలుగది** – రేణుక అయోలా...............................19

**అప్రస్తుతమే అవసరమేమో**
– డా॥ బాలాజీ దీక్షితులు పి.వి. ......................20

**బతుకు నిమజ్జనం** – కాంచనపల్లి ద్వారకానాథ్......... 20

**సడలకుండా చూసుకోవాల్సిన చేయి**
– గన్‌రెడ్డి ఆదిరెడ్డి................................ 24

**ఇద్దరి కథ కాదు** – వశిష్ట సోమేపల్లి......................25

**నీటిచెమ్మ** – చందలూరి నారాయణరావు..................25

**రక్తమోడిన రహదారులు** – ఝాన్సీ కె.వి. కుమారి...... 30

**నా అడుగులు చీకటివైపు** – మహబూబ్ భాషా చిల్లెం... 33

**నీవో అద్భుతానివి** – కళ్యాణదుర్గం స్వర్ణలత............ 34

**నానీలు** – కోట్ల వెంకటేశ్వర రెడ్డి......................... 34

**కృష్ణపక్షం** – గోపాలరావు కందిపాటి..................... 37

**ఇప్పుడేం కావాలి** – విజయ్ కోగంటి.................... 38

**ఊరిదారిలో** – బంగార్రాజు కంఠ......................... 38

**రెక్కలు** – పి. విజయలక్ష్మి పండిట్........................ 43

**నేను సైనికురాలిని!** – రజిత కొండసాని................. 48

**ఎడారి బాటసారులం** – గోసల నారాయణస్వామి....... 51

**నిశ్శబ్ద బీభత్సం** – శ్రీనివాసరాజు పెన్మెత్స................ 52

**నానీలు** – సుభాషిణి ప్రత్తిపాటి.............................. 52

**పునర్నిర్మించుకుందాం..!** – బి. కళాగోపాల్............ 58

**నానీలు** – ముట్నూరు బాలసుబ్రహ్మణ్యం................ 58

**జోహార్..** – సందీప్ రుద్రాక్షుల........................... 61


### వ్యాసాలు


**సాహిత్య ప్రస్థానం జూలై 2020 పురస్కారాలు**........ 9

**సోమసుందర్ స్వీయచరిత్ర – కొన్ని విశేషాలు**
– చెరుకూరి సత్యనారాయణ..................... 10

**సప్తవర్ణాలు చిందించిన కవిత్వం**
– జంధ్యాల రఘుబాబు............................14

**'కాలం'లా విలువైన కథలు** – గబ్బిట దుర్గాప్రసాద్.... 17

**మనిషి తనాన్ని ప్రేమించే కలలు**
– దర్భశయనం శ్రీనివాసాచార్య.................. 26

**కొత్తదనం..సౌందర్యం..సామాజికత**
– జుజ్జూరి వేణుగోపాల్.......................... 35

**ప్రశ్నిస్తున్న మూడోగొంతు** – జోశ్యుల దీక్ష............ 44

**పీడితుల విముక్తి గీతం** – కెంగార మోహన్.......... 49

**అగాధంలో భారత ఆరోగ్య వ్యవస్థ**
– ప్రభాత్ పట్నాయక్............................. 56

**సహృదయ సాహితీమిత్రుడు** – ఏ.వి. రమణారావు.... 59

**కథా రచయిత బి.పి. కరుణాకర్ కన్నుమూత**
– డా॥ ఎండ్లూరి సుధాకర్........................ 62

**ప్రముఖ రచయిత ఎం.డి. సౌజన్య ఇకలేరు** .......... 63

**స్వీకారం**............................................ 64



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ

# రూపం - ప్రతిరూపం




- అంపశయ్య నవీన్
9989291299


“ఈ మ్యారేజి హాల్‌ను ఇటీవలనే నిర్మించారు... దీని ఒక్కరోజు రెంటే ఎంతో తెలుసా?” అన్నాడు మనోహర్.

“దీన్ని చూస్తోంటే మహాభారతంలోని ‘మయసభ’ గుర్తొస్తోంది. నిజంగా ఇంత బ్రహ్మాండంగా ఉన్న వో మ్యారేజిహాల్‌ను చూడటం నాకిదే ప్రథమం. ఇంతకు ముందెప్పుడూ ఇంత ఇంద్రభవనం లాంటి మ్యారేజి హాల్‌ను చూళ్ళేదు. ఒకరోజు రెంటు రెండులక్షలైనా ఉంటుందనుకుంటున్నాను” అన్నాడు సుకుమార్.

“రెండు లక్షలు కాదు, నాల్గు లక్షలట. అదిపోగా డెకరేషన్‌కు రెండు లక్షలట... దీన్ని యే ఆర్టిస్టు ప్లాన్ చేశాడో గాని అడుగడుగునా శిల్పకళతో ఉట్టిపడేలా చేశాడు. ఆ స్టేజిమీది సీతారాముల పాలరాతి విగ్రహాలు చూడు... ఇంకా స్టేజి వెనకా, స్టేజి పక్కలా ఎందరు దేవతల పాలరాతి విగ్రహాలున్నాయో చూడు... కింద ఫ్లోరింగ్ చూడు... అద్దంలోలాగా మన రూపాలన్నీ ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో చూడు... ఇట్స్ ఫెంటాస్టిక్...” అన్నాడు మనోహర్.

వాళ్ళిద్దరలా మాట్లాడుకుంటుండగానే స్టేజిమీద జరుగుతున్న పెళ్ళి ముగింపు దగ్గరకొచ్చింది. అందరూ స్టేజిమీదకు వెళ్ళి అక్షింతలు వేసి వధూవరులను ఆశీర్వదించటానికి సిద్ధమౌతున్నారు.

“ఏమండీ! అందరూ స్టేజిమీదకు వెళ్తున్నారు... మనమూ వెళ్దాం రండి! త్వరగా వెళ్ళకపోతే రష్ చాలా ఎక్కువైపోతుంది” అంటూ సుకుమార్ దగ్గరకొచ్చింది అతని భార్య సునంద.

“రష్ ఆల్‌రెడీ ఎక్కువపోయింది. తొందరెందుకు... ఈ రష్ తగ్గనీ...” అన్నాడు సుకుమార్.

“ఈ రష్ ఇంకా ఎక్కువౌతుందే గానీ తక్కువౌతుందా? ఇప్పుడే వెళ్దాం రండి. మీరసలు స్టేజిమీద ఉండాలి... పెళ్ళికూతురు తండ్రికి క్లోజ్‌ఫ్రెండయ్యుండి మీరిలా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటారా?” అంది సునంద.

“నాకు ఈ తరహా పెళ్ళిళ్ళు... ఈ హంగామా... ఈ ఆర్భాటం నచ్చదని నీకు తెలుసు. ఈ పెళ్ళివాళ్ళు గొప్పకోసం ఎన్ని లక్షలు ఖర్చుపెడ్తున్నారో ఊహిస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఈ ఒక్క పెళ్ళికవుతున్న ఖర్చుతో ఓ 20 మంది పేదవాళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యొచ్చు” అన్నాడు సుకుమార్.

“మీ ఛాదస్తం మీద... అందరూ పెళ్ళి ఎంత గ్రాండ్‌గా జరుగుతున్నదని గొప్పగా చెప్పుకుంటోంటే మీరేమో ఈ ఖర్చుతో 20 మంది పేదవాళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యొచ్చు అంటున్నారు. నా ఖర్మకొద్ది దొరికారండి. మీ కమ్యూనిస్టు భావాలతో ఛస్తున్నాను.” అంటూ సునంద అక్కణ్ణించి విసుగ్గా వెళ్ళిపోయింది.

స్టేజిమీదకు వెళ్ళేవాళ్ళ సంఖ్య క్రమక్రమంగా

పెద్దదైపోయింది. ఒకర్నొకరు తోసుకుంటూ చాంతాడంత క్యూలో నిల్చున్నారు.

"ఈ క్యూలో నిల్చోవడాలు, అక్షింతలు వేస్తూ కానుకలు సమర్పించుకోడాలు... ఈ తంతు తనకు అసహ్యం" అనుకున్నాడు సుకుమార్.

ఓ గంటలో క్యూ పొడవు తగ్గిపోయింది.

"ఇప్పుడైనా వెళ్దాం రండి" అంటూ వచ్చింది సునంద. సుకుమార్ లేచాడు. అతనితోపాటే మనోహర్ కూడా లేచాడు.

స్టేజి మీదకు వెళ్ళిన ముఖ్యమైన వాళ్ళందర్నీ ఫోటోలు తీస్తున్నారు. అందువల్ల క్యూ కదలటం చాలా ఆలస్యమైపోతున్నది.

"ఈ ఫోటోలొకటి పరమబోర్, ఈ ఫోటోల కారణంగానే మనం ఈ క్యూలో గంటలకు గంటలు నిల్చోవాలి" అసహనంగా అన్నాడు సుకుమార్.

"అంటే యేమిటి మీ ఉద్దేశ్యం... అసలు ఫోటోలే వద్దనా? అవునులెండి... మీకు ఫోటోలంటే కూడా చాలా చిరాకు... మన పెళ్ళిలో ఓ ఫోటోసెషన్ పెట్టి మనల ఇద్దర్నే బోల్డు భంగిమల్లో ఫోటోలు తీస్తానని ఫోటోగ్రాఫర్లు ముచ్చటపడ్తే... మీరే అన్ని ఫోటోలకు ఫోజులిచ్చే ఓపిక లేదు. ఒకటిరెండు తీయండిచాలు అని ఆ ఫోటోసెషన్‌ను కాన్సెల్ చేశారు. నేనెంత డిజప్పాయింటయ్యానో! నాకు నిజంగా యేడుపొచ్చింది... నాకీ పెళ్ళే వద్దని వెళ్ళిపోదామన్నంత కసి పుట్టింది. ఆ ఫోటో సెషన్‌కు మీరొప్పుకుంటే ఓ వంద ఫోటోలయినా వచ్చేవి. వాటిని ఎన్నిసార్లు చూసుకునేదాన్నో! అంతా పాడుచేశారు" అంది సునంద.

వాళ్ళలా మాట్లాడుకుంటోంటే వాళ్ళ వెనుక, ముందు ఉన్నవాళ్ళందరూ "వీళ్ళిక్కడే పోట్లాడుకుంటారా యేమిటి" అనుకున్నారు.

వాళ్ళిద్దరు వధూవరుల్ని సమీపించారు. వధువు తండ్రి వరదారెడ్డిని చూడగానే సుకుమార్ ఆప్యాయంగా హగ్ చేసుకున్నాడు.

"థాంక్యూ ఫర్ కమింగ్" అన్నాడు వరదారెడ్డి.

"నీ కూతురు పెళ్ళికి రాకపోవడమేమిటి. దీనికి నువ్వు థ్యాంక్స్ చెప్పడం బాగాలేదు" అన్నాడు సుకుమార్.

"కంగ్రాచ్యులేషన్స్! హ్యాపీ మ్యారీడ్ లైఫ్" అంటూ సుకుమార్, సునందలు వధూవరుల నెత్తులమీద గులాబీ రెక్కలతో కూడిన అక్షింతలు వేశారు.

"ఒక్క నిమిషం ఆగండి..." అన్నాడు వరదారెడ్డి. ఆగమన్నది ఫోటో కోసమని అర్థమయింది. సుకుమార్ ఒకపక్క, సునంద ఒక్కపక్క నిల్చోగానే ఫోటోగ్రాఫర్ కెమెరా క్లిక్‌మనిపించాడు. అయినా సునంద అలాగే నిల్చున్నది... ఫోటో తీయడం ఇంకా పూర్తికాలేదేమోనని లేక మరోసారి ఫోటో తీస్తాడేమోనని అలా ఆగిపోయింది.

"ఇంకా నిల్చున్నావేం? పద! చాలామంది మన వెనుక నిల్చున్నవాళ్ళు వీళ్ళెప్పుడు పోతారా అని చూస్తున్నారు" అన్నాడు సుకుమార్.

"అయ్యో! ఫోటో తీసినట్టే అనిపించలేదు. అప్పుడే ఫోటో తీయడం అయిపోలేదు అనుకున్నానండి. మళ్ళీ తీస్తాడేమోనను కున్నాను... నేను సరిగ్గా కెమెరాకేసి చూడనేలేదు. ఫోటో ఎలా వచ్చిందో యేమో... కొంపదీసి కళ్ళుగాని మూశానో యేమో... గుడ్డిదానిలా పడ్డానేమో! మరోసారి తీస్తే బావుండు" అంది సునంద.

"ఎలా పడ్తే యేం... నువ్వా ఫోటోను చూడబోతున్నావా యేం... శ్రీరామ చింతల్లో బోడకోతి అన్నట్టు వందలమందిలో మనమొకరం... ఎక్కడో వందల ఫోటోలలో కలిసిపోయిన మన ఫోటో మనకు చూపిస్తారనుకుంటున్నావా?" అన్నాడు సుకుమార్.

"యేమిటి మీరు? నన్ను బోడకోతి అంటున్నారాయేం?"

"నిన్ననలేదు... అదో సామెత. వందల మంది ఫోటోలు దిగుతున్నప్పుడు మన ఫోటో ఎలా వచ్చిందోనని ఆలోచించటం తెలివితక్కువ తనం అంటున్నా" అన్నాడు సుకుమార్.

"వాళ్ళు మనకు మన ఫోటో చూపించరా యేమిటి? చూపించమని మీ ఫ్రెండ్‌ను అడగండి"

"అడుగుతాలే! నీ పిచ్చి నీది. వేల ఫోటోలలో మన ఫోటోను గుర్తుపట్టడం ఎంత కష్టమో నీకు తెలీదు. సరేగాని భోజనానికి వెళ్దాం పద..." అన్నాడు సుకుమార్ విసుగ్గా.

"ఇప్పుడే వెళ్ళి అడగండి... ఫోటోలచ్చాక మా ఫోటో ఒక కాపీ ఇవ్వండి అని చెప్పిరాపొండి. మీరు చెప్పొచ్చాకే భోజనానికెళ్దాం" అంది సునంద.

"నీకేమన్నా పిచ్చా? అంతమందిలో నేను మళ్ళీ వెళ్ళి మా ఫోటో వచ్చాక ఒక కాపీ మాకు ఇవ్వండి అని అడగాలా? నాన్‌సెన్స్..."

"మీరిప్పుడెళ్ళి ఫోటో ఒకటి మాకోసం దాచిపెట్టండి అని మీ ఫ్రెండ్‌కు చెప్పి రాకపోతే నేను భోజనానికి రాను" అంది

సునంద మొండిగా.

"ఓసి నీపిచ్చి పాడుగాను... ఇంతమాత్రానికే భోజనానికి రానని అలుగుతావా? తర్వాతెప్పుడైనా అడుగుతాను గానీ భోజనానికి వెళ్దాం పద..."

"ఎప్పుడో కాదు. ఇప్పుడే వెళ్ళి చెప్పిరావాలి... లేకపోతే వేల ఫోటోలతో మన ఫోటో కలసిపోయి అస్సలు దొరకదు"

"ఇప్పుడే వెళ్ళి చెప్పడం నాతో కాదు... అదిగో, మీ అన్నయ్య మనల్ని చూసి ఇటే వస్తున్నాడు. నీ ఫోటో పిచ్చి గురించి అతనికి చెబుతానుండు" అన్నాడు సుకుమార్.

"వద్దు... యేమీ చెప్పొద్దు... ఆయనవెంట మా వదిన కూడా ఉంది. ఫోటోను గురించి నేనిలా చేస్తున్నానంటే ఆమె నన్ను చూసి నవ్వుతుంది"

"మొగుడు కొట్టాడని కాదు... తోడికోడలు చూసిందని యేడ్చిందట నీలాంటిది" అన్నాడు సుకుమార్.

"మీకు సామెతలు బాగానే వస్తాయని ఇంతకాలం నాకు తెలీదు" అంది సునంద.

ఈలోగా అక్కడికి సునందవాళ్ళ అన్నయ్య వదినలొచ్చారు... కుశల ప్రశ్నలయిపోయాక అందరూ కలిసి భోజనాలకెళ్ళారు.

♦♦♦

ఎప్పుడు అవకాశం వచ్చినా సునంద తను ఇదివరకు దిగిన ఫోటోలను గొప్ప ఆర్తితో చూసుకునేది.

"ఈ ఫోటోలో నేను బావున్నాను కదూ?" అనో, "ఈ ఫోటోలో మరీ చండాలంగా ఉన్నాన"నో భర్తతో అంటుండేది.

"ఫోటోలు బావుండటం, బాగా లేకపోవడం యేమిటి? ఫోటోలు మనమున్నట్టు వస్తాయి..." అనేవాడు సుకుమార్.

"ఈ ఫోటోలో నేను కట్టుకున్న పట్టుచీర ఎలా ఉందంటారు" అని కూడా అడుగుతుండేది. చీరల విషయాన్ని సుకుమార్ అసలు పట్టించుకునేవాడు కాదు.

అతడు ఆ ఫోటోలను ఒక్క సెకండ్ చూసి "బావుంది" అని చెప్పి తను చదువుతున్న పుస్తకంలో మునిగిపోయేవాడు

"లేదులెండి... ఫోటోగ్రాఫర్‌ను బట్టి ఫోటోలుంటాయి... మంచి ఫోటోగ్రాఫర్ అయితే మన ఫోటోలు చాలా బాగా వస్తాయి... చెత్త ఫోటోగ్రాఫర్ అయితే చెత్తగా వస్తాయి" అంటుంది సునంద.

ఎక్కడ తెలిసినవాళ్ళ ఫంక్షన్ జరిగినా సునంద కొత్తచీరతో ముస్తాబై తప్పకుండా వెళ్ళేది. తప్పకుండా ఫోటోలు దిగేది. ఫోటోలు దిగుతున్నారంటే చాలు, వాళ్ళు పిలిచినా, పిలువకపోయినా వెళ్ళి అందరితోపాటు నిల్చునేది. అలా పిలువకపోయినా వెళ్ళి ఫోటోలు దిగుతున్నందుకు తనవెనక ఎంతమంది నవ్వుకుంటున్నారో ఆమె గమనించేది కాదు. గమనించినా పట్టించుకునేది కాదు.

ఈ విషయంలో సుకుమార్, సునంద చాలాసార్లు ఘర్షణ పడేవాళ్ళు.

"వాళ్ళు పిలువకుండానే వెళ్ళడం యేమిటి? ఫోటోల మీద నీకింత పిచ్చేమిటి?" అని సుకుమార్ అంటే "నా ఇష్టం దీనివల్ల మీకొస్తున్న నష్టం యేమిటి?" అనేది.

"ఇదో రకమైన పిచ్చి" అని సుకుమార్ అంటే

"అవును... పిచ్చే! ఎవరి పిచ్చి వాళ్ళకు ఆనందం" అని జవాబొచ్చేది.

ఈ విషయంలో ఇద్దరూ కొన్నిసార్లు చాలా తీవ్రంగా పోట్లాడుకునేవారు.

"నేను చాలా అందంగా ఉన్నానని, నాకు బోల్డు పట్టుచీరలున్నాయని, అవన్నీ ఆ ఫోటోల్లో కనిపిస్తున్నాయని, అంత అందమైన భార్యకు ఆ భర్త కాకిముక్కుకు దొండపండులా ఉన్నాడని జనం అనుకుంటున్నారని మీరు కుళ్ళుకుంటున్నారు" అనేది. ఆ మాట విని అతడు గొల్లున నవ్వేవాడు. ఆ నవ్వు ఆమెకు మరింత చిరాకు తెప్పించేది.

"నువ్వు అందంగా ఉన్నావా? నేను కాకిముక్కు, నువ్వు దొండపండువా?" అన్న ధ్వని అతని నవ్వులో ఆమెకు వినిపించేది. ఇలా ఉండగా సుకుమార్ చెల్లెలు ప్రమీల పెళ్ళి డిసైడయ్యింది.

ఆ పెళ్ళి చాలా గ్రాండ్‌గానే జరిగింది. ఐదారుగురు ఫోటోగ్రాఫర్లు... వధూవరుల్ని వివిధ ఫోజుల్లో నిల్చోబెట్టి బోల్డు ఫోటోలు తీశారు.

తనను, సుకుమార్‌ను కూడా అలా నిల్చోబెట్టి ఫోటోలు తీస్తే బావుండునని సునందకనిపించింది. అతనితో ఈ విషయం ప్రస్తావిస్తే నోటికొచ్చినట్టు తిట్టేశాడు.

పెళ్ళి అయిపోయి అందరూ భోజనాలు చేశాక సుకుమార్ మిగతా చెల్లెళ్ళు, వాళ్ళ భర్తలు, సుకుమార్ వాళ్ళ అమ్మానాన్నలు అందరూ ఫోటోలు దిగడం మొదలెట్టారు. తమను ఎవరైనా "మీరిద్దరూ రండి" అని పిలవకపోతారా అని సునంద చాలా రెస్ట్‌లెస్‌గా, కాలుగాలిన పిల్లిలా ఎదురుచూసింది. కానీ ఆమెనెవరూ పిలువలేదు.

ఇక లాభం లేదని సునంద పెళ్ళికొచ్చినవాళ్ళ డ్రైవర్లకు భోజనాలు వడ్డిస్తున్న భర్త దగ్గరకే వెళ్ళి "మీవాళ్ళందరూ ఫోటోలు దిగారు. మనల్నెవరూ పిలువలేదు. ఎంత ఘోరం... ఫోటోగ్రాఫర్లు వెళ్ళేటట్టున్నారు. మనం వెళ్ళి ఓ రెండు మూడు ఫోటోలు దిగుదాం రండి... దయచేసి తిట్టకండి. వెంటనే రండి" అంది సునంద.

"పనిమీదున్నాను... ఒక అరగంటసేపు ఆగు. వస్తాను" అన్నాడు సుకుమార్.

"అరగంట ఆగితే వాళ్ళు వెళ్ళిపోతారు. ప్లీజ్... రండి" అంది సునంద.

"యేం వెళ్ళిపోరు... అరగంట కాదు. పావుగంటలో వీళ్ళకు డబ్బులిచ్చి వస్తాను... కొంచెం ఆగు" అన్నాడు సుకుమార్. సునందకు ఫోటోలమీద ఉన్న పిచ్చి అతనికి తెలుసు. వెళ్ళకపోతే హర్ట్ అవుతుందని త్వరగానే ఆమెతో స్టేజిమీదకు వెళ్ళాడు.

ఫోటోగ్రాఫర్స్ కెమెరాలు సర్దుకుంటున్నారు. ఆ ఫోటోగ్రాఫర్స్‌లో శ్రీనివాస్ అనే ఫోటోగ్రాఫర్ అంటే సునందకు చాలా ఇష్టం. ఇదివరకు అతడు తీసిన ఆమె ఫోటోలు చాలా బాగా వచ్చాయి. ఇంకెవరు తీసినా అంత బాగా వచ్చేవి కావు అని ఆమె అనుకుంటుంది. శ్రీనివాస్ దగ్గరకు వెళ్ళి "మా ఫోటోలు తీద్దువుగని రా శ్రీనివాస్!" అంది సునంద.

"అయ్యో మేడమ్! మెమరీకార్డు ఇప్పుడే అయిపోయింది. అక్కడ శ్యామ్ ఉన్నాడు చూడండి... అతనితో తీయించుకోండి" అన్నాడు శ్రీనివాస్.

"ఛీ! నీతోటే తీయించుకోవాలనుకున్నాను... ఇంకో మెమరీకార్డు లేదా?" అంది.

"లేదు మేడమ్... సారీ... శ్యామ్ ఫోటోలు బాగా తీస్తాడు... నేను చెప్పనా?" అన్నాడు శ్రీనివాస్.

"వద్దులే... ఎవరైతే యేం. శ్యామ్‌తోటే తీయించుకుందాం పద" అన్నాడు సుకుమార్.

"వద్దు... నాకు ఫోటోలే వద్దు" అంటూనే విసురుగా నడుచుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది సునంద.

సుకుమార్ ఎంత ఆగమని బతిమాలినా ఆగలేదు.

భోజనం కూడా చెయ్యకుండా ఇంటికెళ్ళి, తన రూంలో పడుకొని భోరుమని యేడ్వసాగింది. ఎంతమంది వచ్చి బతిమాలినా, "ఫోటోగ్రాపర్‌ను ఇంటికే తీసుకొచ్చాం... ఇప్పుడు ఎన్నంటే అన్ని ఫోటోలు దిగుదువుగానీ రా" అని వాళ్ళ అత్తగారొచ్చి బతిమాలినా రాలేదు.

స్వయంగా సుకుమారే వచ్చి "ఫోటోగ్రాఫర్‌ను మన ఇంటికే తీసుకొచ్చాను. రా... ఎన్నంటే అన్ని ఫోటోలు దిగొచ్చు" అని చెప్పినా ఆమె రాలేదు. తిండి తినకుండానే పడుకుంది.

ఆ మర్నాడు త్వరగా లేచి, తన సూట్‌కేసు సర్దుకొని బయటకు వెళ్తూ "నేను మా అమ్మదగ్గరకు వెళ్తున్నాను. తిరిగిరాను" అని చెప్పి ఒక్కతే బస్‌స్టేషన్ దాకా వెళ్ళి బస్సెక్కి వాళ్ళ తల్లిగారింటికి వెళ్ళిపోయింది. ఆమె వెంటే తన స్కూటర్ తీసుకొని సుకుమార్ వెళ్ళినా ఆమె అతనికి కలవలేదు.

◆◆◆

పదిరోజుల తర్వాత సునంద వాళ్ళ అన్నయ్య మోహనరావొచ్చాడు.

అతన్ని చూడగానే "మీ చెల్లెలు యేమంటోంది మోహన్" అన్నాడు సుకుమార్.

మోహన్ వెంటనే జవాబు చెప్పలేదు.

"సమస్య కొంచెం సీరియస్‌గానే ఉంది బావా? 'వాళ్ళందరూ ఫోటోలు దిగారే కానీ తమను పిలువలేదని మీమీదా, వాళ్ళ అత్తమీద మా చెల్లెలుకు చాలా కోపమొచ్చింది. వాళ్ళు దిగుతున్నప్పుడు దాన్నికూడా పిలవొచ్చుకదా! చాలా హర్టయ్యింది" అన్నాడు మోహన్ మొహం మాడ్చుకొని.

"కాపురం చెయ్యనంటోందా?" అన్నాడు సుకుమార్.

"ఇంచుమించు ఆ ధోరణిలోనే మాట్లాడుతోంది"

"నేను అనుకోవడం యేమిటంటే ఫోటోల్లో తనను తను చూసుకోవాలన్న కోరిక జబ్బుకింద మారిందని. అదో రకమైన పిచ్చే... ఓ సైకియాట్రిస్టును సంప్రదిస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు సుకుమార్.

"సైకియాట్రిస్టు దగ్గరకు వెళ్దామంటే నాకు పిచ్చి లేచిందనుకుంటున్నారా అంటుందేమో" అన్నాడు మోహన్.

"అంటుంది. ఈ దేశంలో మానసిక జబ్బుల్ని సైకియాట్రిస్టులను కన్‌సల్ట్ చెయ్యడం ద్వారా నయం చెయ్యొచ్చుననే ఇంగితజ్ఞానం చాలామందికి లేదు. సైకియాట్రిస్టు అనగానే పిచ్చిలేచినవాళ్ళను మాత్రమే అక్కడికి తీసుకెళ్తారు అనుకుంటారు. నాకు బాగా తెలిసిన సైకియాట్రిస్ట ఒకతనున్నాడు. అతని సలహా తీసుకుందాం..." అన్నాడు సుకుమార్.

ఆరోజు సాయంత్రం వాళ్ళిద్దరు కలిసి సైకియాట్రిస్టు

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం జూలై 2020 పురస్కారాలు

**ఎవరో వస్తారని**
కథకు: రూ.500/-
రచయిత: మీనాక్షి శ్రీనివాస్

**క్షమించు తల్లీ!**
కవితకు : రూ. 500/-
రచయిత : ఆదిఆంధ్ర తిప్పేస్వామి

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*
*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం, చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

*- ఎడిటర్*

డా॥ శ్రీధర్ దగ్గరకు వెళ్ళారు.

వాళ్ళు సునందను గూర్చి చెప్పిందంతా విని "ఆమెకు Narrcissism అనే జబ్బుంది. మనందరిలో కూడా ఈ జబ్బు ఉంటుంది. కానీ ఆమెలో ఇది తారాస్థాయికి చేరింది. 'నార్సిసిజం' అంటే యేమీలేదు, మన రూపాన్ని మనం అదేపనిగా చూసుకోవాలని కోరుకోవడం... మన ఫోటోల ద్వారా మనల్ని మనం అదేపనిగా చూసుకోవడం... మన ఫోటోల్ని మనం చూసుకోవాలన్న కోరిక మనందరిలోనూ ఉంటుంది. నిజానికి మనలో మనల్ని చూసుకోవాలన్న గాఢమైన కోరిక లేకపోతే ఫోటోగ్రఫీకి ఇంత డిమాండ్ ఉండదు. కొందరిలో ఇది మరీ ఎక్కువైతే పిచ్చికింద మారుతుంది. ఒకసారి ఆమెను నా దగ్గరకు తీసుకురండి. ఆమె జబ్బును నయం చెయ్యటానికి ప్రయత్నిస్తాను" అన్నాడాయన.

సైకియాట్రిస్టు దగ్గరకు వెల్దామని సునందతో అంటే ఆమె గయ్యిమని అరచిందట. చావనైనా చస్తానుగానీ సైకియాట్రిస్టు దగ్గరకు రానందట. నెలరోజులు గడిచాయి... మూడు నెలలు గడిచాయి. కానీ సునంద భర్త దగ్గరకు రాలేదు. సుకుమార్ ఆలోచించాడు. ఎంత ఆలోచించినా సమస్యకు పరిష్కారం దొరకలేదు.

సుకుమార్ మరోసారి అతని సైకియాట్రిస్టు ఫ్రెండ్ దగ్గరకెళ్ళాడు. అతడో సలహా ఇచ్చాడు.

ఆమె ఫోటోలను చాలా తీయించండి. ఫోటోగ్రాపర్‌కు చెప్పండి... ఆమె ఫోటోలు చాలా అగ్లీగా రావాలని. ఆ వికారంగా వచ్చిన ఫోటోలను ఆమెకు చూపించండి. వాటిని చూశాక తప్పకుండా ఆమెకు ఫోటోగ్రఫీ మీదున్న ఆ మోజు తగ్గుతుందనుకుంటాను. ఈ ప్లాన్ సక్సెస్ కావటం ఫోటోగ్రాఫర్ మీదనే ఆధారపడి ఉంటుంది. ఫోటోగ్రాఫర్లు తల్చుకుంటే చాలా వికారంగా వచ్చేట్టుగా కూడా ఫోటోలు తీయగలరు" అన్నాడు సైకియాట్రిస్టు డా॥ శ్రీధర్.

చివరకు సైకియాట్రిస్టు సలహా సక్సెసయ్యింది. చాలా వికారంగా ఉన్న తన ఫోటోలను చూసి సునంద ఇవి తనవేనా అని అనుమానపడింది. సునందవాళ్ళ అమ్మా, నాన్న, అన్నలు, అక్కలు... అందరూ సమర్థించటం వల్ల సునంద మూడు నెలల తర్వాత మళ్ళీ భర్త దగ్గరకొచ్చింది. కావాలనే తన భర్త తననలా వికారంగా కనిపించేలా ఫోటోలు తీయించాడని కూడా ఆమె తెలుసుకుంది.

అప్పుడప్పుడు ఫోటోల విషయంలో వాళ్ళు తీవ్రంగా ఘర్షణ పడ్తూనే ఉన్నారు. ఆ ఘర్షణలు విడాకుల దాకా వెళ్తాయేమోనని కూడా సుకుమార్‌వాళ్ళ అమ్మానాన్నలు అనుకునేవారు.

ఒకసారి సుకుమార్ వెళ్ళి సైకియాట్రిస్టు శ్రీధర్‌ను కలిసి విషయమంతా చెప్పాడు. "ఇలాంటి కొన్ని పిచ్చుల్ని మనం నయం చెయ్యలేం సుకుమార్! యూ హేవ్ టు లివ్ విత్ ఇట్. మీరుకూడా పోనీయ్‌లే అని వదిలేయండి. మరీ సీరియస్‌గా తీసుకోకండి" అన్నాడు డా॥ శ్రీధర్. ♦

విశ్లేషణ




# సోమసుందర్ స్వీయచరిత్ర - కొన్ని విశేషాలు


- చెరుకూరి సత్యనారాయణ

9848664587


*సోమసుందర్ తన పొలం కొంత అమ్మి వజ్రాయుధం అచ్చువేయిస్తూ అప్పుడే శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, అనిసెట్టిలకు కవితా సంపుటాలు కూడా వేస్తానని రాశాడట. అనిసెట్టి, దాశరథి గార్లు ప్రచురణ వేరే వాళ్లు వేస్తున్నారని చెప్పగా, శ్రీశ్రీ సమాధానం చెప్పలేదు.*

*"ఒక వీరుడు మరణిస్తే/ వేలకొలది ప్రభవింతురు*
*ఒక నెత్తుటి బొట్టులోనే/ ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"*

ఈ కవితా పాదం వినని సాహిత్య జీవులు, వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషులు తెలుగు నేలపై వుండరు. ఎక్కడో ఒకచోట ఉపన్యాసంలోనో, వ్యాసంలోనో ఈ ఉటంకింపు చూసో, వినో వుంటారు. లేదా ఏదో ఒక తెలుగు పట్టణంలో గోడలపైన నినాదరూపంలోనైనా గమనించి వుంటారు. ప్రముఖ అభ్యుదయ కవి ఆవత్స సోమసుందర్ వజ్రాయుధం సంపుటిలో బానిసల దండయాత్ర కవితలోని ఒక పద్యపాఠం ఇది. తెలుగులో వచ్చిన ఐదు గొప్ప అభ్యుదయ కవితల్ని చెప్పాల్సి వస్తే వజ్రాయుధంలోని సమధర్మం, బానిసల దండయాత్ర, రెంటికీ అందులో స్థానం దొరుకుతుందని నా అభిప్రాయం.

అభ్యుదయ రచయితల సంఘంలో ప్రారంభ దినాల నుండి వుండి 20 సంవత్సరాల వయస్సులోనే మహాద్భుత కవిత్వం సృజించి 90 సంవత్సరాల పైబడిన వయస్సులో తనువు చాలించిన సోమసుందర్ తన స్వీయ చరిత్రని కలలు – కన్నీళ్లు (ప్రథమ భాగం) పూలు – ముళ్ళు (రెండవ భాగం) గా వెలువరించారు.

అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ఆత్మకథలు విశిష్టమైనవి. కథ, నవల, కవిత్వం, వ్యాసం అన్నీ ఇందులో చూడవచ్చు. ఒక ప్రాంతం గురించో, ఒక ఉద్యమం గురించో, ఒకానొక కాలం గురించో చాలా సమాచారం తెల్సుకోటానికి కూడా ఆత్మకథలు ఉపయుక్తంగా వుంటాయి. అభ్యుదయవాదులు తమ తమ ఆత్మకథలకు 'ఆత్మకథ' అని పెట్టుకోకుండా, స్వీయచరిత్ర అని కూడా రాసుకోకుండా అనుభవాలనో, జ్ఞాపకాలనో పెట్టుకున్నారు. సమిష్టి నిర్ణయాల్తో సాగిన తమ జీవనయానాల్ని 'నా' అని ఆత్మకథ అని రాసుకోవటానికి మొహమాట పడిన వారే ఎక్కువ. సోమసుందర్ రెండు భాగాలకు పైన స్వీయచరిత్ర అని పెట్టుకున్నా తన ఆత్మకథ అనే ప్రతిపేజిలోనూ వచ్చింది. తన సుదీర్ఘ జీవితంలో ఊహించినన్ని విషయాలు, గోదావరి జిల్లాల విశేషాలు లేకపోయినా మొత్తంపై ఈతరం తెల్సుకోదగిన కొన్ని విషయాలు ఉన్నాయి.

సోమసుందర్ తూర్పుగోదావరి జిల్లాలోని శంఖవరంలో కాట్లూరి వారింట జన్మించి పిఠాపురంలోని ఆవత్స వారింటికి దత్తు వెళ్లాడు. పుట్టిన తేది స్పష్టంగా ఎక్కడా రాయకపోయినా ఇతర తేదీల్ని బట్టి 1924 నవంబర్ 18గా నిర్ధారించవచ్చు. సోమసుందర్ తండ్రి అన్నవరం వెళ్లి అల్లూరి సీతారామరాజుని తమ గ్రామానికి ఆహ్వానించి వచ్చినందుకు అతని కరణీకం పోగొట్టుకున్నాడు. మళ్లీ రాజాజీ ముఖ్యమంత్రి అయిన తర్వాత 1936లో దాన్ని తిరిగి యిచ్చారు.

సోమసుందర్‌పై ప్రారంభంలో చలం ప్రభావం పడినా కమ్యూనిస్టు పార్టీ పరిచయం కారణంగా దాన్ని అదుపులో వుంచి రక్షింపబడ్డానని, ఇంత ఆయుర్దాయం తనకి యిచ్చింది కూడా కమ్యూనిస్టు పార్టీయేనని ఆయన చెప్పుకున్నాడు.

సోమసుందర్ తండ్రి పేరు, తాత పేరు కూడా వెంకటరావే. తనని కలక్టర్ చేయాలని వాళ్ల అమ్మ ఇంగ్లీషు చదువులో పెట్టింది. 11 సంవత్సరాల వయస్సులోనే నాటకంలో కృష్ణుడి వేషం వేశాడు. ఈ స్వీయచరిత్ర ద్వారా తెలిసే మరికొన్ని విషయాలు.

– 1930లో పిఠాపురం సంస్థానంలో వీణావాదకులైన సంగమేశ్వర శాస్త్రి గారి నెల జీతం 3 రూపాయలు.

– మాలపల్లి సినిమా ప్రదర్శించే హాలు దగ్గర మతోన్మాదులు పిల్లల్ని తీసుకెళ్లి పికెటింగ్ చేయించారు.

– దివాణంలో దివాణందాసీలనే కులం వాళ్లు వుండేవారు.

– సోమసుందర్ తదితరులు శ్రీశ్రీని కలవడానికి మద్రాసు వెళ్లినప్పుడు ఆయన బలవంతంగా భోజనానికి తీసుకెళ్లాడట. కాని శ్రీశ్రీ గారింట్లో బియ్యం లేనందున, బయటకెళ్లి బిస్కట్లు తిని, రొట్టెలు తిని, శ్రీశ్రీకి సిగిరెట్ పెట్టె, అగ్గిపెట్టె యిప్పించి, ఆయన అడిగిన మీదట బియ్యానికి 10 రూపాయలు యిచ్చి వచ్చారు.

– మద్రాసు నుండి హౌరా మెయిల్లో వెళ్తున్న రవీంద్రనాథ ఠాకూర్‌ని పిఠాపురం స్టేషన్‌లో చూశారు. అదే సమయానికి అక్కడ కొచ్చిన కృష్ణశాస్త్రి కూడా కన్పించారు.

– సోమసుందర్ తాత పిఠాపురం సంస్థానంలో దివాన్‌గా వున్నారు. ఆయన జీతం 8 రూపాయలు

– సోమసుందర్ పెళ్లికి 2500 కట్నంగా యిచ్చారు.

– పిఠాపురం రాజా భార్య చనిపోవటంతో సంగీత, సాహిత్యాల పట్ల, పశుపోషణ, దానధర్మాల పట్ల విముఖత ఏర్పరుచుకొని ఎన్నికల్లో పళ్లంరాజు గారిపై ఓడిపోవటంతో మద్రాసుకు మకాం మార్చాడు.

– ఆ ఎన్నికల్లో నెహ్రూ, సరోజిని నాయుడు వేర్వేరుగా ప్రచారంకి వచ్చారు. నెహ్రూ గారి ఉపన్యాసం వినబడకుండా పోలీసులు డప్పులు వాయించేసేరట.

– 1943లో కాకినాడ రాజకీయ పాఠశాలకు టీచరుగా వచ్చిన వుచ్చలవల్లి సుందరయ్యని బాంబులు, మారణాయుధాలు వుంటాయని పోలీసులు తనిఖీచేస్తే, బెడ్డింగ్ నిండా పుస్తకాలూ, ఒక జత బట్టలు, ఒక తువ్వాలు, ఒక దుప్పటి వున్నాయట. దాంతో పోలీసులు వెర్రిమొఖాలు వేశారు.

– సోమసుందర్‌కి 1942లో ఆనాటి జిల్లా పార్టీ కార్యదర్శి మహీధర జగన్‌మోహన్ రావు సంతకం చేసి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం యిచ్చాడు.

– సోమసుందర్ తన పొలం కొంత అమ్మి వజ్రాయుధం అచ్చువేయిస్తూ అప్పుడే శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, అనిశెట్టి లకు కవితా సంపుటాలు కూడా వేస్తానని రాశాడట. అనిశెట్టి, దాశరథి గార్లు ప్రచురణ వేరే వాళ్లు వేస్తున్నారని చెప్పగా, శ్రీశ్రీ సమాధానం చెప్పలేదు.

– మహాప్రస్థానం కంటే ముందుగా వజ్రాయుధం, ఆరుద్ర త్వమేవాహం అందుకే ప్రచురింపబడ్డాయి.

– విద్యార్థి ఫెడరేషన్ మహాసభలకు ప్రతినిధులుగా కలకత్తా వెళ్లినప్పుడు శాంతినికేతన్‌కి వెళ్లారు. అప్పటికే రవీంద్రనాథ్ ఠాగూర్ చనిపోయాడు. అక్కడ నుంచి ఆశీ, అలహాబాద్, ఆగ్రా, సారనాథ్‌లు దర్శించుకున్నారు. ఈ భాగం ఒక ట్రావెలాగ్‌లాగా నడిచింది.

– ఆనందవాణి పత్రికకు రాసేవాళ్లలో ముగ్గురు రామశాస్త్రులు ఉన్నందున రామశాస్త్రి పేరుని రాంషాగా సోమసుందర్ మార్చాడు.

– కాశీలో అప్పటి బెనారస్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ని కలిసారు.

– కళాకేళి పత్రిక కోసం పిత్రార్జితమైన 9 ఎకరాల పొలం సోమసుందర్ అమ్మేశాడు.

– పిఠాపురం రాజా వారి షష్టి పూర్తి ఉత్సవాల కోసం రైతుల నుండి డబ్బు వసూలు చేస్తే పార్టీ తరపున ఆందోళన చేసి డబ్బు వెనక్కి యిప్పించారు.

– పార్టీ తరపున సి.వి.కె. రావు పోటీ చేయగా రైండా జమీందారు గెలిచాడు.

– ప్రొక్యూర్‌మెంట్ ఉద్యమం, అచ్చంపేట చెరువు తగాదా, జీడిమామిడి అడవి ఉద్యమం సందర్భంగా ఒకసారి రెండు నెలలు మరోసారి 5 నెలలు జైల్లో వున్నారు కొంత కాలం అజ్ఞాతంలో కూడా వున్నారు.

– పార్టీకి రాజీనామా చేయమని దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒత్తిడి చేసినా సోమసుందర్ అంగీకరించలేదు.

– ముంగడ అగ్రహారంలో మహీధర వారి కుటుంబం స్వంతంగా ప్రెస్సుపెట్టి అభ్యుదయ సాహిత్య ముద్రణ భారాన్ని వహించారు. ఆడవాళ్లతో సహా కుటుంబ సభ్యులందరూ ప్రెస్సు పని చేసేవారు. గ్రామాల్లో తిరిగి సాహిత్యం అమ్మేవాళ్లు. వజ్రాయుధం వారి ప్రెస్సులోనే అచ్చయింది.

– కాకినాడ నుండి కళాకేళి పత్రిక 1968 నుండి 1973 వరకు వచ్చింది.

– శ్రీశ్రీ షష్టి పూర్తి సభలకు, విరసం ఏర్పాటుకు, శ్రీశ్రీ సప్తతి సభలకు సోమసుందర్ ప్రత్యక్ష సాక్షి.

– ఆరుద్రతో కలిసి సోమసుందర్ ఇంగ్లాండులో పర్యటించాడు.

– శ్రీశ్రీ సప్తతికి (1980) హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ వచ్చారు.

– స్వాతంత్ర్య సమరయోధునిగా భావనాచారికి వున్న రైల్వేపాస్‌పై ఇద్దరూ దేశమంతా తిరిగారు.

– దుర్గాభాయి భర్త దేశముఖ్ గొప్ప మేధావి, ఆర్థిక వేత్త, అందగాడు. ఆయన సుమారు 200 కవితలు కూడా రాశాడు. తొలుత ఒక బ్రిటీష్ వనితని వివాహం చేసుకొని ఆమెద్వారా పుట్టిన పిల్లలకు భారీగా ఆస్తి ఇచ్చేసి కొంతకాలం బ్రహ్మచారిగా వుండి ఆ తర్వాత దుర్గాభాయిని చేసుకున్నాడు. తన యావదాస్తి ఆంధ్ర మహిళా సభకి ఇచ్చేశాడు.

– బందరులో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ సభల్లో చిత్తూరు నాగయ్యకు, స్థానం నరసింహారావుకి సన్మానం చేశారు. ఈ ఉత్సవాల్ని చల్లపల్లి జమిందారు, నూజివీడు జమిందార్‌లు పర్యవేక్షించారు.

– విద్యార్థి ఉద్యమంలో సోమసుందర్ పనిచేసిన సంస్థని చాలా చోట్ల ఎస్.ఎఫ్.ఐ అని రాసుకున్నారు. కాని అప్పుడు విద్యార్థి ఫెడరేషన్ పేరు ఎ.ఐ.ఎస్.ఎఫ్; ఎస్ఎఫ్ఐ ఏర్పడింది 1970–71 సంవత్సరాల్లో.

– కాశీలో 1944లో భోజనం 1 రూపాయి. అదీ గడ్డ పెరుగు పెట్టేవారు.

– సోమసుందర్‌పై 1943 నుండి శ్రీశ్రీ ప్రభావం వుంది.

ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నపుడు ప్రారంభం నుండి శంకరంబాడి సుందరాచారి రాసిన మీ తెలుగు తల్లికి గీతం వినిపిస్తూనే వున్నారట. 1941లో ఈ గీతంతో పాటు ఓ రవీంద్రా లేవా? అనే ఠాకూర్ స్మృతి గీతాన్ని టంగుటూరి సూర్యకుమారి గానం చేయగా గ్రాంఫోన్ రికార్డు చేశారు. తర్వాత కాలంలో ఆమె ఇంగ్లాండులో స్థిరపడ్డారు. ఆమెను సభలకు ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. సుందరంబాడి వస్తుంటే ఎంట్రన్స్ గేటులో చేతులతో వెనక్కి లాగేశారు. ఆయన అప్పుడే వస్తున్న సోమసుందర్‌ని చూసి ఒరే సోమసుందరం చూడరా వీళ్లు నన్ను లోనికి రానీయటం లేదు అన్నాడు. వెంటనే సోమసుందర్ పరుగెత్తుకెళ్లాడు. ఆ వెనుకే మంత్రి భాట్టం శ్రీరామమూర్తి కూడా వచ్చాడు. మా తెలుగు తల్లి గీత రచయితకు పట్టిన గతి అని సోమసుందర్ అనగా శ్రీంరామూర్తి తీసుకెళ్లి ముఖ్యమంత్రి జలగంకి, విద్యామంత్రి మండలి కృష్ణారావుకి చెప్పగా వారు ఆయన్ని ముందు వరుసలో కూర్చోబెట్టి ఆ తర్వాత సముచిత రీతిలో సత్కరించటం జరిగింది.

– గుత్తనా యని జాతిముత్యాలు

గుచ్చినాడే భక్తితో అనే ముత్యాలసరం కృష్ణశాస్త్రి గారి కృష్ణపక్షం సంపుటిలోనిది. దీన్ని కృష్ణశాస్త్రి రాయలేదు. చింతా దీక్షితులు రాశారు. ఆయన అనుమతితో దాన్ని తీసుకుని కొంత మార్పు చేసి కృష్ణశాస్త్రి తన పుస్తకంలో వేసుకున్నాడని జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి చెప్పగా ఆ విషయం సోమసుందర్ గారు దీక్షితుల్ని అడిగాడు. అవును నిజమే అని దీక్షితులు అన్నాడట. మీరు ఆ గేయాన్ని యిష్టపూర్వకంగా ఆయనకిచ్చారు. ఆయన చిన్న చిన్న మార్పులతో తన పుస్తకంలో వేసుకున్నారు. దానిని మీరు ఆమోదించారు. ఇంత కాలానికి రుక్మిణీనాథ శాస్త్రి ప్రచారం చేస్తుంటే మీరు సమర్థించటం సముచితమా? అని అడగ్గా ఆయన తటపటాయించాడట. ఎప్పుడో మాటల సందర్భంలో రుక్మిణీనాథ శాస్త్రికి చెబితే చాలా కాలం తర్వాత దాన్ని తవ్వి తీసి నన్ను నిఖిచ్చి చేశాడన్నాడు.

అంత గొప్ప కవి ఆప్త్రాల్ ఒక గీతం కోసం అంత కక్కుర్తి పడతాడా? అది మహత్తర గీతం కూడా కాదే? అంటే కృష్ణశాస్త్రి దృష్టిలో అది మహత్తర గీతమే అన్నాడట. వీళ్ల సంభాషణలోనే రోషనారా నాటకం అందరూ అనుకున్నట్లు కొప్పరపు సుబ్బారావు వ్రాసినది కాదని కోవల్లె శివకామేశ్వరరావు వ్రాశాడని ఈ విషయం శ్రీ వాత్సవ ఆంధ్రప్రభలో వ్యాసం రాశాడని వచ్చింది. కృష్ణశాస్త్రి గీతం విషయం కూడా వాగ్వివాదాలు రగలకుండా ఆంధ్రప్రభలో సోమసుందర్ ఒక వ్యాసం రాసి ఆ వివాదానికి ముగింపు పలికాడట.

మొత్తం పైన నేను ఎంతో గొప్ప అంచనాతో చదివిన ఈ స్వీయ చరిత్ర కదనంలో గాని, ఆనాటి కాలమాన పరిస్థితుల వ్యక్తీకరణలో గాని నా అంచనాకి సరిపోలేదు.

బహుశా ఆయన స్వయంగా రాయలేక లేఖకునికి చెప్పి రాయించటం వలన గాని, 80 ఏళ్ల వయస్సు దాటిన కారణంగా జ్ఞాపక లుప్తలై కాని ఈ లోపం జరిగి వుండవచ్చు. ఆత్మకథల్లో వున్న విశేషమేమిటంటే ఎంత అనామకులు రాసినా, కదనంలో ఎన్ని లోపాలున్నా మనకి తెలియని ఒక్క విషయమైనా అందులో వుంటుంది. ఆ మేరకు సోమసుందర్ కలలు – కన్నీళ్లు, పూలు – ముళ్లూ చదవటం ఉపయుక్తమే. చివరగా ఆయన గీతపాదంతో వ్యాసం ముగిద్దాం.

*"తన చరిత్ర తనె పఠించి*
*ఫక్కున నవ్వింది ధరణి;*
*తన గాథను తనె స్మరించి*
*భోరున ఏడ్చింది ధరణి"*

♦

## కవిత

# వీడ్కోలు

- దాకరపు బాబూరావు
9848993599

కరోనా కవిత

దయచేసి!
మమ్మల్ని క్షమించండి!!
మీకొచ్చిన కష్టానికి
మిమ్మల్ని ఆదరించి
అక్కున చేర్చుకో లేకపోయిన
మా అమానవీయతను
ఈ సారికి మన్నించండి.........!!
ఏవో నాలుగు చెమట చుక్కల్ని
మా పంట చేలల్లో చల్లి
కూలి గింజ లేరు కెల్లటానికి
ఏటా వచ్చివాలే
వలస కూలి పక్షుల్లాగే మిమ్మల్ని
చూసినందుకు
మన్నించండి.........!!
అర్ధాంతరంగా మీరెల్లిపోతుంటే
మీరు నాటిన
అనుబంధాల వేళ్ళు
పెల్లగించుకుని పైకొస్తుంటే గాని !
అర్థం కాలేదు.........!!
పొద్దు పొడిచే పొడవకముందే
మా పంట పొలాలల్లో
పని మొలకలై తళ్ళుక్కున మెరిసే
మీ స్వేద జలరాశుల
తళుకుల సౌందర్యానికి
సూర్యుడే ముగ్గుడవ్వని రోజుందా !
అని మేం గ్రహించలేకపోయాం !!
జీవనం మీకు పోరుబాటైన వేళ
ఆకలి కడుపుల్ని మోసుకుని
ఊళ్ళొదిలి గూళ్ళొదిలి
ఊరిగాని ఊరొచ్చిన
మీ గుండె గదుల్లోని
ఆవేదనా తెరల్లోకి
ఏనాడూ ! తొంగి చూడనైనా చూడని
అహంకార దర్పం మాది !!
ప్రాణం మీద కొచ్చి
లోకమంతా బతుకులకే తాళాలు
వేసుకున్న వేళ
సాలె గూట్లో చిక్కుబడ్డ
అమాయక ప్రాణుల్లా
మీరు అల్లాడుతుంటే.........!!
ఏదో సాయం చేస్తున్నట్టు
ఫోటోలకు ఫోజులివ్వడానికి
మేం చాచిన చేతుల్లే
దేవుళ్ళంటూ కళ్ళకద్దుకున్న
మీ అమాయకత్వం
వచ్చిరాని భాషలో
కృతజ్ఞతా వచనాలై మీరుపెట్టిన
దణ్ణాలూ.........
గుండెల్లో కలుక్కుమనేల
మాకు గుచ్చుకుంటూనేవున్నాయి !!
మూటా ముల్లే సర్దుకుని
సొంత ఊళ్ళకు దార్లెతుక్కుంటూ
మీరలా నడిచెల్లిపోతుంటే
మిన్నకుండిపోయి
మీరెక్కి వెళ్ళాల్సిన రైళ్ళు
మీ బ్రతుకు లోగిల్లెక్కి
మీ ప్రాణాల మీద నుంచి
వెళ్లిపోతున్న వేళ
మీకు సాయం కొమ్మలం
కాలేకపోయిన
మమల్ని
మన్నించండి...............
మన్నించండి................ ◆

# పుస్తకం


- ఈదర శ్రీనివాసరెడ్డి
7893111985

మట్టి మెదళ్ళలో
ఆలోచనల విత్తనాలతో
సాగిన అక్షర సేద్యానికి
ప్రతిఫలమే ప్రతి పుస్తకం
అంతరంగ సాగరంలో
సాగిన అంతర్మథనంలో
ఉద్భవించిన అమృత
బాండమే ప్రతి ప్రబంధం
అణగారిన గుండెలోతుల్లో
వెలికి రాని భావాల
ఆణిముత్యాల మణి
హారమే ప్రతి పర్వం
అక్షరాల పూలతోటలో
సాహితి తుమ్మెదలు
పోగేసిన మకరందాల
తేనె పట్టు ప్రతి కావ్యం
మరపురాని జ్ఞాపకాల
లోగిలిలో రెపరెపలాడే
అక్షర తోరణాల
సమారోహమే ప్రతి సర్గం
అజ్ఞాన తిమిరంలో
కొట్టుకుపోతున్న యువతకు



మార్గం చూపే చిరు దివ్వెల
వెలుగే ప్రతి శాస్త్రం
అనుభవాల మూకుళ్ళలో
జీవిత సత్యాల తాలింపులతో
కల బీములు వండి వార్చే
వంటకమే ప్రతి గ్రంథం
మూఢనమ్మకాల మత్తులో
జోగుతున్న మస్తకాలను
తట్టి లేపే చైతన్యపు వెలుగు
బావుటానే ప్రతి పుస్తకం ◆

విశ్లేషణ





వింధ్యావాసినీ దేవి

# సప్తవర్ణాలు చిందించిన కవిత్వం


- జంధ్యాల రఘుబాబు
9849753298


*మనసుకు హత్తుకుపోయే, పుస్తకం మూసినా గుర్తొచ్చే, మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే నానీలు ఇందులో ఎన్నో ఉన్నాయి. చదివినప్పుడు ఓస్ ఇంతేనా అనిపించినా రాయడానికి పోతే కాని దాని వెనుక ఉన్న శ్రమ తెలియదు.*

తెలంగాణలో "సింగిడి" అంటే ఇంద్ర ధనస్సు. కుమారి వింధ్యవాసినీ దేవి రాసిన ఈ "నానీల సింగిడి" సప్త వర్ణాలలో వెలుగుతూ వివిధ విషయాల్ని సూక్ష్మ రూపంలో మనకు తెలుపుతుంది. కర్నూలు కసిరెడ్డి వేంకటరెడ్డి పి.జి. కళాశాలలో సహాయక ఆచార్యులుగా పనిచేస్తూ, వివిధ సదస్సులతో ఊపిరి సలపకుండా ఉండే వీరు అప్పుడప్పుడూ రాసిపెట్టుకున్న నానీలతో కూర్చిన హరివిల్లే ఈ నానీల సింగిడి. అందులో ఎక్కువభాగం రెండువేల ఏడు, ఎనిమిది సంవత్సరాల్లో రాసినవి. చిన్నతనంలోనే తనువు చాలించిన తన సోదరి ఇందిరా ప్రియదర్శినికి అంకితమిచ్చిన ఈ నానీల సంపుటికి నానీల పితామహుడు ఆచార్య డా.ఎన్.గోపి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొ. సూర్యాధనంజయ్, తమ కళాశాల ప్రిన్సిపల్ డా.సి.వి.రాజేశ్వరి ముందు మాటలు రాశారు. ఇక ఈ సింగిడిలో తెలంగాణ యాస ఉండక పోవడం విశేషం.

నానీల ప్రక్రియ గురించి చెప్పాలంటే ఎందరో వచన కవులు కవితలు, మినీ కవితలు రాస్తారే కాని నానీల జోలికి వెళ్ళింది ఏ కొద్ది మంది మాత్రమో ఉంటారు. ఈ ప్రక్రియలో సాధన చేసిన వాసిని ఇంకా ఇందులో రాటుదేలవలసి ఉంది. కొన్ని కొన్ని చోట్ల అవి సంఖ్యకు మాత్రమే సరిపోయాయి, ఆ విషయం ఆమే చెబుతారు కూడా. మనసుకు హత్తుకుపోయే, పుస్తకం మూసినా గుర్తొచ్చే, మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే నానీలు ఇందులో ఎన్నో ఉన్నాయి. చదివినప్పుడు ఓస్ ఇంతేనా అనిపించినా రాయడానికి పోతే కాని దాని వెనుక ఉన్న శ్రమ తెలియదు. అందుకు వాసినిని అభినందించక తప్పదు.

***లోతుగా ఉన్నది సముద్రమొక్కటే అనుకుంటాము కాని "సముద్రమొక్కటే/ లోతైనది కాదు/ సుజ్ఞాని/ అంతరంగం కూడా!"*** అని మనిషి అంతరంగాన్ని చక్కగా ఆవిష్కరించారు వింధ్య వాసిని. ***"మౌనాన్ని/ మాట్లాడమందాం!/ ఎన్ని సముద్ర ఘోషల్ని/ వినిపిస్తుందో మరి"*** అని మౌనంలో వినిపించే సముద్ర ఘోషల్ని చెప్పే ప్రయత్నం చేశారు. మౌనం మాట్లాడడమే ఒక ప్రయోగం. అసలు జీవితం ఎప్పుడు మొదలవుతుంది అది చెప్పే పాఠాలేమిటి, పెట్టే పరీక్షలేమిటి, అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే మాత్రం ఇది చదవండి ***"పరీక్షలు/ ముగిసాయని సంతోషమా!/ జీవిత పాఠాలు/ నేర్వాల్సింది ఇకపైనే...".*** అలా విద్యార్థి జీవితాన్ని తదనంతర జీవితాన్ని ఒక నాలుగు పంక్తుల్లో చెప్పడం సాహసమే. వాసిని పట్టు సాధించారందులో.

"గాయపడిన కవి గుండెలలో రాయ బడని కావ్యాలెన్నో" అన్నారు దాశరథి. అసలు కవులు ఏం రాయాలనుకుంటారు, ఎలా రాయాలనుకుంటారు అని కనుక ఆలోచిస్తే ఎన్నో

విషయాలు బయట పడతాయి. అందుకేనేమో ***"లిఖితమో మౌఖికమో/ ఏదైతేనే?/ కవితా దాహం/ తీర్చుకుంటున్నాడు కవి"*** అంటూ ప్రోత్సహిస్తారు రాసేవాళ్ళను. ***"నిశ్శబ్దాన్ని/ విని చూడు/ నీలోని ధ్వనులన్నీ/ పలుకుతాయి"*** అని, ***"లిపి భాషకే కాదు/ మనుషులకు కూడా/ కొన్ని మనసులు/ మాట్లాడలేవు"*** అని చెబుతారు. ***"కలం/ తడిగా ఉందెందుకో?/ కన్నీటిని/ అక్షరీకరిస్తున్నందుకా?"*** అని అక్షరంపై కలానికి, కలంపై తడికి ఉన్న సంబంధాన్ని చెబుతారు. ***"హృదయంలో/ భావాలెన్నుంటేనేం?/ కలానికి/ పని"*** , ***"కవిత్వంలో/ కన్నీరు ప్రవహిస్తూంది/ కవి పూర్ణ/ బడుగుజీవి మరి!"*** ఇలా తాము రాసే కవిత్వంపై నానీలను రాశారు.

గెలుపు ఓటములను తూకం రాళ్ళుగా చూసే ఈ నవీన కాలంలో అసలైన లక్ష్యం ఏది అన్న ప్రశ్నకి–

***"సంతోషమే/ లక్ష్యం కావాలి/ గెలిచినప్పుడే కాదు/ ఓడినప్పుడు కూడా!" అని అని ఉద్బోధ చేస్తారు.***

***విజయం వరించినప్పుడు "విజయం/ వరించిందా?/ సంకెళ్ళు వేసి బంధించు/ అహంకారాన్ని"*** అని సందేశమిస్తారు.

చదువుకోని వారిని కొందరు చులకన చేస్తారు. కాని ***"నిరక్షరాస్యుడా!/ అయితేనేం?/ అనుభవ జ్ఞానం/ విస్తృతమే కదా!"*** అంటూ అసలైన అనుభవం జీవితాన్నుండి వస్తుందని చెబుతారు. పర్యావరణం పై స్పందిస్తూ ***"తరాలనాటి వృక్షం/ తలొంచుకొని/ బలౌతుంది/ నగరాభివృద్ధి కోసం"*** అని నగరీకరణను వేలెత్తి చూపుతారు.

గుండెకు తగిలే గాయం గురించి చెబుతూ ***"గాయంతో/ ఆ గుండె మూగవోయింది/ మారణాయుధంతో కాదు"*** అని అంటూనే ***"మనుషులు మారాలా?/ అయితే/ మనసులకు/ రూపం రావాలి"*** అని పరిష్కారమూ చూపుతారు.

***"అతడు/ మహోన్నత మానవతావాది/ కన్నీటి రుచి/ తెలిసినవాడు"*** అని నిజమైన మానవతావాదిగా ఎప్పుడు మారతాడో చెబుతారు. మానవీయ విలువల్ని ఎక్కడ వీలైతే అక్కడ చొప్పించడం వింధ్యగారికే చెల్లింది.

కవిత్వం రాసిన కాలానికే కాదు తరువాత కూడా బతకాలంటే అది సర్వ కాలాలకూ సరిపోవాలంటారు. కరోనా వచ్చి అందరూ సతమతమవుతుంటే దేవుడి ఆలయాలని కూడా మూసేశారు.

***"దైవం/ కళ్ళు తెరిస్తే బాగుండు/ జన రక్షణకు కాదు/ తన రక్షణకే..."*** ఈ నానీ చదివి మీరే పోల్చుకోండి ఇప్పుడు సరిపోతుందో లేదో. అలాగే ఇప్పుడు ఆన్ లైన్ క్లాసుల గురించి వింటున్నాం. మెల్లగా విద్యా వ్యవస్థనే మార్చే పనిలో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయ్.

***"నల్లబల్ల/ చిన్నబోయింది/ డిజిటల్ బోర్డూ.../ ఎంత పని చేశావు నువ్వు"*** అంటూ రాసిన నానీ ఇక్కడ సరిగ్గా సరిపోతుంది కదా.

***"మెదడుకు/ పని లేదిప్పుడు/ సమస్తం/ జీబీల్లోనే నిక్షిప్తం"*** అనడం కూడా చక్కగా సరిపోతుందీ సమయాన. ***"ధరణికి ఆభరణం/ పచ్చలహారం కాదు/ హరితహారమే/ అందం"*** అన్న ఈ నానీ కూడా తిరిగి పొందిన, పొందాల్సిన పచ్చదనాన్ని గుర్తుచేస్తుంది. ఈ కరోనా కంటే ఎంతో ముందు రాసిన నానీలివి.

***"చంద్రమండలం పై/ ప్లాట్ సంపాదించారా!/ మరి ఎదుటి వ్యక్తి/ మనసులో?"***

***"దేశాంతరం వెళ్ళిన/ పక్షి తిరిగొస్తుంది/ మార్కెట్టుకు/ వెళ్ళిన మనిషి?"***

***"నీరు ఇంకిపోయింది/ భూమిలోనే కాదు/ ప్రతి రైతు/ కన్నుల్లో కూడా..."***

***"అస్తిత్వ పోరాటం/ ఆస్తి లో వాటాకు కాదు/ ఆత్మగౌరవానికి/ తొలి మెట్టు"***

***"సొంత గొంతును/ వినిపించాను మొదటిసారి/ మిత్రులు/ శత్రువులయ్యారు"***

***"బతుకమ్మ సిగలో/ మందారం/ ప్రపంచ పటంలో/ తెలంగాణ సింగారం"***

***"పసి పిల్లలను/ విదిలిస్తున్నాడతడు/ పసి హృదయం/ లేదు కాబోలు!"***

***"భరతమాత/ కోరింది/ స్వచ్ఛ భారతే కాదు/ స్వచ్ఛ హృదయాల్ని సైతం"***

***"భాషా నైపుణ్యానికి/ నిఘంటువులెందుకు?/ జనం లో/ కలిసిపో"*** ఇలా చాలా నానీలు మనల్ని కట్టిపడేస్తాయి.

వర్షం వచ్చినప్పుడే ఇంద్రధనస్సు కనిపిస్తుంది. ఈ నానీల సింగిడే కాకుండా వర్షానికి మొలకెత్తే చెట్లలా, పాడి పంటల్లా వింధ్యవాసినీ దేవి కవిత్వం ఎన్నో రూపాల్లో విరబూయాలని, విరగ పూయాలని ఆశిద్దాం. ◆

## కవిత

# కరోనా! అబ్ తూ మరోనా!

- డా.ఎన్. గోపి

కాగితమక్కరలేదు
భూగోళం మీద
కర్కశగీతం రచిస్తోంది కరోనా.

చేతిలో కత్తులుండొచ్చు
జేబులో బాంబులుండొచ్చు
కరోనాకు భయంలేదు
ఊపిరితిత్తులుంటే చాలు
ఉత్త చేతుల్తో పోదు.

రాచరికాన్ని వెలిగించిన
ప్రిన్స్ చార్లెస్ అయినా
సాక్షాత్తు బ్రిటన్ సామ్రాజ్యాధినేత
అయినా
వైరస్ ముట్టుకుంటే
యస్! పారిపోవలిసిందే.
ఫ్లయింగ్ నేషన్
భూమ్మీద
కుప్పకూలక తప్పదు.
వ్యాపార జీవితాలకు
సాంఘిక దూరం ఉండదు.

కరోనా కవిత

విలాస విహారాలను
కులాసాగా
పలకరిస్తోంది కరోనా.
ఇవాళ మానవాళికి
లిట్మస్ పరీక్ష కరోనా
తీగలాగితే ఏక్కడో బిగుసుకునే
మృత్యువీణ కరోనా!

వలస బతుకుల్ని
అనాథలను చేసి
స్వార్థం సరిహద్దులకు
కొత్తభాష్యం నేర్పింది కరోనా.
సొంతూళ్లకు వెళ్లినా
ఎదురయ్యేది అదే కదా!

అంతటా లాక్ డౌన్
ఇండ్లు లేనివారు డౌన్ డౌన్
వేలాది మైళ్ళు నడిపించే
లక్షకాళ్ళ జెర్రి కరోనా.

కర్తవ్యాలను గుర్తుచేశావు.
భయం తరగతి గదిలో
పాఠాలు నేర్పుతున్నావు.
ఇక చాలు
కరోనా! తూ అబ్ తో మరోనా.

---

# కరోనా హైకూలు

- వై. రవీంద్ర
9440818295

కరోనా కవిత

విలక్షణమైన సంవత్సరం.. ట్వంటీ ట్వంటీ
అందరి శ్వాసల్ని దోచేస్తున్న.. ఫోర్ట్వంటీ!

శ్వాస.. కరోనా సహితం!
ఆశ... కరోనా రహితం!

తుమ్మితే... మరణం...
శిక్షస్మృతి మార్చాల్సిన తరుణం!


కరోనా దాహానికి చాలని సమాధిపెట్లు
చెక్కకోసం చంపేస్తారేమోనన్న భయంతో చెట్లు!

పూచిన మోదుగుల్లా వలసపక్షుల పాదాలు
వర్ణించడం వల్లకాదంటూ చేతులెత్తేసిన తెలుగు పదాలు!

నాడు కరం కరం కలపడం పలకరింపు
నేడది నిలువెల్లా వణికించే జలదరింపు!

స్తన్యమిస్తున్న మాతృత్వపు మమకారం...
ఆంక్షలకు అతీతమంటూ తలొగ్గిన సామాజిక దూరం!

## నచ్చిన రచన




# 'కాలం' లా విలువైన కథలు


- గబ్బిట దుర్గా ప్రసాద్
9989066375


***చురుకుదం ఆసక్తి , మానవ హృదయాల నిశిత పరిశీలన, అవగాహన, సహజత్వం, సరళ సుందర రచన, క్లైమాక్స్, అన్నీ చలపాక కథల్లో ఉన్నాయి. ఇవి ఈ కాలం కథలే కాదు, "e కాలం" కథలు కూడా.***

చలపాక ప్రకాష్ 2016 జూన్ నుండి 2020 జనవరి వరకు మూడున్నర ఏళ్ళలో రాసిన, వివిధ పత్రికలలో ప్రచురితాలైన 38 కార్డు, కాలం కథల సంపుటి ఈ (e)కాలం. ఒక గడుగ్గాయి పిల్ల దేవుడిని అరచి పిలిస్తే ప్రత్యక్షమైతే, పూర్వం నుంచీ ఇప్పటిదాకా ఆయనిచ్చిన హరి, బుర్ర కథల దగ్గర్నుంచి, ఈనాటి సెల్ ఫోన్ దాకా ఏకరువు పెట్టి, సెల్ ఫోన్‌లో ఉన్న అన్ని రకాల ఆప్స్, ఫేస్ బుక్, గూగుల్ సెర్చ్, టి.వి., సినిమా, టిక్ టాక్, గేమ్స్ వగైరా సవాలక్ష ప్రోగ్రామ్స్ చూడటానికి టైం మాత్రం రోజుకు ఇక్ష్వాకు కాలం నుంచి ఉన్న పాత 24 గంటలే ఉంచటం బాగాలేదని, రోజుకు 48 గంటలు చెయ్యాలని డిమాండ్ చేసిన "పాపా మజాకా" కథలో అండర్ కరెంట్‌గా సున్నిత హాస్యం వ్యంగ్యం దోబూచులాడాయి.

ఈనాటి బిజీ ప్రపంచంలో ఉద్యోగం చేస్తూనే, తనకున్న ఖాళీ సమయంలో సామాజిక ప్రయోజనమున్న షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నానని గురువు గారికి చెప్పి భేష్ అనిపించుకొన్న "ఆశలు -ఆశయాలు" హాస్య, కేరక్టర్ నటుడు రచయిత ఎల్బి శ్రీరాం తీస్తున్న "హార్ట్ ఫిలిమ్స్" ను గుర్తుకు తెస్తుంది. మధ్యతరగతి బతుకుల జీవితం, ముసలి తనంలో అండగా ఉంటానని తండ్రికి భరోసా ఇచ్చిన, స్వేచ్ఛగా పెరిగిన "టెక్" కూతురు, చదువుపూర్తై, ఉద్యోగం వచ్చి, ఎవడినో లేపుకు పోయి పెళ్ళాడి, పక్షిలా ఎగిరిపోతే ఆ తండ్రి గుండె పగిలి రెక్కలు విరగటం, కన్నీరు తెప్పిస్తాయి. కూతుళ్ళను ఇతర రాష్ట్రాలలో ఉద్యోగిస్తున్న అల్లుళ్ళ కిచ్చి పెళ్లి చేసి, వాళ్ళను చూడటానికి వెళ్లి అక్కడి పుణ్య క్షేత్రాలు, దర్శనీయ స్థలాలు చూసే అవకాశం పొంది" మేరా భారత్ మహాన్" అని చాటిన తెలివిగలాయన, నల్లమ్మాయి యెర్రని కుర్రాడు రోజూ తన్ను చూస్తున్నందుకు ప్రేమతో సిగ్గు పడుతోందికానీ, అతడు గుడ్డి అని తెలుసుకోక పోయిన "గుడ్డిప్రేమ" పెన్ను విలువ తెలిపే "ఆట్రాల్", రైల్వే వారి కొత్త విధానం వల్ల జనరల్ బెర్త్ లు ఫుల్‌ఐతే ఆర్ ఏ సి కోటాలో థర్డ్ ఏసిలో టికెట్ బుక్ అయి, ఎంతోకాలంగా ఏసిలో ప్రయాణం చేయాలన్న ఆర్థిక స్తోమతలేని సాదారణ ప్రయాణీకుడి తీరి(ర్చి )న కోరిక, అన్ని డే లు లాగే భగ్న ప్రేమికులకూ ఒక డే ఉండాలని, దానికి శరత్ దేవదాసు పుట్టిన రోజయితే బాగుంటుందని అతని బర్త్ డే ఎప్పుడో తెల్సుకోటానికి "ఒనిషాదాసు" స్వర్గంలోని "షరత్ బాబు" కు ఫోన్ చేయటం, సెరత్బాబు మందుబాబులకు ప్రతిరోజూ "మందు డే" అని చెప్పిన ఊహాత్మక కథలో వెర్రి తలలు వేస్తున్న "డే సెలబ్రేషన్స్"పై ఏవగింపు, రోత కనిపిస్తుంది. తెలంగాణా ఆంధ్రా విడిపోగా, పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నట్లు భార్యాభర్తలు విడాకులు తీసుకొని, చెరోకొడుకు ను పంచుకొని భర్త తెలంగాణలో, భార్య తన పుట్టిల్లు సీమాంధ్రలో సెటిలయితే నష్టపోయింది కుటుంబ వ్యవస్థా, కుటుంబం లాంటి తెలుగు రాష్ట్రమా అనే మూల ప్రశ్న సంధించాడు రచయిత. "విడి-ఆకులు" లో ఆర్ద్రంగా, తండ్రి

"మందుకు" బానిసై నరాల వీక్ నెస్‌తో ఆఖరి క్షణాలుగా ఉంటె, ఆయుర్వేదం మందు ఇప్పించమంటే, శ్రమపడి ఇప్పిస్తే "మందు మానెయ్యాలని ముందే షరతుపెట్టి", పది రోజుల్లో లేచిపరిగెత్తేట్లు చేశాడు ఆ డాక్టర్. నెల తిరిగేసరికి మళ్ళీ మంచం పడితే, ఇంగ్లీష్ డాక్టర్‌కి చూపిస్తే, పెదవి విరిస్తే మళ్ళీ ఆయుర్వేద వైద్యుడిని బ్రతిమాలి, ఇక తాగనని ప్రమాణం చేయిచి మందిప్పించి నయం చేయించాడు తండ్రిపై ప్రేమతో కొడుకు. కొంతకాలానికి ఆయన ఆలోచనల్లో వేగం పెరిగి, తెలీకుండా నదిలో మునిగి చనిపోతే, ఇంటికి పెద్ద దిక్కుగా తండ్రి ఉంటాడని నమ్మి, కొడుకు ఆయన వైద్యం కోసం చేసిన అప్పుల నరకంలో కూరుకుపోయి "వృధా ప్రయాస" తో తలపట్టుకు కూలిపోయి కొందరి జీవితాలింతే అనిపించాడు. వ్యసనానికి బానిసైతే అందరికీ యెంత అనర్థమో చెప్పే కథ.

నెలాఖరు రోజుల్లో చుట్టాలు ఇంటికి వస్తే, చేతిలో చిల్లిగవ్వలేక వాచీఅమ్మి, సరుకులు తెచ్చి ఇల్లుగడిపి వాళ్ళను సాగనంపితే వాళ్ళు వెడుతూ పిల్లల చేతిలో పెట్టిన డబ్బు తీసుకోటానికి హక్కు లేదని ఇంటిపెద్దగా బాధ్యతలే ఉంటాయని చెప్పిన భార్యను చూసి "ఏం జన్మరా ఇది" అనుకొన్న సగటు మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. కార్డు మీదనే కథలు రాసి పత్రికలకు పంపి, ప్రచురింపబడి గిన్నిస్ బుక్ ఎక్కి మహాత్మా గాంధీని అనుసరించిన ఒక కుర్రాడి కథ స్ఫూర్తిదాయకం."మాటవరుసకు" అనేమాట యెంత వెటకారంగా ఉంటుందో చెప్పిన కత, సెంటర్‌లో కాకుండా, తెలివిగా పక్క సందుల్లో పోలీసులు దొంగచాటుగా మాటేసి కేసులు రాయటంలో ఎవరు దొంగలో తెలీదు. నటుడు శోభన్‌బాబులాగా ముందు చూపుతో, రియల్ ఎస్టేట్‌లో డబ్బు పెట్టి రెండు ప్లాట్లుకొని ఎక్కువ రేటుకు అమ్మి, హాయిగా ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు ఘనంగా చేసి "భూ దేవి చేసిన పెళ్ళిళ్ళు" అని చాటిన ఉద్యోగి అభినందనీయుడు. తనకు పుట్టబోయే బిడ్డ మగపిల్లాడే కదా అని రిలాక్స్‌గా ఉండటానికి లేడీ డాక్టర్ను అడిగితే, "రిలాక్స్‌గా ఉండండి" అంటే "యురేకా" అని గావుకేక పెట్టాడు, నర్స్ డాక్టర్ని వాళ్లకు పుట్టేది అమ్మాయికదా అలా చెప్పారేమిటి అని అడిగితే, అమ్మాయి అని ముందే తెలిస్తే అబార్షన్ చేయిస్తాడు, డెలివరి అయ్యేదాకా వాళ్ళని రిలాక్స్ గా ఉండనిద్దాం అన్నది లేడీ డాక్టర్..శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

రోడ్డున పోతుంటే బంగారు నగ దొరికితే, దాన్ని ఎదురుగాఉన్న షాపు వాడికిచ్చి ఎవరైనా పోగొట్టుకొన్నామని వస్తే వారికి అంద జేయమని చెబితే, కొంతకాలానికి ఎవరూ రాలేదని షాపు ఆతను చెబితే, దాన్ని అమ్మేసి స్వచ్ఛంద సంస్థ వారు, మురికి ఆవాసాలలో ఉంటున్న ఇరవైమంది పిల్లలకు బట్టలు కొనటానికిచ్చి సార్థకం చేసి, ఆ డబ్బు ఎవరికి చేరాలో వారికే చేరిందని సంతృప్తి పడ్డాడు అతను.

కాలం మారినా కట్నాలిచ్చి ఆడ పిల్లల పెళ్ళిళ్ళు చేసే తీరులో మార్పు రాలేదని చెప్పే "మారనికాలం", పేరుమోసిన రచయితకు అనేక చెక్క జ్ఞాపికలొచ్చాయ్. కానీ "ఇంట్లో ఈగలమోతా, బయట పల్లకీ మోతా" అన్నట్లుగా. వాటి బదులు డబ్బు ఇస్తే బాగుండు కదా అని రోజూ భార్య సాధింపు. ఆయన చనిపోతూ, ఇంట్లో వారందరికీ సమన్యాయం చేసి, తన శవదహనం మాత్రం ఆ చెక్క జ్ఞాపికలతోనే చేయమని కోరి, ఇంట్లో వాళ్ళకు చెంప దెబ్బ కొట్టినట్లు చేసి, తనజ్ఞాపకాల ఆనవాళ్ళను తనతోపాటే తీసుకు వెళ్ళిన సోక్రటీస్ లాంటి ఆ రచయిత "జ్ఞాపికకథ" కళ్ళు చెమర్చేట్లు చేస్తుంది .

బిడ్డలపై కన్నవారికున్న ప్రేమ వాత్సల్యం "కన్నవారిమనసు"లో ఉన్నది."రాజు వెడలె రవి తేజము లదరగ" అన్నట్లు పంచాయితీ ఆఫీస్‌కు దారి రాజశేఖర రెడ్డి హెడ్డున్న విగ్రహం, తర్వాత ఆయనదే సిమెంట్ విగ్రహం, ఆ తర్వాత, చేయెత్తి నిల్చున్న విగ్రహం, తర్వాత తలకట్టు ఉన్న విగ్రహం, తర్వాత పులిచింతల ప్రాజెక్ట్ నమూనాపై నిల్చున్న ఆయన విగ్రహం, తర్వాత గుడ్డ కట్టేసిన విగ్రహం, దాటితే కంచు విగ్రహం కూడా దాటితే తళతళామెరిసే గోల్డ్ రాజశేఖం రెడ్డి విగ్రహం దగ్గర పంచాయితీ ఆఫీస్ అని ఒకాయన ఇంకో ఆయనకు అడ్రస్ చెబితే "ఏమి రాజ దర్పం" అనిపించదా ? ప్రజాధనం ఎంత వృధా అనిపించదా? మూర్ఖత్వానికి పరాకాష్ట అనిపించదా?

టివి సీరియల్స్ వదలక చూసే ఆవిడ కూతురికి వాటిని తీసే కెమెరామాన్ సంబంధం వస్తే ఈసడిస్తే, తీరికగా కాలక్షేపం చేసేవారికోసం తీసే ఆ సీరియళ్ళ వల్లనే టివిలు బతుకుతున్నాయని "పవర్ పాయింట్ ప్రెజెంటేషన్" లా భర్త నచ్చచెబితే, "కనువిప్పు కలిగి" ఆ కెమేరామాన్ సంబంధమే కూతురికి "వాకే" అని "ఓకే" చేసింది. "జీవి" తల్లికి హార్ట్ ఎటాక్ వస్తే, హాస్పిటల్‌లో డాక్టర్ వెంటనే స్పందించి మందులతో తగ్గించి 15 వేలు బిల్లు చేస్తే, ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ జరిగితే డబ్బు సేవ్ అయ్యేదని

# జైలు గది

- రేణుక అయోల
96768 53987

*ఎన్ని సార్లు ఈ గదిలో*
*విశ్రాంతిగా కునుకు*
*తీయాలనుకున్నా*
*గదిగోడలు చువ్వల్లా ఒంగి*
*జైలులా బంధిస్తాయి*
*ఖైదీ చుట్టూతా గదిలా-*

*అలవాట్లు*
*ఆలోచనలు*
*ఆత్మశోధనలు*
*తెగిపడిన తలల్లా వుంటాయి-*

*ఇష్టం లేని మరణాలు*
*చిలక్కొయ్య కొక్కానికి*
*వేళ్లాడుతూ వుంటాయి-*
*ప్రేమించిన కాగితాలన్నీ*
*వుండచుట్టుకుని*
*పాదాల కింద*
*నలుగుతూ వుంటాయి-*

*ఊపిరి మెల్లగా సాగుతూ*
*ఒక్కోసారి కెరటంలా ఎగిసిపడి*
*ఏ రకం నొప్పిని బయటకు రానీయకుండా*
*కళ్ళలో ఇసుక జల్లుతుంది*

*దీపం ఒత్తి జారిపోతుంది*
*చీకటిలో ఆఖరి వెలుగు*
*కునుకుతూ మలిగి పోతుంది.*

*గతం*
*కత్తికి అంటుకున్న కేకుముక్కలా*
*వేళ్ళతో, కళ్ళతో*
*రుచి చూడమంటుంది*
*తీపితో ముంచెత్తి*
*కన్నీళ్ళ నదిని దాచిన గది*
*జైలులా వుంది ...*

◆

---

నొచ్చుకున్న కొడుకును చూసి మిత్రుడు "వీడేం "జీవి" రాబాబూ" అని చీదరించుకొన్న "ఆరోగ శ్రీ" ఇవాళ ఫాషన్ కట్టెపోయ్యి బొగ్గుల కుంపటి పై వంట చేసే రోడ్డుపక్క ధాబాలు మళ్ళీ పూర్వకాలాన్ని "కాలమహిమ"లో గుర్తు చేస్తాయి.

భేతాళుడికీ స్మార్ట్ ఫోన్‌పై మోజు, ఖాళీ దొరికితే ఒకప్పుడు కథలు రాసే రచయిత, ఇప్పుడు స్మార్ట్ ఫోన్ మాయాజాలంలో లైకుల మత్తులో పడి, తీరిక దొరక్క రాయకపోవటం, పుస్తకం హస్త భూషణం మాత్రమేకాదు "మస్తక భూషణం" అనే విషయం, తన సన్మాన సభకు భార్యా, పిల్లలు టైం లేదని రాకపోతే, ఉసూరుమంటూ ఒంటరిగా వెళ్లి, సన్మానం శాలువా విలువైన జ్ఞాపిక పూలహారం, పురస్కార పత్రంతో సంతోషంగా తిరిగి ఇంటికి వస్తే, ఇంట్లో వారెవ్వరూ వాటి వైపు చూడకుండా ఇచ్చిన నగదు గురించే ఆరా తీసే డబ్బు మనుషులు, టివిలో సెల్‌లో అన్ని ప్రోగ్రాములు చూసి తల లావుగా వాచిన "మెదడు వాపు" ఆవిడా, చలికాలంలో ఫుట్ పాత్‌పై కట్టుకోటానికీ, కప్పుకోటానికీ సగం లేక ఏమీ లేని దీనులను చూసి, అర్ధరాత్రి తనకొచ్చిన అనేక శాలువాలు వారికి కప్పి అజ్ఞాతంగా వెళ్ళిపోయిన నిస్వార్థ సంఘ సేవకుడు, సరస్వతీ నిలయమైన గ్రంథాలయానికి, అక్కడ తరతరాలుగా వర్ధిల్లి ఎందరికో నీడ నిస్తున్న ఊడలు దిగిన మర్రి చెట్టునూ, తెలివిమాలి కూల్చి, కొత్త లైబ్రరీ భవనాలు కట్టించాలన్న కోరికతో ఉన్నా, ఘన చరిత్ర ఉన్న ఆ మర్రి జోలికి ఈ వెర్రి వెధవలు వెళ్ళకుండా పాటించిన విజ్ఞత "ఉనికి" కథలో ఉంది .

చురుకుదం ఆసక్తి , మానవ హృదయాల నిశిత పరిశీలన, అవగాహన, సహజత్వం, సరళ సుందర రచన, క్లైమాక్స్, అన్నీ చలపాక కథల్లో ఉన్నాయి. ఇవి ఈ కాలం కథలే కాదు, "e కాలం" కథలు కూడా.

సమకాలీన కథలే అయినా, వాటిలోని, ఆలోచన, మానవీయ విలువలు, శిల్పంను బట్టి సార్వకాలీనాలు. ఈ కథల్లోని వ్యక్తులు, సంఘటనలు సన్నివేశాలు, నిత్యం అందరం చూస్తున్నవే. కానీ వాటికొక అస్తిత్వ విలువ నిచ్చి, కథా గౌరవం కల్పించిన సాహితీ మిత్రుడు చలపాక ప్రకాష్‌ను అభినందిస్తూ, మరిన్ని రచనలతో వెలుగుల వెల్లువ సృష్టించాలని కోరుతున్నాను .

◆

## కవిత

# అప్రస్తుతమే అవసరమేమో

- డా. బాలాజీ దీక్షితులు పి.వి
8885391722



విషపు నాగులను
వేటాడటానికి కత్తులు - కర్రలు పట్టిన కాలంనుండి
బరువెక్కిన గుండెలను
ఓదార్చడానికి మందుకొచ్చే మానవీయ ఆసరాలనుండి
మదమెక్కిన  మనుషులను
బుద్ధి చెప్పడానికి చేదోడు వాదోడు గా నిలబడే
సన్నిహితులనుండి
దాటొచ్చిజి
మూగపోయిన చిరునవ్వులతో
వాడిపోయిన ముఖాలతో
కల్మషం కలుపుకున్న మనసులతో
ఎదురొచ్చే హృదయాలను
కరోనా మూసేసిందా మాస్కులతో
క్వారంటైను తో బంధీ చేసిందా ఇంట - బయట

అంబరాలు - ఆడంబరాలు కంటే
అణుకువ - నడక -నడత
జీవితానికి ముఖ్యమని తెలియజేస్తున్నట్లుంది కదూ....
నాటి అప్రస్తుతం - ప్రస్తుతానికి అవసరమేమో ♦

# బతుకునిమజ్జనం

- కంచనపల్లి ద్వారకనాథ్
9985295605



అక్కడ కొలువు తీరిన బొమ్మలు చూసిన
కనువిందు చేసే కళాఖండాలెన్నో
నిలువెత్తు వినాయకులే కాదు
పక్షులు, జంతువులు, పూలకుండీలైనా
సజీవ ప్రతిమలై శోభిస్తాయి
ప్రతిమ ఏదైనా అలవోకగా
రూపులు తీర్చి దిద్దగల విశ్వకర్మలే కాదు
వాటికి  మెరుగులు దిద్ది వర్ణశోభితం చేసే
రవివర్మలు కూడా వారు
పార్వతి దేవి నలుగు పిండితో
వినాయకుని సృష్టించింది ఆనాడు
వినాయకునికి ఎన్నో రూపాలు సృష్టిస్తున్నారు ఈనాడు
రోడ్ల పక్కన షెడ్లు వేసుకుని
హస్తకళే  బతుకు తెరువుగా నమ్ముకుని
రేయింబగళ్ళు శ్రమిస్తూ
కడుపు చేతబట్టి  ఆకలితో
బతుకు మెతుకులకై పోరాడే వారి
కష్టాల కడగండ్ల  కన్నీళ్లు చారికలు ఎవరు తుడుస్తారు?
కాలం తీసే  పరుగు పందెంలో
కాసుల కోసం పరిగెత్తే లోకంతో పోటీ పడలేక
కాలం పెట్టె బాధలు లోకానికి కనిపించక గుండెల్లో
దాచుకుని
నైరాస్యపు  నిశమయ  రాత్రులలో
రేపటి  భవిష్యత్తు పై  స్వప్న సౌధాలు  కట్టుకుంటూ
నిద్రలోకి  జారుకునే వారికి
వారు సృష్టించిన దేవతలు కల్లోకి వస్తారా ?
వారి ఆకలి  బాధ తీరుస్తారా ?
కళను నమ్ముకుని అమ్ముకుంటున్న
రెక్కాడితేకాని డొక్కాడని కళాకారులు వారు
ఊరేగింపులకు, ఉత్సవాలకు అందించే
ప్రతిమల తయారీలో
శ్రమకు తగిన ఫలితం లేక
బేరసారాలతో పండుగలు గడిచి పోతాయి
జీవిత చక్ర  భ్రమణంలో రాత్రింబవళ్ళు కలలు  కని
అలసిన  నేత్రాలు  వర్షించే  కన్నీటిలో
బతుకు నిమజ్జనం చేసుకునే  కళాకారులు వారు ! ♦

కథ



# బామ్మ


- వేణు మరీదు
9848622624


మా బామ్మ ఉదరంలోగానీ, హృదయంలోగానీ ఏదైనా 'మంట' మొదలైందంటే అది ఆస్ట్రేలియా అడవుల్లో మొదలయ్యే కార్చిచ్చే మరి! తుఫాను పట్టి కురిసే కుంభవృష్టి వల్ల ఆ కార్చిచ్చు ఆరిపోతుందేమోగానీ మా బామ్మ మదిలో ఆ 'మంట' వంటిది మొదలైందంటే ఏ అగ్నిమాపక యంత్రమూ దానిని చల్లార్చలేదు!

ఈ మధ్య బామ్మ 'మంటం'తా మా ఊళ్ళో ఉన్న మా పాత ఇంట్లో అద్దెకుంటున్న తోడు లేని 'ఆమె' గారి మీద!

గత రెండు వారాల్లాగానే మళ్ళీ ఈ ఆదివారం కూడా ఫోన్ మోగింది. ఇది తొంభైలల్లో ముచ్చట గాబట్టి మోగిన ఆ ఫోన్ సెల్‌ఫోన్ కాదు. అది ల్యాండ్‌లైన్! మన పాత తెలుగు జేమ్స్‌బాండు మాదిరి తీసిన చిత్రాల్లో ఘల్లుమని మోగే నల్లటి తొలితరం 'ల్యాండ్‌లైన్' ఫోనది.

"అరేయ్ నాయనా – నువ్వామెను వెంటనే ఖాళీ చేయిస్తావా లేదా?' ఫోన్‌లో బామ్మ బెదిరింపు.

"మళ్ళీ ఏమైంది బామ్మా?"

"ఏమైందా?... ఆవిడగారు మళ్ళీ రాత్రికూడా ఇంకెవర్నో ఇంట్లోకి తీసుకొచ్చింది. ఆ ముదనష్టపు టేపు రికార్డులో ఒకటే పాటలు... ఇక ఇకలు, పకపకలు. మధ్య మధ్యలో ఆ 'చలం గారు' రాసిన నవలలూ, కథలూ వగైరా వాటి మీద చర్చలూ.... ఇగో ఇలాంటి ఆడవాళ్ళు అలాంటి సాహిత్యం బాగా చదివీ చదివీ ఇట్లా అడ్డూ అదుపూ లేకుండా ప్రవర్తిస్తున్నారు ఈ మధ్య..."

"ఆమె స్నేహితులై ఉంటార్లే బామ్మా... అపార్థం చేసుకోమాక!"

"అలా సమర్థించకురోయ్... ఆవిడేమన్నా నీ చుట్టమా పక్కమా?"

"పాపం ఆవిడ ఒంటరి ఆడది కదా బామ్మా!"

"అబ్బబ్బో... ఆవెంగారు ఒంటరి ఆడది గాదురా...తుంటరి ఆడది!"

– బామ్మగారి అనుమానపు జ్వాల వర్సెస్ ఆస్ట్రేలియా కార్చిచ్చు!

ఫోనులో బామ్మే మళ్ళీ అందుకుంది. ఇక నేను కేసు ఓడిపోబోతున్న డిఫెన్సు న్యాయవాదిలా తను చెప్పేది వినటానికి సిద్ధమయ్యాను!

"నువ్వెన్నయినా చెప్పరా. నాకు కాస్త మంచీ చెడూలో తోడుగా ఉంటుందని ఆమెను ఇంట్లో అద్దెకు దింపావు. మీ తాతగారి పవిత్రమైన జ్ఞాపకాలు సంచరించే ఇల్లురా ఇది. భ్రష్టు పట్టిద్దామా ఏమిటి? ప్రతిసారీ యిలా కాళ్ళీడ్చుకుంటూ ఈ ఎస్టీడీ బూత్ దగ్గరకు వచ్చి మళ్ళీ మళ్ళీ నీకు ఫోన్ చేయనబ్బాయ్! ఆవిణ్ణి ఖాళీ చేయిస్తావా సరి.. లేదంటే..."

"అదిగాదులే బామ్మా...ఈ రోజుల్లో..."

పళ్ళూ గోళ్ళూ రాలిపోయినా ఒంట్లో రౌద్రం తగ్గని శివంగిలా మళ్ళీ ఘర్జించింది బామ్మ!

"ఆ రోజులూ– ఈ రోజులూ అని కాకమ్మ కథలు చెప్పకురోయ్! జీవితం నిండా పండిన అనుభవం నాది. నీవేమో పెద్ద భోళాశంకరయ్యవి! అదిగో మేం చక్కగా, సలక్షణంగా పెళ్ళి చేసేలోగానే తొందరపడి ప్రేమ పెళ్ళి అఘోరించావు. ఏమయ్యింది! జాతులూ, జాతకాలూ చూసుకోకుండా హడావిడిగా ఆ ఏడడుగులు నడిపించావు.

పెళ్లయి పుష్కరం దాటినా మీ ఆవిడకు దోకులే రావాయ్!! నువ్వేం ఏడ్చినా అంతే ఉంటుంది! 'పాపంలే', 'ఒంటరి మనిషిలే' అంటూ ఆవిడెవ్వరో, ఎలాంటిదో తెలుసుకోకుండానే ఇంట్లో అద్దెకు దింపి నువ్వు చేసిన తప్పును సమర్థించుకుంటున్నావు.....

హూం... హూం...చూడు! వారంలోగా ఆవిడగార్ని ఖాళీ చేయించక పొయ్యావో నువ్వు కాశీ వెళ్ళాల్సివస్తుందిరో!"

"అదేంటి! కాశీ ఎందుకే?"

"ఎందుకా? నా పిండాలు పెట్టటానికి!"

బామ్మ విసురుగా ఫోన్ పెట్టగా వచ్చిన శబ్దానికి నా కర్ణభేరి గుయ్యిమని మారు మోగింది.

బామ్మ మహా మొండిది! ఒక్కోసారి 'కచ్చగా' అవతల వాళ్ళు నచ్చకపోతే చుక్కలు చూపిస్తుంది. ఒక్కోసారి ప్రేమగా అవతలివాళ్ళు నచ్చితే తన పేగులు తోడేసి పూలదండలు కట్టి మెళ్ళో వేసి సన్మానించాలనుకుంటుంది! బామ్మ ఫోనులో అన్నంత పనీ చేసిద్దేమో అని భయపడి ఉన్నపళంగా ఊరెళ్ళాను. మా పాత ఇంట్లో ఉంటున్న ఆ– బామ్మ క్రూరంగా పెట్టిన పేరు – 'ఒంటరి తుంటరి ఆమె' ను వారం రోజుల్లో ఏవో కుంటిసాకులు చెప్తూ ఖాళీచేయించాను. ఒక్కోసారి నవనాగరిక ఆధునికత సాంప్రదాయపు ఛాదస్తం ముందు ఇలానే ఓడిపోతుందిలే అని సర్ది చెప్పుకున్నాను!

బామ్మ మాత్రం విజయ దరహాసంతో నవ్వింది... ఆఖరి ఓవర్లో ప్రత్యర్థి టీమ్‌పై మెరుపు హ్యాట్రిక్ సాధించినంత విజయదరహాసమది!

♦♦♦

'ఆమె' ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయిన చాలా రోజులకు సెలవుల్లో నేనూ, మా ఆవిడా ఊరెళ్ళాము. అయితే బామ్మ ఎందుకో ఎప్పటిలా ఉషారుగా లేదు. ఏ పనీ చేసుకోలేకపోతున్నానే, ఏదో దిగులుగా ఉంటుందని చెప్తుంది. హాస్పిటల్‌కు వెళ్దాం అంటే వద్దంటే వద్దంది. ఆమెకు అల్లోపతి మందులు సరిపడవు. అందుకే పావులూరి కృష్ణచౌదరి గారి హోమియో మందులే వాడుతుంది– వాటి మీదనే గురి. అయితే బామ్మకు ఏ జబ్బు లేకపోయినా ఆమెకున్న జబ్బేంటో నాకు తెలుసు! అది 'ఒంటరి తనం'. వయసుపైబడిన వాళ్లకు ఒంటరితనమే అతిపెద్ద దీర్ఘకాలిక వ్యాధి!

♦♦♦

ఒకరోజు బామ్మ, నేను కలిసి సాయంత్రం ఇంటివెనుక పెరట్లోకి వెళ్లాము – కాస్త చల్లటిగాలి పీల్చుకుందామని. మధ్యలో ఒకటి రెండుసార్లు హడావిడిగా వచ్చి వెళ్ళాను కానీ ఇంటి వెనుక పెరట్లోకి రాక చాలా రోజులయ్యుంటుంది. ఎండిపోయిన గడ్డీ, ఉమ్మెత్త పొదల్తో ఉండే మా పెరడు ఇప్పుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో భాగ్యనగరంలో ఉన్న సుందర 'బగీచా'లలో ఒకదానిలా పచ్చగా, పదుల రకాల పూల, పండ్ల మొక్కలతో మెరుస్తుంది.

"బామ్మా ఈ మొక్కలన్నీ ఎప్పుడు పెంచారే? ఎవరేసారు ఇవన్నీ?' అని ఆశ్చర్యపోతూ అడిగాను.

"ఆ అద్దెకున్న 'ఆమే' పెంచింది"

సన్నని స్వరంతో చెప్తుంది బామ్మ. ఈ మాటలంటున్నపుడు బామ్మ కళ్ళల్లో ఓ చిరుచెమ్మ చిన్న తటాకంలో ఓ చిన్ని గులకరాయి వేస్తే పుట్టే ఓ చిన్న వర్తుల తరంగం తిరుగాడినట్లుగా కదలటం నేను గమనించాను. ఆమె గొంతులోంచి వచ్చిన ఓ జీర తొడిరాగపు విషాదాన్ని ప్రకటించే వాగ్గేయకారుని కంఠంనుండి వెలువడిన తొలి స్వరంలా విన్పించింది.

"అవును నాయనా ఆమే పెంచింది. చూడు ఆ పాదులు, పూల జాలులు ఎంత కుదురుగా తీసిందో! గొప్ప అభిరుచిగల పిల్ల...నేనే అనవసరంగా..."

బామ్మ పూర్తి చేయలేదు. అయినా నాకు ఆమె మనసులో దూకి ఉరుకుతున్న నయాగరాలు కనిపించాయి.

మరుసటి రోజు ఒక్కడినే మా పెరట్లో వనంలా విస్తరించి ఉన్న రకరకాల పూల మొక్కల మధ్య ఒక పూటంతా గడిపాను. ఆ సాయంత్రమే బయటకు వెళ్ళి 'ఆమె' ఫోన్ నెంబరు ఏమైనా దొరుకుతుందేమోనని ప్రయత్నించాను. కానీ తనకు ఫోన్ కనెక్షను లేదని ఆమె స్నేహితురాలి ద్వారా తెలిసింది. అయితే తన చిరునామా మాత్రం దొరికింది. ఆమె ఎక్కడుంటున్నదీ వివరాలు తెలిసే సరికి బామ్మే అందరికంటే ఎక్కువ సంతోషపడినట్లు అన్పించింది నాకు! ఆలస్యం చేయకుండా మరుసటి రోజే 'ఆమె'కు ఓ సుదీర్ఘమైన ఉత్తరం రాసాను. ఆ లేఖ ఇలా సాగింది –

"అమ్మా,

మేమంతా క్షేమం. మీరు కుశలమా? మీరు యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయినప్పటి నుండీ నాకు మనసులో అంత మంచిగా అనిపించటం లేదండీ, 'ఒంటరి ఆడవాళ్లు – తుంటరి ఆడవాళ్లు' అంటూ మా బామ్మ తర్కంలేని పిచ్చి మాటలు పట్టించుకుని నేనూ ఓ పాతకాలపు 'బామ్మ'లాగానే ఆలోచించాను!

నిన్న సాయంత్రం మా ఇంటి పెరట్లో కొద్దిపాటి స్థలంలో ఐనా మీరు పెంచిన ఆ చిన్న పూలవనంలోకి వెళ్లాను.

చిన్నప్పటినుండీ నాకు పూల మొక్కలన్నా, పండ్లమొక్కలన్నా ప్రాణం! ఆ పూల జాలుల మధ్య చల్లటి నీడలో అటూ ఇటూ తిరుగుతుంటే ప్రతి లేత మొక్కా మీ పేరునే పలుకుతున్నట్లు వినిపించింది నాకు! ఆ తెల్ల గులాబీలు, గన్నేరు పూలు, బంతీచేమంతి మొక్కలు చిరుగాలికి తమ కొమ్మలను కదిలిస్తూ నన్ను ఆహ్వానిస్తున్నాయేమో అనుకున్నాను! వాటిని చూసి పులకరించిపోయిన నా మదిలో ఎన్నో వింత ఊహలు, చిరు హెచ్చరికలు కదలాడాయి.

మీరు కాంపౌండు గోడ ప్రక్కనే పొడవాటి వెదురు కర్రలతో చాలా కుదురుగా వేసిన వందిరిపై గుబురుగుబురులుగా పెరిగిన సన్నజాజి లతలు ఆ మధ్య వచ్చిన గాలివానకు కొన్ని నేలకు వాలిపోయాయి. తియ్యని, గుభాళింపుల పూలతో నిండి ఉన్న ఆ లతల్లో ఒకటి రెండు నా కాళ్ళకు చుట్టుకున్నట్లుగా అనుభూతి చెందాను. అంతేగాక యుద్ధంలో పట్టుబడ్డ బానిస సైనికుల యొక్క చంటిబిడ్డల లేలేత చేతుల్లా ఆ లతలు నా కాళ్లను కౌగలించుకుని "అయ్యా! అయ్యా!... మా అమ్మను మాత్రం మా దగ్గరే వదలి వెళ్ళండయ్యా" అని ఆర్తితో ప్రార్థిస్తున్నట్లుగా వినిపించి నాలోనేనే ఉలిక్కిపడ్డాను. తీవ్ర అపరాధ భావనతో నా కళ్లు చెమర్చాయి!

ఇక ఇంకోవైపు "హేయ్ పెద్ద మనిషీ! మీరు చేసిన పనికి పదునైన మా ముళ్ళతో మీ ఒళ్ళంతా గిల్లాలని ఉంది! ఆ బామ్మను కూడా బాగా రక్కేయాలని ఉంది. కానీ లోకానికి మేము సౌందర్యాన్ని సృష్టించే వాళ్లం గానీ కురూపితనాన్ని కాదు. అందుకే ఊరుకొన్నాం!" అన్నట్లు బోగన్ విలియా మొక్కలు, గులాబీ అంటూ పెద్దగా అరిచినట్లు – ఆ మాటలు ఆ చోటంతా ప్రతిధ్వనిస్తున్నట్లు విన్పించసాగాయి. పుష్ప విలాపాన్ని, ప్రకృతి ఘోషను వినే, కనే మృదు హృదయం నాది. మరి మిమ్మల్ని ఉన్నఫళంగా ఖాళీ చేయించటంలో నేను ఎంత 'మొరటుగా' ప్రవర్తించానో తల్చుకుంటేనే సిగ్గుగా అన్పిస్తుంది అమ్మా!

ఇంకొక్కమాట! కమ్మటి తీపి పరిమళం వెదజల్లుతున్న నిండైన పూలతో నిండి ఉన్న ఆ 'సంపంగి' చెట్టును చూడగానే నా మదిలోంచి తన్నుకొచ్చిన జ్ఞాపకాల దొంతరలో ఉక్కిరిబిక్కిరై పోయాను. ఎప్పుడో పాతికేళ్ళ క్రితం మా ఊళ్లో సర్పంచి గారి పెరట్లో ఇలా నిండుగా, చెట్టంతా పూసి ఆ వీధంతా ఇలా ఘుమఘుమగా వచ్చే ఆనాటి ఆ సంపంగి పూల తియ్యటి వాసనను మళ్లీ ఇపుడు అనుభవిస్తుంటే నా బాల్యం, యవ్వనపు మధుర జ్ఞాపకాలు ఫౌంటెన్‌లా తన్నుకొచ్చాయి. హైస్కూలులో మొదటి గంట మోగుతుండగా 'సంపెంగల రాణి' అని మేమందరం ముద్దుగా పిలుచుకునే శ్రీలత వస్తుందని తాను అల్లంత దూరంలో ఉండగానే మాకు తెలిసిపోయేది. తన తలలో కమ్మటి వాసనతో, నిండుగా పండిన పసుపు రంగు పూరేకులతో లేత నీరెండకు మెరుస్తున్న పెద్ద సంపంగి పువ్వు. ఆ సంపంగి పరిమళమే నన్ను తనవైపు విపరీతంగా ఆకర్షింపబడటానికి, తరువాత మేమిద్దరం పీకల్లోతు ప్రేమలో కూరుకుపోవటానికి, చివరికి మేమిద్దరం పారిపోయి పెళ్ళాడాలే చేసింది! మా పెళ్లి ప్రక్కనే ఉన్న పట్టణంలోని 'హనుమాన్ టెంపుల్'లో ఎంత కంగారుగా జరిగిందో మా ఆవిడ శ్రీలత మీకు చెప్తుంటే మీరు పడీపడీ నవ్వటం నాకు గుర్తే ఉందమ్మా!

మీ గురించి మా బామ్మ అపార్థంగా మాట్లాడిన మాటలు పట్టించుకుని అనవసరంగా మిమ్మల్ని ఖాళీ చేయించాము. ఆ తొందరపాటుని మన్నించండి. మేము నగరంలో ఉంటూ బామ్మకు చాలా దూరంలో ఉంటున్నాము. ఆమేమో ఆ ఊరూ, ఇల్లూ వదిలి రాదు. రాత్రి బామ్మ తన బాధను చెప్పుకుంటుంది. తను అస్సలు 'ఒంటరిగా' ఉండలేకపోతుందట! తాతగారు పోయి పదిహేనేళ్లు. తనూ తన మనసులోకి తొంగి చూసుకుందేమో... తనూ ఓ 'ఒంటరి ఆడదే' గా అనే విషయం గమనించుకున్నట్లుంది. మీరు నిష్క్రమించిన తర్వాత మీ స్నేహంలో ఉన్న 'మాధుర్యం' తనకు తెలిసింది కాబోలు!

అమ్మా... మా ఇంటిని మరొక్కరెవరూ ఇంత చక్కగా ఉంచలేరు. ఇక్కడ ఇంత చక్కటి పూలతోటను పెంచలేరు! మా గురించి కాకపోయినా మీ 'మొక్కల' కోసం అయినా మీరు రావాలి. అవి మీ మీద బెంగపెట్టుకున్నట్లున్నాయి. దయచేసి మళ్లీ రండి! వచ్చి మీ మొక్కలను మళ్లీ సాకండి. ప్రతిదినం వాటిని ప్రేమగా తాకండి. దేశాంతరం వెళ్లిపోయి దీర్ఘకాలం తిరిగిరాని తల్లికోసం తపించే బిడ్డల్లా అవి మీ కోసం నిరీక్షిస్తున్నాయి. మీరు ఎవరితో స్నేహంగా ఉన్నా ఇక మా బామ్మ అభ్యంతరం చెప్పబోదు. మీ గురించి మీ స్నేహితులు ఎన్నో గొప్ప విషయాలు చెపితే విని విస్మయం చెందాను. 'ఒంటరి మహిళందరూ తుంటరి మహిళలే' అనే దుర్మార్గపు ఆలోచనను ఇక దరిచేరనివ్వము.

ఎప్పుడో, ఎక్కడో చదివినట్లు గుర్తు. 'భగవంతుడు ధరించే అందమైన వస్త్రమే ప్రకృతి' అని. మరి ఆ ప్రకృతికే తాము పెంచే మొక్కల ద్వారా సప్తవర్ణాల 'సహజ నేతలు' నేయగల మీ వంటి వనితలు ఈ జగతికే విధాతల వంటివారు కదా–

మీ రాకకోసం మేము మీ పూల మొక్కలతో కలిసి ఎదురు చూస్తూ ఉంటాము!

## కవిత

# సడలకుండా చూసుకోవాల్సిన చేయి

- గన్ రెడ్డి ఆదిరెడ్డి
9494789731

ఒక్కచేయి
పక్కకొరిగితే
ఎన్ని డొక్కలు ఎండిపోతయ్
నాగలికి నడక నేర్పిన చేయి
పలుగు పార బట్టిన చేయి
మోట గొట్టిన చేయి
మొరం తవ్విన చేయి
నాట్లువేసి
కలుపుదీసి
పంటను ఏపుగా పెంచిన చేయి
సెమట సుక్కలను
భూమి పొరల్లో ఇంకించి
బువ్వను అందించిన చేయి
జానపదుల బాణీలను వాణీలను
బతుకు పాటలుగా అల్లుకొని
చేను మధ్యలో
మంచెపై
వయ్యారంగా వడిసెల రాళ్ళను
రువ్విన చేయి
అస్సోయ్ దూలా బతుకమ్మ
ఆటపాటలకు మానవహారంగా
మల్పబడ్డ చేయి
బావులు తవ్విన చేయి
బండలు గొట్టిన చేయి
బడబాగ్నులను
గుండెల్లో దాచుకొని
బతుకు బాటలో
చేయూతనందించిన నేస్తం
మానవాళి మనుగడకు
సాక్షిభూతమైనది
చల్లగా కాపాడు కోవాల్సిన చేయి
సడలకుండా చూసుకోవాల్సిన చేయి ♦



ప్రేమతో, గౌరవంతో నమస్కరిస్తూ...
మీ సోదర సమానుడు–
'రాజా'.

♦ ♦ ♦

మేమే సెలవులు అయిపోయాక మళ్లీ నగరానికి చేరుకుని 'యంత్రభూతముల కోరలు తోమే" ఉద్యోగ గులాంగిరీల్లో కూరుకుపోయాము. కొన్ని వారాల తర్వాత బామ్మ నుండి ఫోనొచ్చింది!

"అరేయ్ నాయనా..'ఆమె' వచ్చింది... సామనుతో సహా... ఇక మనింట్లోనే ఉంటుందట... నాకు చాలా సంతోషంగా ఉందిరా!... ఐతే....!"–ఐతే? ఈ 'ఐతే' అనేది మన మానవలోకంలో మహా విశ్వ విస్ఫోటనాలనే 'బిగ్ బ్యాంగ్'లను పేలుస్తుంది అపుడపుడూ!

"ఐతే...?"

"ఏమీ లేదురా... ఇప్పుడామె ఒంటరి కాదు... పెళ్ళి చేసుకుంది! భర్తతో పాటు వచ్చింది. అబ్బాయి పండులా చక్కగా ఉన్నాడు...ఎక్కువ వయసే ఉండొచ్చు...ఐతే....!

"ఐతే... విషయం చెప్పు బామ్మా... ఈ ఐతేఐతే ఏమిటి?"

"ఏం లేదులే... ఆ అబ్బాయి... సాయిబులబ్బాయి అట!"

"అబ్బా బామ్మా...ఐతే?" ఈసారి 'ఐతే'ని నేను లాక్కున్నాను.

మళ్ళీ బామ్మే మాట్లాడసాగింది.

"మరి అంతా బాగానే ఉంది గానీ...సాయిబులూ...."

– అప్పుడర్థమైంది నాకు... ఒక జాడ్యం నుంచి ఇంకో జాడ్యానికి దూకటమే మానవ ప్రగతి అనీ, ఒక మౌఢ్యం వదిలించుకుని ఇంకో మౌఢ్యాన్ని తగిలించుకోవటమే నాగరికతా పురోగతి అని!

కోపంగా 'రిసీవర్' రీసౌండు వచ్చేలా అరిచాను.

"బామ్మా అంతా నీ యిష్టం.... నువ్వింకా లోకంతోపాటు మారకపోతే ఆ మధ్య నువ్వన్నట్లు నేను ఖచ్చితంగా కాశీకి వెళ్ళాల్సివస్తుంది!"

– కఠినంగానైనా ఈసారి బామ్మను నేను బెదిరించాను!

"సరేలే సరేలే రా! సర్దుకుంటాను... కోపం ఆపు!" అంటూ బామ్మ ముగింపు పలికింది.

"ఐతే" అనేది విశ్వ విస్ఫోటనాలను రగిలిస్తే, ఈ "సరేలే" అనేది మాత్రం విస్ఫోటనంతో విడివడిన అగ్నిగోళాలు ఘనీభవించి, చల్లారి అందమైన అంగారకులు, శోభాయమాన శుక్రులు, దేదీప్యమైన మన ఈ ధరిత్రులూ వంటి ఖగోళ బ్రహ్మాండములు రూపుదాల్చటానికి దారితీస్తుంది!

"సరేలే.. ఇక ఉంటాను" అని నేనూ ముగించాను! ♦

## కవిత



# ఇద్దరి కథ కాదు

- శ్రీవశిష్ఠ సోమేపల్లి
91 9966460536

అవును
నీకూ నాకూ మధ్యన
వేల ఎడార్ల దూరం వుంది
వేల ఏళ్ల మూర్ఖత్వానికి
సాక్ష్యంగా పరుచుకుంది.
అయినా
నిన్ను చేరాటానికేగా నా ప్రతీ అడుగు.
వెనుకున్న పాదముద్రలకీ,
ముందుకు పడే కొత్త అడుగులకీ
నువ్వు కుట్రలను ఆపాదిస్తే
మరో అడుగు పడేదెలా?
నడిచిన దారంతా
పడిన అడుగులు నావైనా
నీలో నన్ను చూసుకునే కదా వేసింది..
చప్పట్లు కొట్టమని నేనడగటం లేదే
చేయి చాచమనేగా నే అడుగుతుంది.

♦

అవునూ
నీకూ నాకూ మధ్యన
వేల ఎడార్లు వున్నాయన్నావ్
నాకోసమే నీ అడుగులన్నావ్
కానీ వేసిన ప్రతీ అడుగూ
నా భుజాలపైనేగా..
అవును
నేను కుట్రలే వెతుకుతాను!
పుస్తకాల్లోని రాజ్యాధికారం
రబ్బరు స్టాంపుగా కుర్చీలో కూర్చుంటే
చంకల చప్పట్లు కొట్టుకోవాలా?
నా ఆహారం నీకు
ద్రోహమైనప్పుడు
నీ ఆహార్యం
నాకు కుట్రగా తోయటం తప్పా?
నేల నీదై వుండొచ్చు
నేలని 'దానం' చేసి
నా వైపు అడుగులేస్తూ వుండొచ్చు
నీకు తెలియనిది ఒకటి చెప్తా విను
నేనూ నేలా ఒక్కటే..
మోస్తూనే వున్నాం
అణిచివేతల్ని, అవమానాల్ని,
అంతరానితనాన్ని..
అయినా పర్వాలేదు..
నువ్వు వస్తానంటే
గాయాల చేతుల్ని నీదాకా
చాచే వుంచుతా

♦

దూరాలు సరే..
అసలు మధ్యన
ఎడారెందుకు వుండాలి?
నాలుగు చేతులూ
నాలుగు చుక్కలు జల్లితే
అడవి అల్లుకోదా..
కొత్త వూపిర్లు అందివ్వదా.. ♦

---

# నీటి చెమ్మ

చందలూరి నారాయణరావు
9704437247

పలుగు-పార
రెండు చేతుల్లో
చెమటై చిందిన
జీవితాలలో

ఊట-తేట
రెండు కళ్ళలో
గొంతు తడిసిన దప్పిక
వేళలో
చెలమ- చెమ్మ
మది మడుల్లో
చల్లని దీవెనలా సాగిన జాలులో
ఊరిన ప్రతి చుక్కకు
ఎన్ని రూపాలో?
ప్రతీ రూపానికి
కోటి దండాలు.

♦

బావిగా వెలసి
దాహం తీర్చింది.
చెరువుగా చేరి
చెమ్మను చాటింది.
కాలువగా కలసి




పంటకు ప్రాణం పోసింది

♦

భూమికి
పైరు..పచ్చని ప్రాణం.
నింగికి
మబ్బు..మెరుపు..మురెపం
మనిషికి
బంధమే అందం..ఆనందం. ♦

# మనిషితనాన్ని ప్రేమించే కలలు

- దర్భశయనం శ్రీనివాసాచార్య




***వస్తువుల్ని ఎంచుకోవడంలో కవి రవీంద్రనాథ్ నిర్దిష్టంగా వున్నాడు. అట్లాగే ఆయన రూపశ్రద్ధ కూడా దాదాపు ప్రతీ కవితలో కనపడుతుంది. శైలిలో 'సరళత'ను ఇష్టమార్గంగా ఎంచుకోవడం వల్ల ఇతని కవిత్వంలో క్లిష్టత లేదు. ఆలోచింపజేసే గుణమే కాక కదిలించే గుణం కూడా ఇతని కవిత్వానికుందని నాకనిపిస్తుంది.***

'ప్రాథమికంగా కవిత్వం నా మానసిక అవసరం' అని తన మాటగా ప్రకటించుకున్న పక్కి రవీంద్రనాథ్‌కు కవిత్వ రచన సులువైన వ్యవహారమేమీ కాదు.

***"నేల పొరల కింద ధ్యానావస్థలో ఉండి / ఒక్క చినుకుతో కన్ను తెరిచి/ పిడికిలెత్తిన విత్తులా / ఏ గాఢసుషుప్తిలోనో / నాలోని ఏ పురాస్మృత మేఘాల కదలికతోనో / వాక్యవృష్టి కురిసి/ ఎప్పుడు ఒళ్ళు విరుచుకుని లేచిందో గానీ / పొద్దున్నే ఓ పద్యం నన్ను నిద్రలేపింది"***

పద్యాన్ని విత్తనంతో పోల్చడం ద్వారా తాను ప్రేమించే కవిత్వం ఎట్లా వుంటుందో స్ఫుటంగానే సూచించాడు. కవిత తనలోంచి లేవగానే ***'ఇంతకాలం గుక్కపెట్టి ఏడుస్తున్న నా గుండె ఇప్పుడు నిమ్మళించింది'*** అని చెప్పుకునేంత తృప్తిని పొందుతున్నాడు. కవిత రాయడానికి ధ్యానావస్థ అని చెప్పుకునేంత తృప్తిని పొందుతున్నాడు. కవిత రాయడానికి ధ్యానావస్థ అవసరమని, దానిలోంచే 'వాక్య వృష్టి' అని ఎరుక గలిగిన కవి రవీంద్రనాథ్.

40 కవితల సమాహారంగా వెలువడిన 'పక్షితనాన్ని కలగంటూ' సంపుటి ద్వారా రవీంద్రనాథ్ ఏమి చెబుతున్నాడు? తాను చూసిన, అర్థం చేసుకున్న ప్రపంచాన్ని కవిత్వ భాషలో మనకందిస్తున్నాడు. స్థూలంగా, ప్రపంచంలోని వేదన అతని కవితా వస్తువైంది. ఆ వేదన భూమిని కోల్పోతున్నవాళ్ళది. భూమిని నమ్ముకున్న రైతులది, బాలకార్మికులది. వివక్షకు గురవుతున్న ఆడవాళ్ళది. ఒత్తిడిలో నలుగుతున్న విద్యార్థులది, వృత్తులను నమ్ముకున్న శ్రామికులది, వనరుల్ని కోల్పోతున్న పల్లెటూళ్ళది. వేదనానుభావల్నే కాక, కొన్ని జీవన చిత్రాల్ని మనకు దృశ్యమానం చేసాడీ కవి. కొన్ని లలిత భావనల్ని వ్యక్తపరచడానికీ, కవిత్వాన్ని వాహిక చేసుకున్నాడు.

వేదనను చెప్పే క్రమంలో దానికి మూలమైన ఘర్షణను గురించి కవి మాట్లాడేడు. రైతు వేదనను చెపుతూ దానికి కారణభూతమైన అంశాలేమిటో ప్రస్తావిస్తాడు. నీటి కొరత, కంపెనీ విత్తనాలు, కలుపు మొక్కలై ఏపుగా పెరిగిన అప్పులు, యంత్రాల అద్దెలు, ఖర్చులకు సరిపోని గిట్టుబాటు ధరలూ ఇవన్నీ మన కళ్ళ ముందు కనపడతాయి - అతని 'వజ్రాయుధం' కవిత చదువుతుంటే.

***"ఇప్పుడు వ్యవసాయమంటే/ అప్పులు నాటుకుని / ఆకలి పండించుకోవడమైపోయింది."***

బాధలు పడలేక రైతు సేద్యాన్ని వదిలి వేయాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. దాన్ని కవి ఇట్లా చెపుతున్నాడు.

***"చెమట పువ్వై పూసి /మన చేతిలో బువ్వయి మెరిసిన వాడే /పల్లెనొదిలి వెళ్ళాల్సిన పాపిష్టి కాలమొచ్చింది."***

వ్యవసాయమంటే సారాంశంలో పూత, కాతా చెమటకూ

పువ్వుకూ అభేదం చూపుతూ 'చెమట పువ్వు' అనడం వెనుక వస్తు ధర్మానికీ, పోలికకూ నడుమ అన్వయం కనపడుతుంది. ఈ అన్వయశుద్ధి రవీంద్రనాథ్ కవిత్వంలో చాలా చోట్ల అగుపడుతుంది. రైతు బతకలేని సమాజంలో మానవ ప్రయాణం అసలు ఎటువైపని కవి అడుగుతున్నాడు, సహేతుకంగానే.

*"దేశపు పైకప్పుకు ధాన్యపు కంకులు కట్టినవాడే / కనుమరుగైపోతున్న ఈ లోకంలో / రేపటి కోసం గుప్పెడు విత్తనాలను / మోసుకు తిరిగేవాళ్ళే కరువైపోతున్న ఈ శోకంలో / ఎక్కడికని వెళ్ళగలం?"*

స్త్రీల మనోప్రపంచాన్ని రవీంద్రనాథ్ కవితలుగా మలచేటప్పుడు వాస్తవాల గరుకుతనాన్ని శబ్దాలకిచ్చాడు. 'పక్షితనాన్ని కలగంటూ' అనే కవితను చూద్దాం. 'మీకేం... ఏమైనా చేస్తారు' అంటూ స్త్రీల కంఠస్వరంతో కవిత మొదలవుతుంది.

*"ఎక్కడెక్కడి వాళ్ళనో పోగేసుకొచ్చి / జ్ఞాపకాల మంచు ముక్కల్ని / విలాసంగా కరిగించుకుని / ఖుషీగా ఊగిపోగలరు / ఎప్పుడో మేం నలుగురం కలిసి / తేనీటి కబుర్లమయ్యేసరికి / ఇల్లు సంతైపోయిందని / ఇంగితం కోల్పోతారు"*

దాగుడుమూతల్లేవు వ్యక్తీకరణలో. సూటిగా చెప్పడమే.

*"మాలోనూ భావుకులుంటారు / కానీ మా అక్షరాల వెంట నిఘా కళ్ళు / వడపోత జల్లెళ్ళు / పెదర్థాల ముళ్ళు"*

ఇంతగా వివక్షనెదుర్కొంటున్న స్త్రీలు ఏం కోరుకుంటున్నారో కవిత చివరి పాదాల్లో చెప్పాడు.

*"పంజరాలూ, వేటగాళ్ళూ లేని లోకాన్నీ / ఆకాశాన్ని చుంబించే పక్షితనాన్నీ కలగంటున్నాం"*

మానవ సమాజం ఇంతగా ముందుకు పోతుందనుకుంటున్న దశలోనూ ఆడపిల్ల పుట్టిందంటే అదొక భారమైన విషయం కావడం విషాదమే కదా! దీనికి దర్పణం పట్టేలా కవి ఒక తల్లి ఆడ శిశువుకు జన్మనిచ్చిందని చెప్పడానికి మెటానమీని ఆశ్రయించాడు. *'ఓ గాయం మరో గాయాన్ని ప్రసవించింది'* ఈ వాక్యాన్ని చదువుతున్నపుడు కవి వేదన మనకందుతుంది. జీవన వాస్తవికతకు దగ్గరవుతాం.

స్త్రీల ఇంటిపని పట్ల మనకు గౌరవముందా? కొన్ని ఇళ్ళల్లో గౌరవం కాదు, చిన్న చూపు వుంటుంది.

*"పొయ్యి వెలిగిస్తుండగా / మనసు కాలిందో / కూరలు తరుగుతుండగా / గుండె తెగిందో / ఉన్నపళంగా వెళ్ళిపోయింది.*

చెయ్యి కాలడమో, వేలు తెగడమో కాదు. మనసూ, హృదయమూ గాయపడి ఆమె ఇంటి నుంచి వెళ్ళిపోయినప్పుడు ఇల్లు ఎలా వుంటుందో 'మరో నిర్వచనం' కవితలో చెప్పాడీ కవి.

*"నిరసన లాంటి నిశ్శబ్దం / కర్ణకఠోరంగా వుంది / ఎన్ని తరాల కాటుక ఖేదవర్ణమై / ఈ గోడల నిండా పేరుకుందో!"*

కాటుక నలుపు మనకు తెలును. అది ఖేదవర్ణమయిందనడం కవి కల్పన. కల్పన ద్వారా వాస్తవాన్ని ఇంకా స్ఫుటంగా చూపడం కళాకారుడి నైపుణ్యానికి దాఖలా. ఇక్కడ దాన్ని చూడొచ్చు. 'కాటుక' 'గోడలు' వీటి నడుమ ఖేద వర్ణాన్ని ప్రవేశపెట్టి వాస్తవాన్ని మనకు తేటతెల్లం చేస్తున్నాడీ కవి. ఆమె లేని వాతావరణంలో అతనికి జ్ఞానోదయమైనట్లు కవిత చివర్లో చెబుతూ *'గాయమైపోయిన ఆమెను లేపనమై హత్తుకోవాలని వుంది'* అనే వ్యక్తీకరణనివ్వడం ఒక గొప్ప ఓదార్పు చదువరికి.

రవీంద్రనాథ్ స్వయానా ఉపాధ్యాయుడు. ఇప్పటి కార్పోరేట్ చదువుల్లో విద్యార్థులు ఎట్లా ఒత్తిడికి లోనౌతున్నారో రెండు కవితల్లో చెప్పాడీ కవి. హాస్టల్ వాతావరణంలోంచి వచ్చాయి ఈ రెండు కవితలు. నెమలి కన్ను ఏ పిల్లాడికైనా ఒక మెత్తని ఇష్టం. కానీ హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థి మనోస్థితిని చెప్పడానికి ఈ నెమలి కన్నును ఎట్లా కవి ఉపయోగించాడో చూద్దాం.

*"నాన్నా!/ చివరిగా నాదో మాట / సర్కారు బళ్ళో చదువుకున్నపుడు / నేను ముచ్చటపడి / పుస్తకంలో నెమలికన్ను దాచుకునేవాణ్ణి / ఇప్పుడీ పుస్తకాల మధ్య / నేనే ఒక నెమలి కన్నయి నలిగిపోతున్నాను."*

పుస్తకంలో నెమలి కన్ను అనే మధురానుభవం నుంచి పుస్తకాల మధ్య నెమలి కన్నయి నలిగిపోవడం అనే విషాదానుభవంలోకి విద్యార్థి నెట్టబడ్డాడని కవి కవితాత్మకంగా చెప్పగలిగాడు.

ఇక మరో కవితలో హాస్టల్లో వున్న ఒక పాప తన తల్లికి బాధను చెప్పుకుంటుంది. ఇదొక ప్రత్యేక కోణం. ఇంట్లో జీవితం గురించి తల్లిదండ్రులు విలువలతో కూడిన విషయాలు చెబుతారు. కానీ నిజ జీవితంలో అవి లేవు అని తల్లితో చెబుతుంది పాప.

*"మనిషికి వ్యక్తిత్వం ముఖ్యమని / నాన్నెప్పుడూ అంటాడు గానీ / ఇక్కడ మార్కుల కొలబద్దకందని వ్యక్తిత్వం / సిలబస్ నుండి తొలగించిన పాఠ్యాంశమయిపోయింది. / నువ్వందరితోనూ స్నేహంగా మసలుకోమంటావు గానీ / ఇక్కడ ఒత్తిడి గుప్పిట్లో కరచాలనాలు చిట్లిపోతున్నాయి"*

ఇక్కడ పాపలో చెలరేగిన ఘర్షణను కవి మనకు చూపుతున్నాడు. ఒక పాప తల్లితో చెప్పుకోగల శరీర ధర్మాన్ని ఈ కవితలో కవి ప్రస్తావించడం గమనించాల్సిన అంశం.

*"ఆరు ఋతువులూ ఏక ఋతువై విరుచుకు పడుతున్న / ఈ యవ్వనారంభ ధర్మాల ఉక్కిరి బిక్కిరిని / నీతో గాక ఇంకెవరితో చెప్పుకోగలనమ్మా! / నెలచక్రం నన్ను గాయపర్చినపుడు / నిస్సత్తువగా నిలబడలేనప్పుడు / అడుగు తీసి అడుగెయ్యాలంటేనే / ఒంట్లో ఓపిక లేనప్పుడు / లెక్కలేనన్ని ఈ చదువుల మెట్లు ఎక్కీ దిగుతున్నప్పుడు / నువ్వు నా పక్కనుంటే బాగుణ్ణనిపిస్తుంది"*

చాలా సున్నితమైన అంశాన్ని కవిత్వంలో ఎట్లా కవి సులభప్రసారమయ్యేలా చెప్పాడో పై పంక్తుల్లో చూడొచ్చు. పోతే ఇదే భావాన్ని ఇంకా పొదుపైన మాటల్లో చెప్పడానికి వీలుంది. 'నిస్సత్తువ' 'ఒంట్లో ఓపిక లేనప్పుడు' – ఈ రెంటిలోంచి ఒకదాన్ని పరిహరిస్తే భావం తగ్గకుండా క్లుప్తతను సాధించొచ్చు. ఈ కవిత చివర్న

*"అంతలోనే మీరు నాటిన ధైర్యవచనమొకటి / వెలుగు పువ్వై విచ్చుకుంటుంది"*

అనడం గొప్ప ఉపశమనాన్నిస్తుంది. నాటడానికీ విచ్చుకోవడానికీ నడుమ ఉన్న సజీవ సంబంధాన్ని కవితా వ్యక్తీకరణకు కవి సమర్ధవంతంగా ఉపయోగించుకున్నాడు.

రజకుల దైనందిన జీవితాన్ని దృశ్యమానం చెయ్యడానికి "జ్ఞాపకాల రేవులో ' అనే కవితను రచించాడీ కవి. దీన్ని చదువుతూంటే జీవన దృశ్యాలు కళ్ళముందాడతాయి. వృత్తిలో శ్రమకూ, సంపాదనకూ నడుమ పొంతన లేకపోవడం వల్ల కలిగే ఘర్షణను కవి పట్టుకున్నాడీ కవితలో.

*"జీతపుగింజలు అడిగేసరికి / పెదనాయుడు పెట్టిన పేచీలు తలచుకొని / అయ్య గూన కింద మంటలా రగిలిపోయేవాడు. / మడత నిలవలేదనో, మరకలొదల్లేదనో / నాయురాలాడిన నిష్ఠూరాలకు / అమ్మ మనసు గూనలోని బట్టలా కుతకుతలాడిపోయేది"*

గూన కింద మంట, గూనలోని బట్ట – రజక వృత్తిలో కనబడే సహజ దృశ్యాలు. వాటిలో అయ్య, అమ్మ బాధల్ని ఆరోపించి చెప్పడం ఇక్కడి ప్రత్యేకత. బింబప్రతిబింబాన్ని తిరిగేసి చెప్పడం కవితా రచనలో ఒక పద్ధతి. దాన్ని ఈ క్రింది వ్యక్తీకరణలో చూడొచ్చు.

*"మా అయ్యలో / చెరువు తన ప్రతిబింబాన్ని చూసుకునేది"*

సాయంత్రాన రజకులు ఉతికిన బట్టలతో ఇళ్ళకు చేరడం అందరికీ తెలిసిన విషయమే. దానికి సూర్యుణ్ణి జోడించడం కవి చేసిన ఊహ.

*'సంధ్యాసూర్యుణ్ణి నెత్తికెత్తుకున్నట్టు / ఉతికిన బట్టలతో మా అమ్మ ఊళ్ళోకెళ్ళేది"*

కాలుతున్న ఇస్త్రీ పెట్టె మీద కొన్ని నీళ్ళను చిలకరిస్తే వేడి తగ్గుతుంది. రజకుడు శ్రమ నుంచి కొంత బయట పడ్డానికి కాస్త సారా తాగేవాడనే విషయాన్ని ఇస్త్రీ పెట్టెకు లంకె వేసి చెప్పాడిలా.

**"ఇస్త్రీ పెట్టెలా రాజుకున్న గుండెను / బుక్కెడు సారా చుక్కలతో చల్లబరుచుకునే వాడు"**

రజక కుటుంబమంతా శ్రమ పడినా ఇంటి స్త్రీ కష్టం అందరికన్నా ఎక్కువ. అది ఈ కవిత చదివితే అర్థమవుతుంది. ఈ వాక్యాన్ని చూడండి.

*"దీపం కొడిగడుతున్న వేళ / చెంగులో చేరడు గింజలతో / చీకటై తిరిగి వచ్చేది అమ్మ"*

ఈ సంపుటిలో మరొక విశిష్టమైన కవిత 'ఒకే దేశంగా... ఒకే దేహంగా..." వస్తు ధర్మానికి అనుగుణ్యమైన శబ్ద సంచయాన్ని పొదుగుకున్న కవిత ఇది. సరిహద్దులో యుద్ధం చేస్తూ మరణించిన సైనికుని భార్య వేదన ఈ కవిత. కవితలోని మొదటి పంక్తితోనే గాఢత మొదలైంది.

'నువ్వెళ్ళిపోయావు' – 'సైన్యంలో చేరడానికి వెళ్ళావు' అనడంతో కవిత మొదలు పెట్టడానికి నువ్వెళ్ళిపోయావు అనే వ్యక్తీకరణ చేసాడు కవి. కానీ శాశ్వతంగానే వెళ్ళిపోయాడు అనే ధ్వని కూడా వుందిక్కడ. 'దేహాన్ని మోహరించే పనికై' వెళ్ళాడు సైనికుడు. 'సైన్యాన్ని మోహరించడం' మనకు తెలిసిన ప్రయోగం. 'దేహాన్ని మోహరించడం' కవి చేసిన కొత్త పద ప్రయోగం. సరిహద్దు నుంచి భర్త వస్తున్నాడని ఆమెకు తెలుస్తుంది.

**"మండు వేసవిలో మల్లెతెమ్మెరలా / నువ్వొస్తున్నావన్న కబురు నన్ను తాకింది/ వెన్నెల స్పర్శకు విచ్చుకున్న**

***సన్నజాజిలా నీ రహస్య సంగీత పరిమళం / మన గది నిండా గుప్పుమంది"***

వ్యక్తతలోనూ ఎంతో అవ్యక్తత వుంటుందప్పుడు. 'రహస్య సంగీత పరిమళం' అలాంటిది.

***"నువ్వొచ్చావు... కానీ ఒంటరిగా కాదు"***

ఇది చాలా శక్తివంతమైన వాక్యం. పై వ్యక్తీకరణలో మూడు బిందువుల విరామానికి విలువుంది. భర్త ఒంటరిగా రాలేదు. ఇక తర్వాత వాక్యాల్ని చూద్దాం.

***"దేశమే నీ వెంట నడిచి వచ్చింది"***

సైనికుడి పార్థివ దేహం ఇంటికి చేరడంలోని బరువు మనకు అర్థమవుతుంది.

***'నా గుండె చరియ విరిగి పడింది'***

సరిహద్దుల్లోని కొండ చరియ ఈ కవితా వస్తువుకు చాలా దగ్గర. కవి ఇక్కడ సైనికుడి భార్య దు:ఖాన్ని చెప్పడానికి 'గుండె చరియ' అనే పదబంధాన్ని సృజించాడు.

'నీ', 'నా' అక్షరాల్లో మొదలైన కింది ఐదు పాదాలు ఎన్నో గంభీరమైన దృశ్యాల్ని మన కళ్ళ ముందుంచుతాయి.

***'నీ ఒంటి మీద జాతి గౌరవం దర్పంగా పరుచుకుని వుంది / నీ ఛాతీ మీద ధర్మచక్రం ఎరుపెక్కిన పొద్దులా వుంది / నీ నిష్క్రమణం నా ఆశలను అవనతం చేసింది / నీ గౌరవసూచకంగా పేలిన తుపాకుల శబ్దం / నా గుండె చప్పుడు ముందు చిన్నబోయింది"***

అయితే ఈ కవిత కన్నీటి చుక్కల్తో ముగియదు. సమున్నత చింతనను పాఠకుడికిస్తుంది.

***'భౌతికంగా దూరమైనా / కోట్ల బ్రతుకుల భరోసాగా మనం బ్రతికుంటామని / నువ్విచ్చిన సందేశం / నా మదిలో నిండిన నీ రూపంలా భద్రంగా ఉంది / నువ్వు ఎన్నటికీ కొలువుండే / సమున్నత ఆశయసౌధంగా అది నన్ను మార్చింది / ఇక మనం ఎప్పటికీ కలిసే వుంటాం / ఒకే దేశంగా ఒకే దేశంగా"***

భావానికనుగుణ్యమైన భాషను ఎట్లా అన్వయపూర్వకంగా రూపొందించుకోవచ్చో ఈ కవిత చెబుతుంది.

ఈ సంపుటిలో నిడివిపరంగా చిన్నగా ఉన్న కవితల్లో కొన్ని దృఢంగా వున్నాయి. పర్యావరణ స్పృహతో రాసిన 'ఓ పచ్చని పలకరింపు కోసం' కవితలో ***'నేలంతా ఒకటే మంట / చెట్లనెవరో భోంచేసారు / గాలి అలిగింది'*** అనే పాదాల్లోని నవ్యతను గమనించొచ్చు. దిష్టి బొమ్మ స్వగతంగా సాగే 'హా... హతవిధీ' కవిత ఇవాల్టి రాజకీయాల మీద ఒక కొరడా దెబ్బ. 'అభివృద్ధి' పేరిట సాగే తంతులో రోడ్లొచ్చినా, ఊళ్ళు వెనకబడ్డాయని చెప్పడానికి 'కానీ... అక్కడ మా ఊరు లేదు' అనే వ్యక్తీకరణ ఐదు పాదాల్లోకి విడగొట్టడం అర్థానికి అనుగుణ్యమైన శిల్ప ప్రయోగం.

***"కానీ... / అక్కడ / మా / ఊరు / లేదు!"***

***'ఊరు చెదిరిపోయింది'*** అనే ధ్వని రూపపరంగా ఇక్కడ వ్యక్తమైంది.

ఇంకా 'సునపకాయ','ఆత్మీయస్పర్శ','మహాశూన్యం' కవితల్లో వస్తువైవిధ్యంతో పాటు నిర్మాణంలోని ప్రవాహశీల ధర్మాన్ని చూడొచ్చు. ఈ సంపుటిలో ప్రత్యేకంగా పేర్కొనదగిన కవిత 'అతనో కథల చందమామ'. శీర్షికలో ఎంత సౌందర్యముందో, కవితలో అంత వ్యక్తిత్వ కాంతి వుంది. ఆ వ్యక్తిత్వం గంటేడ గౌరునాయుడిది. ***"నలుగురు తెల్లకాగితాల్లాంటి కుర్రాళ్ళను చేరదీస్తాడు / వారికి సాహిత్యమధురిమలు నింపిన / వారాంతపు సాయంత్రాలను కానుకలుగా ఇస్తాడు."*** ఎంతో గొప్ప పని కదా అది! ఈ కవితలో కవి రవీంద్రనాథ్ వాడిన విశేషణాలు అత్యుక్తులు కావు. గౌరునాయుడి విషయంలో అవి సహజోక్తులే.

వస్తువుల్ని ఎంచుకోవడంలో కవి రవీంద్రనాథ్ నిర్దిష్టంగా వున్నాడు. అట్లాగే ఆయన రూపశ్రద్ధ కూడా దాదాపు ప్రతీ కవితలో కనపడుతుంది. శైలిలో 'సరళత'ను ఇష్టమార్గంగా ఎంచుకోవడం వల్ల ఇతని కవిత్వంలో క్లిష్టత లేదు. ఆలోచింపజేసే గుణమే కాక కదిలించే గుణం కూడా ఇతని కవిత్వానికుందని నాకనిపిస్తుంది.

ఈ వ్యాసం ముగింపులో కొంత వెన్నెల కాంతినద్దాలని వుంది. దీన్ని రవీంద్రనాథ్ కవిత్వంలోంచి తెచ్చుకుని. మనుష్యుల జ్ఞాపకాల్నీ, ఊసుల్నీ, కలల్నీ ఆకాశానికీ, వెన్నెలకూ, పక్షికీ ఆపాదిస్తూ ఈ కవి అద్దిన వాక్యాలివి.

***"ఆకాశం మన జ్ఞాపకాలను / అలంకరించుకుంది / వెన్నెల్లో తడిసిన చెట్టు / మన ఊసులను రాలుస్తూనే వుంది / గూట్లోని పక్షి మన కలలను పొదుగుతూ వుంది!"***

నిశ్శబ్దంగా చదువుకోవాల్సిన పాదాలివి! 'పక్షితనాన్ని కలగంటూ' లోని కవితల్ని గొంతెత్తి చదువుకోవచ్చు. నిశ్శబ్దంగానూ! ♦

కవిత

## రక్తమోడిన రహదారులు

- ఝున్సీ కె.వి. కుమారి
9010823014

కరోనా కవిత

శతాబ్దాల నుండే ఈ దేశానికి
రక్తదానం చేస్తున్నవాడు
తాత తండ్రుల నుండి
వారసత్వం అందుకున్నవాడు
ఈ నేల కదా తనకు జన్మనిచ్చింది
ఈ నేలకే తన జీవితాన్నివ్వాలన్న
దృఢ సంకల్పం..
ఆ రక్తపు ప్రతి బొట్టులో..!
మాటల మాయాజాలంతో
పిట్టలదొర వేషాలతో
దేశప్రజలను నిండా ముంచి
ధనారాసుల కొండల్ని... ఆబగా
దోచుకున్న....దొంగల ముఠావాడు
కాదు కదా తను...?
దేహాత్మలతో త్యాగాన్నే శ్వాసిస్తూ
తన వారసులకు
బాల్యం నుండే అక్షరాభ్యాసం
చేయిస్తున్నవాడు కదా!

♦

తన రక్తమాంసాలతో
నేల నుండి నింగి వరకూ
అంతటా విస్తరించి ఉన్నవాడు...
తాను కట్టిన భవనాలు
గగనంతో కబుర్లాడుతూ
పకపకా నవ్వుతుంటే
ఆ నవ్వులన్నీ తనవేనని మురిసి
పోయేవాడు
"కరోనా పడగెత్తిన విషకాలంలో
నీకింత నీడనివ్వక పోయామే..
అన్నా" అని
ఆ ఆకాశ హర్మ్యాలు...
కన్నీరు కారుస్తున్నాయి....

♦

"మాలో సగం నీకే చెందాలి కదా
నీ రక్త ప్రాణాల ఖరీదు కదా, మేము
నువ్వు లేని కాలమంతా...
మేము..
ఒట్టి... నేలా, మట్టే కదా, అన్నా,
నీ కన్న పిల్లలకూ,
నిన్ను కన్న తల్లులకూ
కడుపు నింపాల్సిన మేము
కనుమరుగయ్యామన్నా...
కబ్జా అయిపోయామన్నా..." అంటూ

ఏ కోటల్లోనో దాక్కున్న కరెన్సీ కట్టలు
సిగ్గుతో.. తలవంచుకున్నాయి...

♦

కొండలను కూల్చివేశాడు
లోయ మడుగులను ఎత్తుచేశాడు
ముళ్ళ పొదలను .. రాళ్ళ కుప్పలను
సమతల నేలగా చదును చేసి
ఆ సేతు హిమాచలం
స్నేహ వారధులు కట్టి...
నేలను పరుగుపెట్టించాడు...!
నిలువెల్లా.. ఆనంద పరిమళమై
నేలంతా పరవశించాడు!
ఉన్నట్టుండి.. హఠాత్తుగా ఓ పిడుగు!
దేశాన్ని కరోనా చుట్టుముట్టింది
దేశానికి తాళాలేశారు..!

♦

కాలం... ఆగిపోయింది
పరుగైన జీవితం...ప్రశ్నార్థకమయింది..
కూడు లేదు... గూడు లేదు
దూరతీరాల్లో .. అమ్మానాన్న
అక్కా తమ్ముడు..? అమ్మో.. కరోనా..
అమ్మ ఊర్లో కూడానా..?

♦

ప్రగతి రథ చక్రాలకు మహా చోదకుడై
పరుగులు పెట్టించిన నవభారత నిర్మాత
ఇల్లాలు పిల్లలతో...నట్టనడిరోడ్డున
ఒక్కడే మిగిలాడు...
దిక్కులన్నీ పారిపోయాయి...
కళ్ళనిండా నీళ్ళు... కాళ్ళల్లో రక్తం..
వేదనా ప్రవాహాలు
సుడులు తిరుగుతున్న హృదయం
కృతజ్ఞత లేని..ప్రణాళిక లేని దేశానికి..
తన సర్వస్వం ఇచ్చాడే...!
దేశం వెలుగుతోందని బూరలు ఊదే
ప్రభుత్వాలకు
ఆ వెలుగుకు కారణమైన సూర్యులు
కానరాకపోవడం.. అంధత్వమా...?

♦

ప్రజలకు ఇళ్ళూ... వాకిళ్ళూ కట్టిన
వాళ్ళం
నదులు ప్రాజెక్టులు పరిశ్రమలు
ఆనకట్టలు
అన్నీ...మన శ్రమ ఫలితాలే!
పదండి...దేశానికి రాళ్ళెత్తిన మనకాళ్ళే
మన గూళ్ళకి మనల్ని చేరుస్తాయి...
రక్తమోడినా.. ప్రాణం పోయినా...
ప్రారంభిద్దాం మహాప్రస్థానం
శిలువను మోసిన క్రీస్తుప్రభువులా
ఈ రహదారులకు...మరోసారి
చేద్దాం...రక్తాభిషేకం!
పోదాం... అమ్మ ఒడిలో వాలిపోదాం...
చివరి చూపులకైనా...పరుగులు
పెడదాం...

♦

# ఆటా పాటా



- డా. ఎం. హరికిషన్
9441032212

మంగమ్మ, సుబ్బయ్య మొగుడూ పెళ్ళాలు. ఇద్దరిదీ చూడచక్కని జంట. సుబ్బయ్య పాట పాడతా వుంటే మంగమ్మ ఆట ఆడతా వుండేది. వాళ్ళ ఆటా పాటా అంటే చుట్టుపక్కల చానా పేరు. వాళ్ళని పిలవని వూరులేదు. పొగడని నోరూ లేదు.

సుబ్బయ్య పాట వింటే పసిపిల్లోడైనా సరే ఛటుక్కున ఏడుపు మాని చిరునవ్వులు నవ్వుతాడు. ఆ పాట వింటా వుంటే ఆకాశం నుండి పూల వాన రాలినట్టుండేది. చెమట పట్టిన ఎఱ్ఱటి ఎండలో చల్లని గాలి ఒక్కసారిగా శరీరాన్ని తాకినంత కమ్మగా వుండేది. ఇక మంగమ్మ సంగతి సరే సరి. ఆమె ఆట ఆడతా వుంటే తెలియకుండానే వంటిలో వంద వీణలు మోగేవి. పండు ముసలోడయినా సరే మంచం మీద నుండి లేసి అడుగులో అడుగు కలపవలసిందే. ఆ ఆటాపాటకు చుట్టుపక్కల భలే పేరు. కాసులు గలగలగల రాలేవి. అదేవారి వృత్తి, జీవనాధారం.

చుట్టుపక్కల ఏ ఊరిలో జాతర జరిగినా, ఏ గుడి ముందు సంబరాలు మొదలయినా వీళ్ళ ఆటాపాటా పెట్టించేవాళ్ళు. మంగమ్మ ఆట, సుబ్బయ్య పాట అంటే మాటలు సరిగా రాని చిన్న పొట్టిగాని నుంచి, పైకి పోవడానికి రోజులు లెక్కబెట్టుకుంటూ వున్న ముసలోళ్ళ వరకు ఆడామగా తేడా లేకుండా మూగబడేటోళ్ళు. పాటలోకి దిగితే సుబ్బయ్య తనను తాను మైమరచి పోయేవాడు. జనాల అరుపులు, కేకలు, ఈలలతో మరింతగా వూగిపోయేవాడు. జలపాతంలా పదాలు పరవళ్ళు తొక్కేవి. అంతలో గజ్జె ఘల్లుమనేది. ఎక్కడి గుండెలు అక్కడ అలా ఆగిపోయేవి. మంగమ్మ ఒక్కొక్క అడుగే వేసుకుంటా వచ్చి పాటకు తగ్గట్లు చిందు తొక్కుతా వుంటే చూసేవాళ్ళు ఒళ్ళు మైమరిచిపోయేవాళ్ళు. చినుకు చినుకు కలిసి వానై, వంకై, వాగై, నగై పోటెత్తినట్లు ఆటపాట కలిసి ఏకమై నిమిషనిమిషానికీ వుగ్రూతలూగించేది. జనాలకు పూనకాలు వచ్చేవి. గొంతు కలుపుతూ, కదం తొక్కుతూ ఆనందం ఆకాశాన్ని తాకేది.

సుబ్బయ్య ఎప్పుడూ ఒకటే పాటలు పాడకుండా కొత్త కొత్తవి అల్లేవాడు. ఏ పాటయినా సరే ఒక్కసారి వింటే... మనసులో నాటుకుపోయేలా... పల్లెజనాల మాటల్లోని రతనాలను ఏరుకొని, చిన్నచిన్న పదాలతో మల్లెల మాలలా కూర్చేవాడు, మంగమ్మ కొంచెం కూడా తగ్గేది కాదు. సుబ్బయ్య

పాటకు తగ్గట్టుగా కొత్త కొత్త చిందులతో పరవశంగా వూగిపోతా జనాలను వూపేసేది. వాళ్ళిద్దరి మనసులు ఎప్పుడు ఆటపాటల మీదే. జనాలు ఎగిరి గంతులు వేసేలా, ఈలలు మ్రోగిపోయేలా, పూనకాలు వచ్చి వూగిపోయేలా ఎలా పాడాలి ఎలా ఆడాలి అనేది వారి ఆలోచన.

కానీ ఏడాదంతా జాతరలు, తిరునాళ్ళు, పండుగలు వుండవు గదా. ఆటాపాటలకు వచ్చిన డబ్బులు పైసా పైసా తేనెటీగ లెక్క దాచి పెట్టుకొని వాడుకునేటోళ్ళు. ఖాళీ సమయాల్లో పొలం పనులకు పోయేటోళ్ళు, ఎప్పటిలాగే ఆ ఏడాది గూడా ఎమ్మిగనూరు నీలకంఠుని జాతరకు పిలుపొచ్చింది. సై అన్నారు. ఇద్దరూ సంబరంగా, ఆటపాటలకు కావలసినవన్నీ సిద్ధం చేసుకోసాగారు. అంతలో వూహించని విధంగా ఆ వూరిలో అందరికన్నా పెద్ద ధనవంతుని నుంచి పిలుపొచ్చింది.

"చూడూ... హైదరాబాదులో నా కూతురి పెళ్ళిని పెళ్ళికొడుకు తరపువాళ్ళు ఆధునిక పద్ధతిలో ఘనంగా జరిపితే, మరలి పెళ్ళి మన వూరిలో పక్కా పల్లెటూరి పద్ధతిలో మేం జరపాలని అనుకున్నాం. నీ ఆటాపాటా నాటుకోడి పులుసులో రాగిముద్ద కలుపుకొని తిన్నంత మజాగా వుంటాదంట గదా, చూసినోళ్ళందరూ లొట్టలేసుకుంటా చెబుతున్నారు. కాబట్టి ఆ రోజు నగరం నుంచి వచ్చే అతిథులందరినీ నీ ఆటపాటలతో అదరగొట్టాలి, ఏం సరేనా" అన్నాడు.

మరలి పెళ్ళి ఎప్పుడో తెలుసుకున్న సుబ్బయ్య నసుగుతా "అయ్యా... అదే రోజు ఎమ్మిగనూరు జాతర. పాట పాడడం మొదలు పెట్టినప్పటి నుండి ఏ ఏడాది తప్పలేదు. ఏమీ అనుకోకండి. రాలేము" అన్నాడు

"చూడు సుబ్బయ్య ... జాతరకేముంది. జీవితాంతం ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. నువ్వున్నా లేకపోయినా అది ఆగేది కాదు. కానీ పెళ్ళి వచ్చేది ఒక్కసారే. జాతరలో నీకిచ్చే దానికి పదింతలు ముట్టజెపుతా. కాదన్నా వదిలేది లేదు. ఈ ఊరిలో నా గురించి నా బలం గురించి నీకు తెలుసు గదా" అంటూ ఒకవైపు డబ్బు చూపుతూనే మరొక వైపు వేలు పైకెత్తి హెచ్చరించాడు.

సుబ్బయ్య ఏమీ చేయలేక తల వంచుకొని తలూపాడు. నీలకంఠుని జాతరకు రాలేనని కబురు పంపాడు. దానికి వాళ్ళు, "చూడు సుబ్బయ్యా... జాతరలో దేవున్ని చూడడానికి ఎంత మంది కదులుతారో, మీ ఆటాపాటా చూడటానికి అంతకు రెండింతలు పోటెత్తుతారు. అలా అని వాన్ని ఎదిరించి నిన్ను రమ్మని ఇబ్బంది పెట్టలేం. కానీ జాతర రాతిరంతా వుంటాది గదా, మరలి పెళ్ళి అయిపోయిన మరుక్షణం వచ్చేసేయ్. ఒక్క పాట పాడినా చాలు దేవుడు గూడా పరవశించి పోతాడు" అని చెప్పారు. సుబ్బయ్య గమ్మున తలూపాడు.

మరలి పెళ్ళి రోజు రానే వచ్చింది. సుబ్బయ్య మంగమ్మల మనసంతా జాతరపైనే. కానీ మాట ఇచ్చాక తప్పదు కాబట్టి ఇద్దరూ కొత్త బట్టలేసుకోని అక్కడ అడుగు పెట్టారు. విశాలమైన తోటలో వేదిక మీద పెళ్ళికూతురు పెళ్ళికొడుకు. కింద ఖరీదయిన సోఫాలపై అతిథులు. తళతళలాడే పట్టుచీరలు, జిగజిగలాడే బంగారు హారాలు, ఘుమఘుమలాడే సెంటు సీసాలు, మిలమిలలాడే పట్టు పంచలు ఒకరినొకరు గంభీరంగా పలకరించుకొంటున్నారు. చిరునవ్వులు పెదవి దాటనంతగా రువ్వుతున్నారు. గుసగుసలాడుకుంటున్నారు. హుందాగా తలలూపుతున్నారు. బట్టలు మడత పడకుండా, దుమ్ము తగలకుండా, చెమట పట్టకుండా తిరుగుతున్నారు.

వేదిక పైన కొత్తజంటను పలకరించి కొందరు దిగుతుంటే మరికొందరు కింద నుంచే చేతులూపుతున్నారు. తినేవాళ్ళు తింటున్నారు, తాగేవాళ్ళు తాగుతున్నారు. వాగే వాళ్ళు వాగుతున్నారు. సుబ్బయ్య, మంగమ్మని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏదో బెరుకు గొంతులోనూ, నడకలోనూ, నెమ్మదిగా గొంతు సవరించుకొని పాట మొదలుపెట్టాడు. సుబ్బయ్య పాటకు తగ్గట్టుగా మంగమ్మ ఆట. కానీ ఈలలు లేవు, అరుపులు లేవు. కేరింతలు లేవు. పులకరింతలు లేవు. అందరూ మొహాలపై చిరునవ్వులు అతికించుకొని అప్పుడప్పుడు తలెత్తి పాడుతున్న వాళ్ళని వింత జంతువుల్లా, అనాగరికుల్లా చూసి మరలా తమ మాటల్లో తాము మునిగిపోతున్నారు.

నెమ్మది నెమ్మదిగా సుబ్బయ్య పాటలో వూపు తగ్గిపోసాగింది. దానికి తగ్గట్టుగా మంగమ్మ ఆటలో లయ తప్పుతోంది. ఎలా పాడినా ఎవరూ పట్టించుకోవడం లేదు, గమనించడం లేదు. భోజనాలు చేసినవాళ్ళు చేసినట్టు వెళ్ళిపోతున్నారు. అందరూ నిమిష నిమిషానికి గడియారాలు చూసుకుంటున్నారు. అక్కడ తమ ఉనికికి కొంచెం గూడా విలువ లేదు. ఒక్కరు కూడా వాళ్ళ ఆటపాట కోసం వచ్చినోళ్ళు కాదు. సుబ్బయ్య గొంతు నెమ్మదిగా మూగబోసాగింది. అవమానంగా వుంది. దుఃఖంతో గొంతు

# నా అడుగులు చీకటి వైపు

మహబూబ్ బాషా చిల్లెం
9502000415



చీకటిని ప్రేమించినంత ఇష్టంగా
వెలుగును ప్రేమించను
బహుశా నీకు నేను
ఇప్పుడు అర్థం కాకపోవచ్చు
వెలుగులో వెతికితే నవ్వులే కనిపిస్తాయి
మరి చీకటిలో...?
దుఃఖాన్ని దేహాలకు తొడుక్కున్న
దీనులెందరో కనిపిస్తారు
కళ్ళలో బ్రతుకు కాంతులు లేని
నిర్జీవుల అవశేషాల ఆనవాళ్లు కనిపిస్తాయి
సమాజంలో అలసి సొలసిన
గుండెల గాయాలు కనిపిస్తాయి
ఆ చీకటిలోనే అణచివేయబడ్డ ఆత్మలు
నీకెన్నో చీకటి రహస్యాలు
చెవిన వేస్తాయి
నీవు ఇంకాస్త గమనిస్తే
ఆకలి పేగుల ఆర్తనాదాలు
అలవోకగా వినిపిస్తాయి
తరతరాలుగా తొక్కివేయబడ్డ
చరిత్ర పేజీలు
నీ చేతికి చిక్కుతాయి
ఇప్పుడు నువ్వు
వారి చరిత్రను విని
జాలిని చూపి
కన్నీటిని మాత్రం కార్చొద్దు
మసకబారిన వారి మెదళ్ళకు
కాసిన్ని అక్షరాలను అతికించు
నీకు వీలైతే, వారి మోములో
నవ్వులు పూయించాలంటే
నువ్వు ముందుండి
నాలుగు అడుగుల్ని కదుపు
అంతేగానీ...
అశ్రువుల కళ్ళను చూసి
అవహేళన చేయకు
నేను నడిచే దారిని దూషించకు
నేనూ, నా అడుగులెప్పుడూ
చీకటి వైపేనని మరచిపోకు... ♦

దూసుకుపోసాగింది. తలెత్తి మంగమ్మ వంక చూశాడు. ఆమె ముఖం కూడా మబ్బులు మింగిన చందమామలా దిగాలుగా వుంది. కింద హడావిడి నెమ్మదిగా తగ్గిపోయింది. సుబ్బయ్య పాట ఆగిపోయింది.

ధనవంతుడు వచ్చి జేబులోంచి డబ్బులు తీసి ఇవ్వబోయాడు, సుబ్బయ్య, మంగమ్మ చేతులెత్తి దండం పెట్టి పాడింటే గద సామీ.... డబ్బులు తీసుకోడానికి అంటూ పైసలు తీసుకోకుండానే తలొంచుకొని కళ్ళనీళ్ళతో అక్కడినుండి వడివడిగా బైటపడ్డారు. సమయం పదకొండవుతా వుంది. సుబ్బయ్య మన్ను తిన్న పాములెక్క మౌనంగా మంగమ్మ చేయి పట్టుకున్నాడు. అడుగు తీసి అడుగు వేయలేక పోతున్నాడు. జీవితంలో మొదటిసారి ఇంత పెద్ద ఓటమి. మంగమ్మ ఆటో ఆపింది. వాని చేతిలో అయిదు వందలు పెట్టింది, ఆటో గాలిలో దూసుకుపోసాగింది... సుబ్బయ్య కళ్ళు మూసుకొని మంగమ్మ ఒడిలో తలబెట్టుకొని మగతగా నిదురపోసాగాడు.

ఏవో అరుపులు కేకలు, కోలాహలం, సుబ్బయ్య కళ్ళు తెరిచాడు. ఆటో ఎమ్మిగనూరు జాతర దగ్గర ఆగి వుంది. నడిరేయి కూడా అక్కడ పట్టపగలులా వుంది. తడిచిన మట్టి వాసన, జనాల చెమట వాసన కమ్మగా తాకుతోంది. ఇదేమి ఇంటికి కాకుండా ఇక్కడికి తెచ్చావు చేత గాదు" అన్నాడు నీరసంగా సుబ్బయ్య,

"ముందు నువ్వు దిగు మామా" అంది చేయి పట్టుకొని మంగమ్మ. వాళ్ళు దిగుతా వుంటే ఒక ముసలోడు కళ్ళు పెద్దవి చేసి చూశాడు. "రేయ్... మన సుబ్బయ్య, మంగమ్మ వచ్చారోయ్" అంటూ భూమి బద్దలయ్యేలా సంబరంగా గొంతు చించుకొని అరిచాడు. ఆ అరుపు అంటుకుంది దావానలం అయింది. అంతవరకు చప్పగా వున్న జనాల మొహాల్లో సంబరం పొంగి పొరులుతోంది. కట్టలు దాటి దుముకుతోంది.


సుబ్బయ్య మంగమ్మ జనాలు వచ్చి తమను చుట్టుకొనే లోపలే వేగంగా తప్పించుకుంటూ దూసుకుపోయారు. అంతవరకూ ఆవరించి వున్న నిస్సత్తువంతా పారిపోయింది. ఈలలు కేకలు అరుపులతో వేయిఏనుగుల బలం ఒంటిలోకి ఒక్కసారిగా చేరిపోయింది. గొంతు పువ్వులా విచ్చుకుంది. మైకు జీవం పోసుకుంది. గజ్జ ఘల్లుమంది. పాట పై నుంచి నేలకు దిగి... మనిషి మనిషినీ తాకుతా చిందులేయసాగింది. పైనా కిందా తేడా లేకుండా అంతటా ఆట పాట, చెమటతో తడిసిన రూపాయి బిళ్ళలు సంబరంగా గాలిలోకెగిరాయి. సుబ్బయ్య, మంగమ్మ పెదాలపై వేలపూలు పూశాయి. ♦

## నీవో అద్భుతానివి

- కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114

నీవో అద్భుతానివి
ఎలాగో చెప్పనా !

నేటి క్షణాలు రేపటికి గతాలై
కళ్ళ ముందు నుండి కరిగిపోతుంటే
వర్తమానానివై భవిష్యత్తుకు సవాల్ విసురుతావ్ !
ఉప్పెనలా ఉవ్వెత్తున లేస్తున్న
ఉద్వేగాలను అరచేత్తో అమాంతంగా పట్టుకుని
నిబ్బరంగా నిలబడతావ్ !
అవధుల్ని దాటిన ఆశల్ని
ఆశయాలుగా మార్చి
అమితంగా శ్రమిస్తావ్ !
తెల్ల కాగితానికి మార్జినేసినట్టే
బ్రతుకు భయాలను
మార్జిన్ల బయటకు తోసి
స్వచ్ఛమైన జీవితాన్ని
ఎంచుకుంటావ్ !
ప్రతిజ్ఞలు లేని ప్రయత్నాలతో
ప్రతిసారీ నీవు
అవరోధాల్ని అధిగమిస్తావ్ !
పరిసరాలు
తెచ్చి పెట్టుకున్న నవ్వుల్తో



కృత్రిమ రంగుల్తో
స్పృశించలేని కరచాలనాలతో కనిపిస్తుంటే
నీవు వాలే భుజమై ఆసరా అవుతావు !
సామాజిక అనాసక్తి  అసంతృప్తి కూడా
అతి సహజమై సామూహిక నిర్జనత్వం ఎదురైనప్పుడు
గుండె నిండా గుప్పెడు ఆశతో ఎదురెళ్తావ్ !
ఒత్తిళ్లు ఒడుదుడుకులు
విశ్వమంతై విహరిస్తుంటే
నిబ్బరంగా లక్ష్యం వైపే పయనిస్తావ్ !

వాగ్దానాలు చేయని సంతోషాలను
సమాధానాలు ఇవ్వని కోపాలను
నిర్ణయాలు తీసుకోని నిరాశా సమయాలను
మార్గాలుగా మార్చేసి
జీవితపు ఆటను గెలుపు బాటలో నడిపిస్తావ్ !

జీవితానికి మరికొన్ని కొత్త రంగుల్ని అద్దుతూ
ఇంద్రధనుస్సునే గుండెలపై పూయిస్తావ్
అంతెందుకు
అద్దాల మధ్య కాలాన్ని బంధించి
అరచేతికి అంగుళం పైన అట్టిపెట్టేస్తావ్ !
అందుకే
నీవో అద్భుతానివి !

◆

---

## నానీలు

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440243261

ఇవ్వాళ నాకు
కొత్త మిత్రుడు దొరికాడు
ఆలింగనం
కళ్ళతోనే!


బడులు
మూతబడ్డాయి
పూల తోటలు
ధ్వంసమవుతున్న కల!

మాస్కున్నది నాకే
నా పద్యానిక్కాదు
గురి గింజ నలుపు
దానికి తెలుసు!

పద్యం
ప్రదర్శన కోరుకుంటది
లాక్ డౌన్లను
ధిక్కరిస్తది!

నేను
నా మిత్రులు
ప్రతి సాయంకాలం
ఇప్పుడో వచ్చి జ్ఞాపకం!

◆




# కొత్తదనం సౌందర్యం సామాజికత

- జుజ్జూరి వేణుగోపాల్
9912395420

*నిజం ఎంత శక్తివంతమైందో, అబద్ధం కూడా అంత శక్తివంతమైనది. ఇవి రెండు పాలు నీళ్ళలా కలిసిపోతాయి. అనిల్ విలక్షణ దృక్కోణంతో అబద్ధాన్ని అబద్ధంగా...నిజాన్ని నిజంగా విడగొట్టాడు .*

తూటా వెనుక గన్ పౌడర్‌లా విస్ఫోటనం చెందే కవి అనిల్ డ్యానీ. ఋజుమార్గం ఇతడి ప్రయాణం.

తాత్త్వికతతో ఈ కవి మార్మిక మాంత్రికుడు.

ఇతగాడు దోషాల్ని సరిచేసే తెగువ ఉన్నవాడు.

ఇతడి అక్షరాలు మాత్రం కుంటి నడక నడవవు.

అక్షరం ఒక తరం నుండి మరొక తరానికి విజ్ఞానాన్ని మోసుకెళ్ళే అశ్వం. ఈ అశ్వానికి కళ్ళెం వేయకుండా, ప్రక్షిప్తాలతో దొర్లకుండా మనముందుకు తీసుకొచ్చాడు.

చరిత్ర పొడవునా, మత గ్రంథాల్లో అడ్డంగా "స్పెల్లింగ్" మిస్టేక్లేం కర్మ "సెంటెన్స్" మిస్టేక్లే ఉన్నాయి.

ఆ వ్యాఖ్యానాల కొనసాగింపే ఇప్పటి మన జీవనాలు.

కాలంలో కాలుజారిన లెక్కలు ఇప్పుడు ఏ మత గ్రంథాల్లో వెతకాలని ప్రశ్నిస్తాడు. నువ్వు ఇంకా ఎక్కడ లేని యుగాన్ని నాటికల్ మైళ్లతో పోలుస్తూ కొలవడం అని నిరసిస్తాడు. ఊరిమధ్య కులందిమ్మకి తలబాదుకుంటున్న ఓటరుని పరామర్శిస్తాడు. ***అన్ని చోట్ల అదే బాధ/ ఆధిపత్యపు దుమ్మే ఎగురుతూనే ఉంది/ అక్కడో నీలి చూపుడువేలు ఉంది. ఆ దారిలో పోతే బాగుండు అనిపిస్తుంది*** అని తనతో పాటు మనకో దారిని చూపిస్తాడు.

ప్రాచీన అలంకారికులైన భరతుడు, భామహుడు, దండి నుండి మమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుని వరకు అందరి కావ్య నిర్వచనాల్ని విన్నాం. జగన్నాథుని "రమణీయార్థ ప్రతిపాదిక శబ్దం కావ్యం" అన్న దానితో ఏకీభవించాం. అనిల్ రమణీయత సాధించాడు.

అతను రూపు కట్టించే భావం వేరు. అతని పరంపరే వేరు. అందుకే మనం అతని కవిత్వానికి అంత విలువ ఇచ్చుకొంటాము. అయితే కొత్తదనంతో కూడిన సౌందర్యంతో పాటు సామాజికతను కవి బాధ్యతగా తీసుకున్నాడు.

అమరావతిలో మూడు పంటలు పండే భూమి. రాజధాని పేరిట పిల్లలకు ఆటస్థలం అయ్యి, వాళ్ళు క్రికెట్ ఆడుతుంటే చూసి కవి ఆకుపచ్చని కన్నీరు కార్చారు. జీవన విధ్వంసానికి, మాయమవుతున్న ప్రకృతికి సాక్షిగా నిలబడ్డాడు.

***23 అడుగుల చదును నేల/ అటు మూడు...ఇటు మూడు పాతిన కర్రలు/ వొట్టి పాదాల మీద గెంతుతున్న పిల్లలు/అదంతా కొత్త భాష... పెట్టుబడిదారీ వ్యాకరణం/ ఆట ముగిశాక /పండడం ఒక్కటే తెలిసిన నేల/ కర్రల చివర్లకి వేర్లని పూయించింది/ తాతను అడిగితే నేల రహస్యం చెవిలో చెప్పాడు/ బయటకు చెబితే రాజ్యం వింటుంది కదా. (మనకేం తెలుసు)***

కవిత్వమంటే ఇలా సాక్షిగా నిలబడడమే. కవిత్వానికి

నిర్వచనాలు వెతుకుతాం. నిజానికి ఏ నిర్వచనం కవిత్వాన్ని సంపూర్ణంగా ఇముడ్చుకోలేదు. కవి చేయాల్సిందల్లా సాక్షిగా నిలబడడమే. పసిపాప నవ్వుకి సాక్ష్యంగా నిలబడాలి. రాక్షసుల దుఃఖానికి సాక్షిగా నిలబడాలి. పచ్చని ఆకుకి సాక్షిగా నిలబడాలి. ఆకు రాలి బూడిద కుప్పగా మారాక దానికి సాక్షిగా నిలబడాలి.

కూలి చేసుకునే సాధారణ స్త్రీ సౌందర్యం వంగపండు చీర కవితది.

*అమ్మేయ్ ...ఏడకొన్నావే ఈ చీర/ ఆ మాట ఒక్కటి వింటే/ జళ్ళోనే పూలు పూసిన ఆనందం/ ఆ యాల కూలిబోయిందని గుర్తురాదు/*

*అడిగినోళ్ళకి ఖరుదు చెబుతూ/అడగనోళ్ళకి ఇంకాస్త ఎక్కువ అగపడుతూ/ ఎంత చెప్పినా వినని అమ్మలక్కల్ని ఓ సూపు చూసి/ ఒక్కసారి మూతి తిప్పుకుని/ వాడ మొత్తాన్ని ఆడకుండానే ఓడించిన తన్మయత్వంతో అడుగులు తడబడుతూంటే/ ఆ పొద్దంతా చెప్పుకోలేని కుశాలు/ తెల్లారి చీరను తడిపి ఆరబెట్టేటప్పుడు అప్రయత్నంగా వచ్చే మాట/ పనికిమాలినోడు రాత్రంతా యాడ పడుకోనిచ్చిండు.*

బతుకులో ఉండే విముక్త సౌందర్యం ఈ కవితది.

అశ్లీలత లేని అందం ఈ కవితది. ఆ అందం ధనవంతుడు ఇంటి గార్డెన్‌లో అందానికి పెంచుకున్న మొక్కలా ఉండదు. పల్లెచివర బీడు భూమిని అరక పెట్టి దున్నాక మిట్టమధ్యాహ్నం ఎండలో సాళ్ళతో భూమి బంగారంలా మెరిసిపోతుంది...ఆ అందమే వంగపండు రంగు చీరది.

ఎవరైనా మొక్కలు నాటితే మంచిదేగా అనుకుంటాం. కానీ ఆ మొక్కను నాటడం లో నాటిన వాడి స్వార్థాన్ని మనం పట్టుకోలేం.అది కవి చేశాడు. నిజం ఎంత శక్తివంతమైందో, అబద్ధం కూడా అంత శక్తివంతమైనది. ఇవి రెండు పాలు నీళ్ళలా కలిసిపోతాయి. అనిల్ విలక్షణ దృక్కోణంతో అబద్ధాన్ని అబద్ధంగా...నిజాన్ని నిజంగా విడగొట్టాడు .

*ఈ నాటుడు నాటకం మా కోసం కాదని మాకు ముందే తెలుసు/ మీ రాబోయే మూడోతరం మనవలంగారి కోసమని ఆ మొక్కలకు తెలుసు. (నీ కీర్తి నీదే)*

*ఏసీ గదులు వదిలిన వేడిని చెవట దేహాలు మాత్రమే పూసుకుంటాయి/ తరతరాలుగా సామాజిక ఉష్ణాన్ని మోస్తూ తిరుగుతున్న దేహాల మీద వేడి తీరాలంటే/ ఎక్కడో ఒక చోట మరల భూమి మండించే వేడి పుట్టాల్సిందే.*

కవి మనస్తత్వాన్ని లోతుగా అధ్యయనం చేశాడు.గుంపు మనస్తత్వాన్ని ఉదాసీన వైఖరిని వాస్తవంగా చిత్రీకరించాడు. మనిలోని వింతల్నీ, వికారాన్ని దుయ్యబట్టారు. మెరుపులు కవితలో మనుషుల్ని కుప్పగా పోసాడు.

*వెళ్ళీ వెళ్ళగానే ప్లాస్టిక్ నవ్వొటి వచ్చి తాకుతుంది/ అంతే అదే ఆఖరి మనం ఎక్కడ ఉన్నామని గుర్తు/ చుట్టూరా జనం రంగుల పువ్వుల్లా ముసురుతూ ఉంటారు/ పెదాలు మాత్రమే మాట్లాడుతాయి/ మనసుల్లో కాస్త ఇరుకున్నదని అందరికీ తెలుసు/ అక్కడ వినబడే సంగీతం మన కోసం కాదు/ నిజానికి అక్కడ మత్తెక్కించే పరిమళం అక్కడ వారికి కాదు/ ఆ మాటకొస్తే అసలెవరికీ అక్కర్లేనివి/ ఊరికనే ఎవరి కోసమో/ ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోననే మాటకి అలా అన్నీ అమర్చి పడతాయి/ రుచి లేకపోయినా ఆరాటం కొద్దీ తినేసి/ తాంబూలం వేసి నడుచుకుంటూ/ ఈ సమాజాన్ని, కుళ్ళును తిట్టుకుంటూ వెనదిరుగుతాం/ ఈసారి మన ఇంటివంతు వచ్చేసరికి మనమూ అంతే.*

కవి మనుషులు కథ తెలిసినవాడు. రాయలసీమ వాసుల దైన్యాన్ని, అభ్యర్థనను విన్నవించాడు,

*ప్రపంచం ముందుకు పోతున్నా/ మమ్మల్ని మాత్రం ఫ్యాక్షన్ పలుపు తాటికి కట్టేయకండి.*

జాలరికి-సముద్రానికి ఉన్న దూరం కొలుస్తాడు. డ్రాయింగ్ రూమ్ కి మనకి ఉన్న అనుబంధంతో తూకమేస్తాడు. పల్లెల్లో జాతర ఎందుకు చేయాలో చెబుతాడు. ప్రణయ్‌లో ఉన్న ప్రేమతో, అండాసెల్ లోని సాయిబాబా స్వేచ్ఛతో విహరిస్తాడు.

పెద్దవాడు అవుతున్న కొద్దీ మనిషి సున్నితంగా తయారవ్వాలి. కళ్ళు చెవులు పెద్దవిగా చేసుకుని పిల్లల్లా మారిపోవాలి కానీ పెద్దవాళ్ల తీరు అంతా వింతగా ఉంటుంది తమను తాము ఇరుకిరుకు బృందాల్లో గదుల్లో భావజాలంలో బంధం చేసుకుంటారు No strangers here. Only friends you haven't met yet - W.B YEATS (ఇక్కడ అపరిచితులు లేరు. ఇంకా కలవని స్నేహితులు మాత్రమే ఉన్నారు) చెప్పినా చివరికి సొంత పిల్లలతో అపరిచితులుగా మారిపోతున్నాం.

*పక్క మీద ఎంత మెసిలినా నిద్ర రాలేదు/ ఎటు కదులుదామనుకున్నా బొమ్మ చేతికి తగులుతోంది/ తేలిగ్గా ఉండే బొమ్మ బరువుగా అనిపించింది/ నాకు చెప్పవలసినవేవో ఆ బొమ్మకు తెలుసు/ దాని భాష నాకు రాదు/ వచ్చిన పసివాడు*

**కవిత**

# కృష్ణ పక్షం

- గోపాలరావు కందిపాటి
9652174640

*కష్టాల్ని స్కాచ్ విస్కీ లో*
*కాచి వడపోసి తాగి నోడివి*
*సుఖాల సుగుణా మోటర్ తో*
*దుఃఖ సముద్రాన్ని తోడెయ్య లేవా*

*గోడ మీద పోస్టర్లను చూడగానే*
*ఆగిపోయే మున్సిపాల్టీ ఎద్దు లాగా*
*నీ వాక్యం విషాదం బార్ ముందు*
*మందు పాత రై తూలుతోంది*

*నేనెప్పుడూ నా ఏడుపును*
*గడప దాటని వ్వలేదు*
*ఎవరి విషాద వాయులీనాలు*
*వారి వారికి కర్ణ రసాయనాలు*



*పదాల పదాతి దళాలిప్పుడు*
*జాతీయ విపత్తు కే గాని*
*వ్యక్తి గత శోక సంతప్త గీతాల్కై*
*కవాతు చేసే శ్రుతి లయలు కావు.*

*ప్రణయ కావ్యాల్ని కురిసిన మేఘాలే*
*విధ్వంస క్షిపణుల్ని మోస్తున్నప్పుడు*
*జన ఘోషను శ్వాసించే పదాలెందుక్కావు*
*కవిని శాసించే నైఘంటిక ఘంటా నాదాలు.* ♦

---

***గాఢ నిద్ర లో ఉన్నాడు/ ఈ రాత్రి ఆ బొమ్మ చెప్పే కబుర్లు వినాలి/ ఎన్ని దెబ్బలు తినాలో/ రేపు పొద్దున వాడు లేవకముందే ఎక్కడైనా నా తలని దాచుకోవాలి. (నేను-బొమ్మ)***

క్యాపిటలిజం తన రూపాన్ని బహుముఖాలుగా విస్తరించుకుంటూ పోయి బినామీ వ్యవస్థలతో, క్రోనీ క్యాపిటలిజం (ప్రభుత్వ ఆస్తులను చట్టబద్ధంగా ప్రైవేటుపరం చేసుకోవడం)గా మారి ఉదయం నిద్ర లేచిన తర్వాత వాడే పేస్టు నుండి నిద్రపోయే పరుపు వరకు మన జీవితాన్ని నిర్దేశిస్తుంది.

ఇంటి పై కప్పు లేకున్నా సెటప్ బాక్సుకి 300.కొత్తసినిమా హీరో వాటా 200.

పెట్టుబడిదారీ వ్యాకరణంలో మానవ సంబంధాల్లో సంధి(కలయిక) నిర్మాణంగా జీవితాలు.

***డిసెంబర్ పూలు పూచే కాలమో కాని/ షాపింగ్ కాంప్లెక్స్ కి డబ్బులు పూచే కాలం/ నువ్వు వద్దకి తెచ్చిన డబ్బుని వదిలించుకునే కాలం/ మార్కెట్ మనిషిని మింగేసే కాలం/ అందరి సంతృప్తి కోసం ఒకడు వాడి పోయే కాలం. (డబ్బు పూచే కాలం)***

మధ్యతరగతి జీవితాల్లో కొట్టివేతలు ఎక్కువగా ఉంటాయి.ఓ కుటుంబం గురించి సేకరించిన మనస్తత్వ చిత్రణ మొత్తం మధ్యతరగతి జీవితానికి ప్రతీకగా నిలుస్తుంది. "పన్నెండొకట్ల పన్నెండు"కవిత సాగుతుంది.

12 12 365 రోజుల్లో 12 ఒకటో తారీకు జీవన సూత్రాలు లెక్కలు ఎప్పటికి అర్థం కావు ఎప్పటికప్పుడు ఒకటో తారీకు జడ పదార్థం నీ ఆస్తుల అప్పుల పట్టీని ఎప్పటికీ చేయని ఒక కనబడని సర్దుబాటు ప్రతి ఒక కాగితం.

పేద,మధ్య తరగతి జీవితాలు ఎదుర్కుంటున్న ఆర్థిక సమస్యలు సమాజంలో అసమానతలుగా మారతాయి.

ఈమధ్య ఆస్కార్ వచ్చిన పారాసైట్, జోకర్ చిత్రాల్లో ఆర్థిక అసమానత చూపిన విశ్వరూపం ఉంది. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి కుదుపుతున్న అసలుసిసలు వ్యాధి ఇదే. చివరకు మనిషిలో నైతిక శూన్యవాదం (మోరల్ నిహిలిజంగా మారుతుంది. అందుకే అవి ఆస్కార్కు అర్హత సాధించాయి. అందుకే స్పెల్లింగ్ మిస్టేక్ ఇప్పుడు అత్యవసరమైన పుస్తకం.

అలాగే కవి ఇంద్రియం తాలూకూ గ్రహణ తత్వాన్ని భాషా నిఘంటువుల్లో వెతుకుతాడు. అది సోమరితనం. గుండెపై పెంకు పగిలి తీవ్రత పదాలుగా జారాలి. అలాంటి స్థితి సాధించి అనిల్ సోమరితనాన్ని జయించాడు.

1)చెప్పే చెప్పనట్టు చెప్పడం

2)సాహిత్యంలో ఖచ్చితత్వం సాధించడం.

రెండోది అత్యంత సంక్లిష్టం. సంక్లిష్టాన్ని స్పెల్లింగ్ మిస్టేక్ సునాయాసంగా సాధించింది.అనిల్ సామాజిక పునాదిపై, పురోగామి దిశగా సమాజాన్ని నడిపే లక్ష్యంతో ఇలాంటి కవిత్వాన్ని రాయాలి...రాస్తూనే ఉండాలి. ♦

## ఇప్పుడేం కావాలి

విజయ్ కోగంటి
8801823244

రోదసి చీకటిలో
లోహవిహంగాలు ఇంకా దేనికో
వెతుకుతునే వున్నై
రాతికొండలనీ
వాడి ముక్కులతో రాబందులు
తొలుస్తూనే వున్నై
నిశిత దృష్టితో
చక్కర్లు కొడుతూ
రెక్కలార్చని డేగలు
ఆదమరచి పరిగెడుతున్న కోడిపిల్లల్ని
అదనుచూసి పడుతూనే వున్నై
నంగి నవ్వుల మధ్య
మహా తంత్రపు చక్రపు మరలేవో
టకటకలాడుతూ
చుట్టుకుపోతూనే వున్నై

అయితే ఇంకా ఏదో కావాలి
ఇంకా ఇంకా ఏదేదో కావాలి
పూసి మారేడు చేసేందుకు
ఇంకొంచెం మసి కావాలి
గుట్టుచప్పుడుగా దొంగాటలో
కొండలు నదులు కొల్లగొట్టేందుకు
రంగురంగుల గంతలు కావాలి

వాన తడపడం
నిప్పు కాల్చడం
మహిమ కాదనీ
మనుషులు మనుషుల్లా వుండాలనీ
బానిసత్వపు బతుకు వద్దనీ
కరిచే కాలనాగుని మట్టుపెట్టమని
బుద్ధి వున్నందుకు ప్రశ్నించి తీరాలనీ
చెప్పిన
ఒంటరి సోక్రటీసులను
బంధించేందుకు
ఇనుప చట్రాలు కావాలి
చంపేందుకు కాసింత విషం కావాలి

అమాయకుల్ని వెతికి మరీ
కొరత వేసేందుకు
ఇంకొన్ని శిలువలూ కావాలి ♦

---

## ఊరి దారిలో

కరోనా కవిత

బంగార్రాజు కంఠ
8500350464

సత్తువలేని చెమట చుక్కలు
దారిపొడవునా దొర్లుతూనే వున్నాయి
ఎవరికివాళ్ళు భుజాలపై భూమిని
మోసుకుంటూ
చీమలబారై ఊరి దారి పట్టారు
కాంక్రీటు చెట్లకింద సేదతీరుతూ
మురికి కాసారాల పక్కన
మృత్యువుని బుజ్జగిస్తూ
చావుకుముందు వచ్చే చావేదో
ఊరి ఒడిలో వచ్చిపోవాలని
సాగుతున్న బాటసారులు వాళ్ళు

ప్రపంచమంతా
పెల్లుబుకుతున్న మానవత్వం
తమవైపు ఒక్కసారైనా చూడాలనేం
ఎదురు చూడటంలేదు
వివక్షలో పుట్టి నిరంతరం వివక్షను
దిమ్మరించుకుంటున్న నడక
వివక్షలోనే నడక చాలించాల్సి
వస్తుందేమోనన్న
గుబులు నిలవనివ్వడం లేదు

ప్రత్యేక సదుపాయాలేమి అక్కర్లేదు
ఎలాగోలా ఊరు చేరడానికి
సురక్షిత సర్దుబాటొక్కటే వాళ్ళ కోరిక

తరాలుగా సామాజిక దూరానికి
అలవాటు పడిన బతుకులు
ఇప్పుడు కొత్తగా సామాజికదూరం
పాటించమంటుంటే
కొనఊపిరికి వేలాడుతున్న శరీరాలై
శక్తిని కూడదీసుకుని కిసుక్కున
నవ్వుకుంటున్నాయి
వినండి.., వినండి..,
దేవుళ్ళచేత ఎప్పుడో తరిమేయబడ్డాక
ఆశలదూలం నుంచి చెదిరిన
గుంపుగబ్బిలాల పాటది

క్వారంటైన్ కట్టుకథల పక్కనుంచి
కదిలిపోతున్న కార్ల మాయాజాలమ్ముందు
తడబడుతూ వాళ్ళ అడుగుల్ని అడుగులే
వెక్కిరించుకుంటున్నాయి
ప్రత్యేక విమానాల్లో
దేశాలు దాటిస్తున్న ప్రత్యేక సందర్భాల్లా
ప్రత్యేక ఆటోల్లోనైనా
ఊరు చేర్చకపోతాయాని
మాత్రమే ఎదురుచూస్తున్నాయి

వాళ్ళకేం తెలుసు
ఇక్కడ కొన్ని ప్రసంగాలు బూటకమని
ఫోటోదిగిన ప్రతీసాయం ఒక ప్రచారమని
వాళ్ళకేం తెలుసు
ఐదువందలకు డబ్బాలో కుక్కబడ్డ
బాలెట్ పత్రం వాళ్ళ జీవితమని
ఆకలికి ఎవరో విసిరే ఆహారపొట్లాలకు
ఇప్పటికీ ఎదురు చూస్తున్నామని ♦

**కథ**



# బలిమోడ్ని...

– దాసరి రామచంద్రరావు
9704459373

కరోనా పుణ్యమా అని అందరం ఇంట్లోనే ఉంటున్నాం. "నాన్నా నేనో కథ రాసాను" అంటూ, నా చేతిలో కాగితాలు పెట్టాడు, నా ఇరవై ఐదేళ్ళ కొడుకు. ఎప్పుడూ సెల్ ఫోనూ, కంప్యూటర్, టీవీలు చూస్తూ గడిపేవాడు, కథ రాయడమేమిటా! అని నేను ఆశ్చర్యపోయాను. చదవడం మొదలుపెట్టాను......

అవి దసరా రోజులు.

ఐదు రోజుల్నించి ముసురు. కుండపోత వర్షం. ఎదురింట్లో హడావిడిగా వుంది. రేపటి వ్రతానికి ఏర్పాట్లు చేస్తున్నట్టున్నారు. ఎవెరవరికో ఫోన్లు....ఆ ఇంటి యజమానికి, అధికారిగా ప్రొమోషన్ వచ్చి ఆరు నెలలయ్యింది. మొక్కు చెల్లింపుకు ముహూర్తం ఇప్పుడు కుదిరింది. కుదరడం కాదు. నీకు ప్రొమోషన్ ఫలానా అప్పుడు వస్తుందని చెప్పిన పంతులుగారే పెట్టారు. ఆయన శ్రీచక్ర పీఠం ప్రధాన అర్చకుడు. వారి చేతులమీదుగానే ఈ వ్రతం జరగాలని ప్రమోషన్ పొందిన అధికారి కోరిక. ప్రధాన అర్చకులవారంటే అంతగురి. వారి మాట అధికారికి వేదవాక్కు.

సాయంత్రం నాలుగయ్యింది. వర్షం తెరిపివ్వడం లేదు.

అధికారి కుటుంబసభ్యులంతా పోర్టికోలో ఎదురు చూస్తున్నారు. అనుకున్న వస్తువులు ఏవీ ఇంతవరకూ ఇంటికి చేరలేదు. ఆ ఆందోళన కుటుంబ సభ్యుల్లో కనిపిస్తోంది.

"మీరెలాంటి వాళ్లకి అప్పగించారో ..." అధికారి భార్య గొంతు కరకుగా వుంది. కసురుకుందో కస్సుమందో.

"వొచ్చెస్తారు.. వొచ్చెస్తారు... వొకటే వర్షం.. రావోద్దా, తేవోద్దా..."

మృదువుగా సర్ది చెప్తూ రోడ్డువంక చూసిన అధికారి–

" అదిగో సుబ్బారావ్ ..వచ్చేస్తున్నాడు." అని అరిచినంత పనిచేసాడు.

మామిడాకులతోసహా వచ్చిన సుబ్బారావు తడిచి ముద్దయ్యున్నాడు. సైకిల్ దిగకుండానే–

"సార్ నమస్కారం సార్, నమస్కారం సార్" అంటూ సైకిల్ కి వున్న మామిడాకులుతీసి గుమ్మంలో పెట్టి అతడక్కడే నిల్చొన్నాడు.

"లోపలికి రావోయ్ సుబ్బారావ్ తడిచిపోతావ్" అన్నాడు అధికారి కనికరంతో.

ఆవిడ మాత్రం ఆకుల్ని ఎగాదిగా చూసింది.

"మంచివి దొరకలేదా? అన్నీ ముడుచుకుపోయున్నాయి. శుభమా అని ...." అధికారి వైపు కొరకొరా చూసింది.

సుబ్బారావుకి తనవైపే చూసినట్లైంది.

"సార్, సార్ మంచివి తెస్తాను సర్" అంటూ తడిచిన చేతులతోనే గబగబా ఫోన్ తీసాడు.

"...రంగసాయి గారూ నేను సుబ్బారావుని..." అంటూ ఏదో మాట్లాడి, వచ్చినంత స్పీడుగా తిరిగి సైకిలెక్కి

బయలుదేరాడు సుబ్బారావ్.

"...ఎప్పుడు తెస్తాడు? ఎప్పుడు కడతాడు? ఏడ్చినట్టేవుంది...ముష్టిముండా వర్షం ఆగట్లేదు. ఉదయం ఆరోగంటకి పంతులుగారొచ్చేస్తానన్నారు....వొక్కక్షణం ఆగరు. అన్నీ రెడీగా వుండాలి..." అధికారి భార్య గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

అధికారి ఏమీ అనలేక రోడ్డు మీదకే దృష్టి సారించేడు. వర్షం వల్ల ఏమీ కనబడడం లేదు. బీటెక్ పూర్తిచేసిన ఆయన కొడుకు ఇదేమీ పట్టించుకోకుండా సెల్ చూసుకుంటున్నాడు. ఇంతలో కారు వచ్చి ఆగింది. డ్రైవర్‌తో మరో వ్యక్తి దిగాడు. తడుస్తూనే- కారు లోపల్నించి, వెనక డిక్కీ లోంచీ పెద్ద పెద్ద పాకెట్స్‌తో సామాన్లు దించి గుమ్మంలో పెట్టారు.

"ఇవేనా..సామాన్లు. పంతులుగారు రాసిచ్చిన వన్నీ వచ్చినట్టేనా?" అధికారి దర్పంగా అడిగేడు.

"లేదు సర్.. ఇవన్నీ వీళ్ళ షాప్ నుంచి తెస్తున్నాం. ఇతడు రాజేశ్వరీ డిపార్ట్ మెంటల్ స్టోర్ ఇంచార్జ్ ..." అని పక్కనున్నతన్ని పరిచయం చేసాడు.

అతడు వంగి వంగి దణ్ణం పెట్టేడు.

"కిన్నెరా కిరాణా షాప్‌లో మిగిలిన సామాన్లు పేక్ చేయించి ఉంచాను సర్. ఇతన్ని దిగబెట్టేసి అవి తీసుకోచ్చేస్తాను సర్.." డ్రైవర్ వినయంగా చెప్పాడు.

అధికారి అలాగేనని తలాడించేడు.

అంతసేపూ ఆ షాప్ ఇంచార్జ్ భయం భయంగా రెండు చేతులూ కలిపి ముందుకు పెట్టుకుని తడుస్తూనే వున్నాడు. అతడే కాదు- ఫుడ్ ఐటమ్స్ అమ్మే వారందరూ భయపడతారు. ఆ భయం వెనుక రహస్యం, డ్రైవర్‌కి తెలుసు. అప్పుడు నోరు విప్పాడు నెమ్మదిగా, ఆ ఇంచార్జ్.

" ఆ మిగిలిన సామాన్లు కూడా మా వోనర్ గారే ఏర్పాటు చేసేద్దారన్నారండి ...." ఇంకా ముగించకముందే-

"ఆ ఆ వద్దు వద్దు.. అంతా ఒకరి మీదే భారం పడకూడదు...మీ ఒక్కరే ఎందుకు ఇబ్బంది పడాలి. వున్నాయి కదా మిగతా షాపులు ..వాళ్లకు కొన్ని అప్పచెబుదాం.. మీ ఓనర్‌కి థాంక్స్ చెప్పండి. మీరు వెళ్లి రండి." కూల్ గా అన్నాడు అధికారి.

వీళ్ళు ఇలా కదిలేరో లేదో, ఆటోవచ్చింది. సుబ్బారావు, రంగసాయి దిగేరు. ఆటో డ్రైవర్ మాత్రం దిగలేదు. అరటిపిలకలు, కొబ్బరి కమ్మలు, మామిడికొమ్మలు, కొబ్బరిబొండాల గెలలు, రకరకాల పువ్వుల సంచులు, పురితాళ్ళు ఇంకా చాలా చాలా వస్తువుల్ని ఆటోలోంచి సుబ్బారావు, రంగసాయిలు దించేరు. తన గొడుగు అందుకుంటూ ఆటో అతనికి రంగసాయే డబ్బులు ఇచ్చేడు. ఆటో కదిలిపోయేక-

"ఆటోకి డబ్బులు ఇవ్వాలి గదా?" అన్నాడు అధికారి, జేబులోకి చెయ్యిపెడుతూ .

"ఇచ్చేసేను సర్" అన్నాడు రంగసాయి, ఫరవాలేదు అన్నట్టు.

"మీ చేతి కర్చులు తర్వాత చెప్పాలి."అన్నాడు అధికారి, ప్రేమగా.

"అలాగే సార్" అంటూ రోడ్డు వైపు చూసాడు రంగసాయి. వర్షం కొంచెం తెరిపిచ్చినట్టు కనిపించింది. సుబ్బారావుకి ఏదో అర్థమయ్యింది.వెంటనే-

"సార్ ! అన్ని వస్తువులూ ఇంచుమించు తేచ్చేసినట్లే.. ఏమైనా వుంటే ఫోన్ చేయండి..." చెప్తుండగానే అధికారి భార్య ఇంట్లోంచి వచ్చేసింది.

"...కాదూ, కొమ్మలూ, కమ్మలూ కట్టేసి ఎల్లి పోతే బాగున్ను.." అంది దీర్ఘంతీస్తూ.

'అవును కదా' అన్నట్టు చూసేడు, అధికారి.

రంగసాయి గుండెల్లో రాయిపడింది. నీళ్ళు నమిలేడు. సుబ్బారావే అందుకున్నాడు.

"రంగసాయి కొడుక్కి వొంట్లో కొంచెం బాగులేదమ్మ. మందులు కొనుక్కొని వెళ్ళాలి. వర్షం గానీ ఇలాగే తెరిపిస్తే రాత్రి తొమ్మిదీ పదప్పుడు వచ్చి ఇవన్నీకట్టేస్తాము..." అన్నాడు.

"మాకు నిద్ర దండుగ. తెల్లారి లేవొద్దూ.." అనుకొంటూ, లోపటికి వెళ్ళిపోయింది.

తన భార్య వైపు చూస్తూ వుండిపోయాడు, అధికారి. అతని కళ్లల్లో భయం లాంటిది గ్రహించేడు సుబ్బారావు. ఆ భయాన్ని తనకు అతికించుకొన్నాడు.

"సార్ వర్షం వచ్చినా, వరదొచ్చినా ఉదయం పంతులుగారొచ్చిన టయింకి వేం అంతా రెడీ చేసి ఉంచుతాం. మాది బాజ్జెత. మీ ఇంట్లో శుభకార్యమంటే మాది కాదా సార్..?" భక్తి తోఅన్నాడు, సుబ్బారావు. అధికారికొంచెం మెత్తబడి 'సరే' నన్నాడు.

వెంటనే గొడుగు తీశాడు, రంగసాయి. సుబ్బారావు సైకిల్ స్టాండ్ తీసాడు.

"సార్ రేపు పదిగంటలకి ఆనందసాయి షాప్ నుండి కొన్ని రకాల స్వీట్లు, కోణార్క్ షాప్ నుండి మరికొన్ని స్వీట్లు, నెంబరు వన్ అప్పడాల పేకట్లు వచ్చేస్తాయి. మీరేం వర్రీ కాకండి సార్.." అన్నాడు రంగసాయి మెట్లుదిగి గొడుగు విప్పుతూ.

ఇద్దరూ సైకిల్ ఎక్కేసారు. వెనక్కి కూర్చొన్న రంగసాయి ఇద్దరికీ సరిపోయినట్టు గొడుగు పట్టుకొన్నాడు. కొంతదూరం వెళ్ళేక ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు నోరువిప్పాడు రంగసాయి.

"సార్ డబ్బులిచ్చేస్తామన్నారు గానీ – కొబ్బరిగెలలకి, కొబ్బరికమ్మలు, మామిడికొమ్మలు తీసినోడికీ ఆటో చార్జీలకీ ఇలాంటి చిల్లర కర్చులకి డబ్బులేటి అడుగుతాము...ఈ వర్షానికి ఎవుడు దొరికాడా?ఏటి ?. గొప్ప కష్టమై పోయిందనుకో ఆళ్ళని ఎతుక్కోడానికి..వర్షంతోటి కొబ్బరిచెట్లు ఎవుడెక్కుతాడు!? అంతా డబల్ కర్చే..." మాటల్లో తన ఇబ్బందిని ప్రకటించేడు, రంగసాయి.

వెంటనే అందుకున్నాడు సుబ్బారావు.

"అచ్చీ! మనమడగ్గలమా !? సబార్డునేట్స్..చేతిలో డబ్బులెట్టి పనిచెప్పాలన్న, యింగితం అతగాని కుండాలి. అతనికేటి కర్చు చెప్మీ. ఈ మొత్తం సరుకులు షాపులోలు భయపడి ఇస్తున్నవే ...అందరినీ వాడీసుకున్నాడు. ఆవిడయితే మరీన్ను..."

ఇంతలో మెడికల్ షాప్ వచ్చింది. మందులు తీసుకున్న రంగాసాయిని ఇంటివద్ద దించీసి సుబ్బారావు తన ఇంటికి వెళ్ళిపోయాడు.

◆◆◆

ఉదయం ఏడు గంటలయ్యింది. ఎప్పుడోచ్చారో గానీ అలంకరణలు తోరణాలు కట్టడాలు పూర్తి చేసీసేరు. అయినప్పటికీ ఏదోపనిలో నిమగ్నం అయినట్టే కనిపిస్తున్నారు. ముఖ్యంగా అధికారి భార్య చూస్తున్నప్పుడల్లా. ఆమె స్నేహితురాళ్ళు ఇద్దరు వంటగదిలో సహకరించడానికి వచ్చున్నారు. పెరట్లోపనులు చేయడానికి అతని చుట్టాలు ఇద్దరు వచ్చున్నారు. వ్రతం చేస్తున్న వారు పట్టుబట్టల్లో మెరిసిపోతున్నారు. పదిసార్లు అరిస్తే– కొడుక్కూడా పట్టుబట్టలు ధరించేడు.

"అంతా వోకే... ఇంకా పంతులుగారే రావాల్సి వుంది." అన్నాడు భార్యతో అధికారి.

"అంతా సిద్ధమే, మీదే ఆలస్యమని మీరు ఫోన్ చేయొచ్చు కదా?" సలహాలాంటి ఆజ్ఞ జారీచేసింది.

"పంతులు గారి ఆలస్యాన్ని ఎత్తి చూపకూడదు మనం..." అంటూ ఫోన్ అందుకున్నాడు.

ఇంతలోనే ఫోన్ మోగింది. పంతులుగారి నుండే అది. ఖంగుమంది గొంతు.

"మినిష్టరు గారు ఏదో ముహుర్తం కోసం అతని పీ. ఏ ను పంపేరు. ఓ గంట పడుతుంది. అందాక నా శిష్యున్ని పంపుతున్నాను.. నేను వచ్చేలోగా పూజకు పీఠం సిద్ధం చేస్తాడు...వర్షం వస్తోంది పోతోంది.. సరిగ్గా ఎనిమిది గంటలకు మీకారు పంపించండి .." అని సమాధానం కోసం చూడలేదు. ఫోన్ కట్ అయ్యింది..

'ఆ పనిమీద వుండు' డ్రైవర్‌కి పురమాయించాడు అధికారి.

వంటగదిలోంచి భారీ శరీరంతో వొకామే టీ గ్లాసులు పళ్ళెంలో పెట్టుకొని వచ్చింది.

"వదినా ప్రసాదాలు అన్నీ సిద్ధం. పంతులుగారు రావడానికి టైం పట్టేట్టుంది. టీలు తాగొచ్చు మరేం ఫర్వాలేదు.." అని చేరోగ్లాసు అందించింది. తానో గ్లాసు అందుకొని, పళ్ళెం గోడమీదపెట్టి డ్రైవర్ వైపు చూసింది.

డ్రైవర్ గబగబా వచ్చేడు. తానో గ్లాసు తీసుకొని మిగిలిన రెండు సుబ్బారావు, రంగసాయిలకు అందించాడు. చలితో ఉన్నవాళ్ళకి ఆ వేడి టీ ఎంతో ఊరటనిచ్చింది. డిస్పోజల్ గ్లాసుల్ని అందరిదగ్గర నుండి వొద్దికగా అందుకొని డస్ట్‌బిన్‌లో వేస్తున్నాడు సుబ్బారావు.

ఇంతలో రంగసాయి ఫోన్ మోగింది.

"సార్ కేటరింగ్ వాళ్ళు పదకొండు గంటలకు వచ్చేస్తామని చెప్పమన్నారు.." తనకొచ్చిన ఫోన్ సారాంశాన్ని అధికారికి చెప్పేడు రంగసాయి.

"అవి ఎలాగూ వస్తాయిగానీ ముందు డ్రైవర్‌ని పంపించండి పంతులుగారి దగ్గరికి. ఈ వర్షం వొకటీ ఆగాగి వస్తోంది." అధికారి భార్య కల్పించుకొని, తక్షణం ఏమి చేయాలో ఆదేశించింది.

డ్రైవర్ బయలుదేరాడు.

◆◆◆

కారు దిగుతున్న పంతులుగారి దగ్గరకు, గుమ్మం దిగి పరుగెత్తుకొచ్చారు యజమాని, అతని భార్య, అతని కొడుకు.

అక్కడున్న మూడు చెంబులతో భక్తిగా పంతులు గారి కాళ్ళు కడిగి కళ్ళకద్దుకున్నారు. అకస్మాత్తుగా వర్షం కూడా ఆగిపోయింది. పంతులుగారు ఆకాశం వైపు చూసి, అధికారి వైపు చూసాడు. అర్థం చేసుకున్న అధికారి 'అంతా మీ చలవ..' అంటూ రెండు చేతుల్తో మళ్లీ నమస్కరించేడు. పూజ గదిలోకి అడుగుపెట్టాడు పంతులు. పీఠం దగ్గరున్న శిష్యుడు రెండడుగులు పక్కకు తప్పుకొన్నాడు, వినయంగా. అంతా గమనించిన పంతులుగారు తృప్తిగా తలాడించేరు. వొక మంత్ర శ్లోకం చదివి పీఠంమీద ఆసీను డయ్యాడు. ఎవరి పక్కన ఎవరు కూర్చోవాలో నిర్ణయించి ముగ్గుర్నీ ఆదేశించారు. వొక్క క్షణం కళ్ళుమూసుకొన్నాడు. అంతలో, వొక్కసారిగాకళ్ళు తెరిచి ప్రవేశ ద్వారంవైపు చిరాగ్గా చూసేడు. అది గమనించిన అధికారి అంతే చిరాగ్గా వంటగదివద్ద నించొని వున్న తన చుట్టాల్లో వొకామెవైపు చూసాడు. ఆమెకు అర్థమయ్యింది. పరుగెత్తుకెల్లి, డ్రైవర్‌ని, మరో ఇద్దర్నీ మాటలాడవద్దని హెచ్చరించి వచ్చింది.

పంతులుగారు పూజలో లీనమైపోయారు. మంత్రాలు ప్రవాహంలా సాగిపోతున్నాయ్. యజమాని కుటుంబం, పంతులుగారు చెప్పినట్టు చేస్తున్నారు. సుమారు రెండు గంటలపాటు ఎటువంటి ఆటంకం కలగలేదు. వ్రతం పూర్తి అయిపోవచ్చింది. మరో మంత్ర శ్లోకంతో వ్రతం ముగించేడు పంతులు. హారతి వెలిగించి, కుటుంబసభ్యులకు మాత్రమే ఇచ్చి కింద పెట్టేసాడు. గంభీరంగా మొఖం పెట్టి తన రెండుకాళ్ళు కొంచెం ముందుకు జరిపాడు. కుటుంబసభ్యులు వొకరి తర్వాత వొకరు, అతని పాదాలను తాకి దండం పెట్టుకున్నారు. వాళ్ళతలల మీద మంత్ర పుష్పాక్షతలు చల్లి–

"అంతా సవ్యంగా జరిగిపోయింది. మీ అదృష్టం బాగుంది. వర్షం కూడా పూర్తిగా ఆగిపోయింది. ఇంకా మీకు అడ్డు లేదు. మీరు భోజననాలకి పిల్చుకున్న బంధువులు దర్జాగా రాగలరు... ఇంతకీ ఎంతమందిని పిల్చుకున్నారు?'' అడిగేరు పంతులుగారు.

"ఏదోనండి... నియర్ అండ్ డియర్ ఓ వందమందికి..."

"ఈ వ్రతమే చెప్తోంది. ఇక అంతా శుభమే... మీ అబ్బాయికి త్వరలో వుద్యోగం వచ్చేస్తాది. ఈసారి ఇంకా బ్రహ్మాండంగా పూజ చేద్దాం."

పంతులుగారి ఈ మాటలకి భార్యా భర్తలిద్దరూ తెలియని అనుభూతికి లోనయ్యేరు.

"మీ వాక్కు బ్రహ్మ వాక్కుకావాలి..."

"...నా వాక్కుకి తిరుగులేదు..."

" గురువుగారూ! పీఠంపై వున్నంతసేపూ మీ ముఖంలో ఒక రకమైన వెలుగు..." అన్నాడు అధికారి,సంభ్రమంగా.

"మీరు గమనించారు కాబట్టి ఓ రహస్యం చెప్తాను... పీఠం మీద కూర్చొని పూజ చేసింది, నేను కాదు.. సాక్షాత్తూ ఆ బ్రహ్మదేవుడు..." అని ఆకాశం వైపుగా రెండుచేతులూ జోడించాడు.

"...పీఠం దిగిపోతే నేను మామూలు పురోహితుణ్ణి మాత్రమే" అని శిష్యుడి వైపు చూసాడు.

అవున్నిజమే అన్నట్టు శిష్యుడు తన రెండుచేతులూ గురువుగారి పాదాలవైపు చాచి కళ్ళకద్దుకున్నాడు.

పంతులుగారు ఏదో గుర్తుకొచ్చిన వాడిలా ముఖం పెట్టి –

" నాకు టయిమవ్వుతోంది. ఇక తాంబూలాలు..దానాది కార్యక్రమాలు?." అంటూ చేతి వాచీ చూసుకున్నాడు.

అధికారి డ్రైవర్ వైపు చూసేడు.అతడు కారు టర్న్ చేయడానికి వెళ్ళాడు. రంగసాయి, సుబ్బారావుల వైపు చూసేడు. పంతులుకివ్వాల్సిన సర్వ సంబారాలు ఉదయమే పేక్ చేయించబడ్డాయి. అవన్నీకారు డిక్కీలో పెట్టడానికి కదిలేరు. శిష్యుడు పూజా స్థలంలో నున్న ధనరూపాలు, ఇంకా చాలావరకు దినుసుల్నీ, కొన్ని సంచుల్లో సర్దేసాడు. చిన్నచిన్న వెండి బంగారాలతో చేయించిన నమూనా విగ్రహాల మీద, దానం రూపంలో కేటాయించిన అనేక ఇతర వస్తువుల మీద – స్వీకరించినట్టుగా పంతులుగారు చేతులూ ఆనించి తీయగానే–వాటినీ సర్దేసాడు శిష్యుడు. ఇవన్నీ సుబ్బారావు రంగసాయిల సహాయంతో డిక్కీలో పెట్టించాడు క్షణాల్లో.

అరతులం బంగారం ఉంగరం వున్న చిన్న డబ్బీని కొడుకుచేత ఇప్పించేడు, అధికారి.

"శీఘ్రమేవ వుద్యోగం ప్రాప్తిరస్తు..." అని దీవించి వుంగరం అందుకున్నాడు.

పట్టుబట్టలూ, పదివేల రూపాయలు దక్షిణా కలిగిన వెండిపళ్ళాన్ని భార్యాసమేతంగా అందించేడు అధికారి. ఆయురారోగ్యాలూ సకల అష్టైశ్వర్యాలూ ప్రాప్తించమని ప్రసన్నవదనంతో దీవించారు, పంతులుగారు.

## కవిత

# రెక్కలు

**పి.విజయలక్ష్మి పండిట్**

*“అమ్మా.. పైన  సూడు” అడిగింది*
*రోడ్డుపై నడుస్తూ పైకిలేచిన*
*ఏడేండ్ల మగచేయి,*
*“అది పక్షులవలస గుంపు”అంది*
*నడుస్తూ బక్కచిక్కిన పదహారేండ్ల అమ్మ*
*చంకలోబిడ్డ నెత్తిమీద మూటతో..,*

*“ఎక్కడికి పోతా వుండాయవి”*
*ఏడేండ్ల కండ్లలో ఆశ్చర్యం..,*
*“కూటికోసం గూడుకోసం”,*
*అమ్మ తడికండ్ల జవాబు..,*
*“మన కూలిజనం మాదిరా”,*
*ఏడేండ్ల కొడుకు సందేహం,*
*“అయి మన మాదిరి కూలిసేయవు”*
*అమ్మ అవగాహన పలికింది..,*
*‘అయితే వాటికి తిండికి డబ్బులెట్లా”,*
*కొడుకు ధర్మసందేహం,*
*“అవి సేచ్ఛగా గింజలు ఏరుకోని తింటాయి*
*మనమాదిరి వాటివి బానిస బతుకులు కావు”*
*తల్లి అనుభవం జవాబిచ్చింది,*
*“సేచ్ఛ అంటే ఏంది ?”*
*కొడుకు లోతు ప్రశ్న,*
*“పచ్చులవి సేచ్ఛగా ఎగిరిపోయే రెక్కలు ..,*
*మనవేమో కూలిగుంజకు కట్టేసిన రెక్కలు,*
*ఎట్ల ఎగురుతాయి?”*
*అమ్మ నిరాశ నిస్పృహ గొంతు..!*
*అమ్మ అయోమయం జవాబుప్రశ్న తో*
*మాటపెగలని మట్టిబారిన కొడుకు*
*చూపు మనసు పక్షులకేసి*
*పరుగుతీశాయి స్వేచ్ఛ గా..!!* ♦

---

“...ఎంతో బరువు దిగిపోయిన్దండీ...” అన్నాడు అధికారి.

“పూజ బాగా జరిగింది. మరి నాకు శలవ్.. వెళ్లొస్తాను...” అని కారువద్దకు కదిలేరు పంతులుగారు.

తనభార్యతో అనుసరించేడు అధికారి. స్వయంగా కారు డోరు తీశాడు. కొడుకు గుమ్మం మీదే ఉండిపోయాడు. అధికారితో పాటు కిందకి దిగేరు సుబ్బారావు, రంగసాయి లు .

డ్రైవర్ కారు కదిలించేడు. మరోసారి నమస్కారాలు అయ్యేయి.

“...అంతా అనుకున్నట్టే అయింది కదండీ..!? అంటోంది భార్య, సంతోషంతో.

అవునన్నట్టుగా నిట్టూర్పు విడిచాడు, అధికారి.

“...పంతులు బాగా చేసేడు...” అని అధికారి తరపున వచ్చిన ఇద్దరూ పెరట్లో అనుకొంటున్నారు.

“..పిండికొద్దీ రొట్టె..” అధికారి భార్య  తరుపువారు వంటగదిలో అనుకున్నారు.

“..భోజనాలకి ఏమయినా సాయం చేయాలా సార్?” అని అడిగేరు, సుబ్బారావు, రంగాసాయిలు, వినయంగా.

“.. ఎందుకు?  మా చుట్టాలున్నారుకదా. ఆ పైన కేటరింగ్ వాళ్ళుంటారు. ఫరవాలేదు. ఇప్పటికే లేటయ్యింది. మీరు వెళ్ళండి..” అన్నాడు అధికారి.

సుబ్బారావు, రంగాసాయిలు నమస్కారాలు చెప్పి, సైకిళ్ళు ఎక్కేసారు.

వాన పూర్తిగా వెలిసిపోయింది.


♦ ♦ ♦

“బాగుందిరా కథ. దృశ్యం కళ్ళకు కట్టించేవు. కథ గురించి మంచిచెడ్డలు నేను చెప్పలేను. గౌర్నాయుడు అంకుల్‌కి పంపించి అభిప్రాయం అడుగు. అసలు నీకెందుకు ఈ కథ రాయాలనిపించింది...” అడిగేడు తండ్రి.

“అంకుల్ వోసారి మనింటికి వచ్చినప్పుడు ‘అలివోడ్ని బలిమోడు తింటే – బలిమోడ్ని బ్రమ్మదేవుడు తింటాడట’ అని ఎందుకోగానీ ఒక సామెత పొడిచేరు. అది కథ చేసేను. అంకుల్‌కి నిన్ననే మెయిల్ పెట్టేను...చదివి అభిప్రాయం చెప్తామన్నారు..”  అని చెప్తుండగానే గౌర్నాయుడు నుంచి ఫోన్ వచ్చింది.

స్పీకర్ ఆన్ చేశాడు రోహిత్.

“రోహిత్!  నా సామెతకు కథారూపం ఇచ్చి కొత్తగా అర్థం చెప్పినట్టున్నావ్.. బాగుంది. మరిన్ని కథలు రాయాలని ఆశిస్తున్నాను...” ♦




# ప్రశ్నిస్తున్న మూడోగొంతు

**జోశ్యుల దీక్ష**
89855 70753

*వారి మీద జాలి పడితేనో, వారిని అసహ్యించుకోవడం మానుకోవటం వల్లనో వారికి ఒరిగేది ఏమీలేదు. ఒక అడుగు ముందుకు వేసి మన పరిధిలో మనం చేయగలిగినంత చెయ్యడానికి ప్రయత్నించాలని ఈ కథల ద్వారా సమాజానికి చెప్పింది "అస్మిత". ఈ కథలన్నీ తాము మనుషులమని దానిని గుర్తించమని వారు అనుక్షణం చేస్తున్న యుద్ధాన్ని మన కళ్ళకు కట్టినట్టు చెప్పాయి.*

పుట్టట మనేది మన చేతుల్లో లేనిది. కులం, వర్గం, ప్రాంతం, జెండర్ ఇవేవీ మనం కోరుకొన్నట్టుగా జరగవు. అయితే స్త్రీలుగా, దళితులుగా, మైనారిటీలుగా, వెనుకబడిన వారిగా ఆయావర్గాల వారు అనుభవించే కష్టాలు, నష్టాలు, ఆరళ్ళు, ఆవేదనలు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో వెలువడ్డాయి. ముఖ్యంగా 80, 90 దశకాల్లో స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద సాహిత్యం కవిత్వం, కథ, నవల, పాట, వంటి విభిన్న ప్రక్రియల్లో వెలువడింది.

కాని ఈ మధ్యనే థర్డ్‌జండర్ లేదా ట్రాన్స్‌జండర్స్‌గా పిలవబడే హిజ్రాల భౌతిక మానసిక ఇబ్బందుల్నీ, వేదనల్నీ కూడ కవిత్వీకరించడం చూస్తున్నాం. అనుకోకుండా ఇటీవలే నేను ఈ సమస్యకి సంబంధించిన రెండు పుస్తకాల్ని వెంట వెంటనే చదవటం జరిగింది. అవి 1) తోట సుభాషిణి, కంచర్ల శ్రీనివాస్‌లు రాసిన "The Third Voice" (తృతీయస్వరం) అనే కవితా సంపుటి, 2) అస్మిత, కోవూరి చారిటబుల్ ట్రస్ట్, ఐద్వా సంయుక్తంగా వెలువరించిన 'అస్మిత' అనే కథాసంపుటి.

ఈ రెండూ చదివాక ఒక స్త్రీగా నాకున్న సమస్యల కంటే చిన్నప్పటి నుండీ ఈ ట్రాన్స్‌జండర్స్ ఎదుర్కొనే సమస్యలే ఎక్కువనిపించింది. నా సమస్యని నేను ఎవరితోటైనా చెప్పుకోగలను. కాని ఆ అభాగ్యులు కన్న తల్లిదండ్రులతో కూడా చెప్పుకోలేరు. చెప్పుకొన్నా ఆ తల్లిదండ్రులు అర్థం చేసుకోరు. ఈ సమాజం, మిత్రులు, బంధువులు ఎవ్వరూ కూడా అర్థంచేసుకోకపోగా కొజ్జా, పాయింట్‌ఫైవ్ అంటూ అవహేళన చేస్తారు.

అందుకే వారిని అవహేళన చెయ్యకండి. కనీస మానవత్వంతో వారిని అర్థం చేసుకోండి అంటూ కవులూ, కథకులు సహానుభూతితో తమ స్వరాల్ని వినిపించారు. వారి బాధల్ని పరకాయ ప్రవేశం చేసి తమ బాధలుగా వెళ్ళబుచ్చారు.

2016లో వెలువడిన "తృతీయ స్వరం" కవితాసంపుటిలో తోట సుభాషిణి-16, కంచెర్ల శ్రీనివాస్-16, మొత్తం 30 కవితలు ఇరువురూ కలిపి రాసారు. మగ శరీరంలో ఇడుమలేక, ఆడతనాన్ని పొందలేక ఆ ట్రాన్స్‌జండర్స్ పడే హృదయ వేదనల్ని

*"ఆడగా పుట్టలేదు తల్లిగా మారడానికి*
*మగగా మిగలలేము తండ్రులమై తరించడానికి*
*ఎటూకాని వాళ్ళమైపోయాము"*

అంటూ అనేక కోణాల్లో ఈ కవులిరువురూ వ్యక్తీకరించటం జరిగింది.

ఇక ఇటీవలే జూన్ 25న వివిధ కోణాల్లో ట్రాన్స్‌జెండర్ల

సమస్యల్ని విశ్లేషిస్తూ 'అస్మిత' అనే కథా సంపుటిని దేశవ్యాప్తంగా, ముంబై, చెన్నై, హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, వంటి పట్టణాల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఒకే రోజు ఆవిష్కరించటం జరిగింది. అస్మిత, కోవూరి చారిటబుల్ ట్రస్ట్, ఐద్వాలు సంయుక్తంగా ఈ ట్రాన్స్ జండర్లపై కథలపోటీని నిర్వహించాయి. వాటిలో నుండి 19 కథలను ఎంపికచేసి 'అస్మిత' పేరుతో ఆవిష్కరించారు.

యధాలాపంగా మొదలుపెట్టిన ఈ పుస్తకం నన్నింక కదలనివ్వలేదు. ఎన్ని వేదనలు, ఎన్ని బాధలు, ఒక్కొక్క కథా ఒక్కొక్క వ్యధ. ఒక్కొక్క కోణం. అయితే సమస్య మూలం ఒక్కటే.

ట్రాన్స్‌జండర్ల ప్రధాన సమస్య వారిదేహం, వారి మనస్సు, ఒకదానితో మరొకటి మమేకం కాకపోవటమే. ఇంకా వారి సమస్య వారితల్లిదండ్రులు, బంధువులు, చుట్టుప్రక్కలవాళ్ళు, మిగతా సమాజం. వారు దేహం, మనసు నుండి సమాజం వరకు పోరాడుతూనే ఉండాలి. అది గెలుపులేని పోరాటం. ఎక్కువ సార్లు ఓటమి మాత్రమే దక్కేపోరాటం.

ఒక దేశంకాని, ఒకతెగకాని, ఒక జాతికాని, అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం అతిముఖ్యమైనవి. హిజ్రాలకి విద్య అందటం చాలాతక్కువ సందర్భాల్లోనే జరుగుతుంది. వారి సమస్యలకు పరిష్కారం వాళ్ళే ఆలోచించుకొని సమాజంలో పోరాడే శక్తి వారికి రావాలంటే విద్య అవసరం. అదే వారికి దక్కటం లేదు.

ఈ కథలలో ఇంచుమించుగా అన్ని కథలలోను ఏదొక సందర్భంలో హిజ్రాలు భిక్షాటన చెయ్యటం కనిపిస్తుంది, ఏవో ఒకటి రెండు కథలలో తప్ప.

ఇందులో మొదటి కథ "కసారా నుండి రైలు". ఇందులో మొదటి సన్నివేశంలో పెళ్లి జరిగిన ఇంటికి కొంత మంది హిజ్రాలు వచ్చి వధూవరులని ఆశీర్వదిస్తాం డబ్బు యివ్వమని అడుగుతారు. ఒక సమూహంగా వచ్చి ఎంతో కొంత కాదు వారు అడిగింది ఇవ్వమని బెట్టు చేస్తారు. అక్కడ వున్న వారందరూ ఎందుకివ్వాలి? మేము బాకీ కాదు మీకు, అడిగింది యివ్వడం కుదరదు. పోలీసులకు ఫోన్ చేయండి. న్యూసెన్స్ చేస్తున్నారు అని అందరు తలొక మాట అంటారు. ఈ మాటలు చదువుతున్నప్పుడు నాకు కొత్తగా ఏమి అనిపించలేదు. ఎందుకంటే మనం అందరం వారి పట్ల స్పందించేది ఈ విధంగానే కదా! శ్రీహరి అనే వ్యక్తి మాత్రం వారడిగినంత ఇచ్చి పైన ఇంకా ఇస్తాడు. అది అక్కడి కథలోని పాత్రలతోపాటు, నన్ను కూడ కొంచెం నిరాశకు గురిచేసింది. ఏంటి ఇంత డబ్బు వీళ్ళకి ఇచ్చేసాడు? అనుకున్నాను. జాలి పడాలంటే కూటికి గతి లేనివారు, చెత్త బుట్టల్లోని ఆహారాన్ని ఏరుకుతినేవారు వున్నారు ఈ దేశంలో. అలాంటి వారికి యివ్వాలి కాని దృఢంగా కాయ కష్టం చేసుకునే సమర్ధులైన వీళ్ళకి యిచ్చాడేంటి. ఈ కథ నన్ను సమాధాన పరచలేదు అని ఆ సందర్భంలో అనిపించింది. కానీ, కథ పూర్తయ్యాక శ్రీహరి వేసినంత స్ఫూర్తిదాయకమైన ముందడుగు నేను వేయగలనా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

ఈ కథలో హిజ్రాలపై సమాజంలో ప్రతి ఒక్కరికీ వుండే ఏహ్య భావన గురించిన, కారణాలు, అపోహలు సమాజ సంకుచిత మనస్తత్వం అన్నీ పదునైన మాటల్లో చెప్పారు. పాఠకుల్ని ఆలోచింప జేసారు, ప్రశ్నించారు. కథలో శ్రీహరి కసారా నుండి ముంబై వెళ్ళే ప్రయాణానికి రైల్లో వెళతాడు. దారిలో రైల్లో అతని ప్రక్కన ఒక వ్యక్తి వచ్చి కూర్చుంటుంది. చూసీ చూడగానే కూర్చున్న చోటు నుండి లేవబోతాడు. అప్పుడు, "జస్ట్ సిట్ డౌన్ ఎందుకు సార్, లేచిపోతున్నావ్? ఈ రోజుల్లో అంటరానివాళ్ళెవరూ లేరు. నాకేమి అంటురోగాలూ లేవు. మిమ్మల్ని అడుక్కోవటానికీ రాలేదు" అంటుంది.

ఈ మాటలు చదవగానే పాఠకునికి శ్రీహరి స్థానంలో వున్న వ్యక్తి తప్పుగా ప్రవర్తించాడు అని అనిపిస్తుంది. శ్రీహరిలో మనల్ని మనం చూసుకుంటాం. ఆమె ఒక హిజ్రా. బాగా చదువుకున్న ఆమె. ఆ సందర్భంలో వారిరువురికి జరిగే సంభాషణ కూడా పాఠకుని మనసులోని సందేహాలను చాలా వరకు పోగొడుతుంది. కటువుగా మాట్లాడిన ఆమె, అందుకుగాను శ్రీహరికి సారీ చెబుతుంది, అవమాన భారం మోయలేక ఇలా మాట్లాడా అంటుంది.

ఆ వెంటనే శ్రీహరి చేత రచయిత కొన్ని ప్రశ్నలు సంధింపజేస్తాడు అవి మామూలుగా మనకి హిజ్రాలపట్ల వుండేవే.

"అవమానకరంగా చూస్తున్నామంటున్నారు, మీ

ప్రవర్తన ఎలా ఉంటోంది? బలవంతంగా మీద పడి అడుక్కోవడం, జబర్దస్తీగా అడుక్కున్న డబ్బుతో జీవించడం, పడుపు వృత్తి చేయటం... ఇదంతా అవమానకరంగా అనిపించదా? ఇవన్నీ మీకు గౌరవాన్నిస్తాయను కుంటున్నారా?"

ఈ మాటలు, ఆలోచనలు, అపోహలు మన అందరి లోపల ఉంటాయి హిజ్రాల పట్ల. దీనికి ఆ హిజ్రా చెప్పే సమాధానంతో ఆ తర్వాతి వారి సంభాషణ చదవగానే మనం వారి పట్ల ఎంత తప్పుగా, కాదు ఘోరంగా ప్రవర్తిస్తున్నామో అర్థం అవుతుంది. ఈమె పేరు ప్రీతిక. చదువుకున్న హిజ్రా. కాని ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఎవరూ యివ్వలేదు. వారి బ్రతుకు వారు బ్రతకటానికి, వారి పొట్ట నింపుకోవడానికి కనీసం ఒక దారి చూపలేదు ఈ సమాజం. కన్నవారు, తోడబుట్టినవారు ఇంట్లోంచి తరిమేశారు.

శ్రీహరికి ఆమె కథ అంతా విన్నాక విభ్రాంతి, విషాదం ఎవరిమీదో తెలియని కోపం కలిగాయి. ప్రీతిక ముఖంలో విజ్ఞానం తెచ్చిన తేజస్సు, అందం అతనికి పూర్వపు జుగుప్స భావన తొలగిపోయేలా చేసింది. ప్రీతిక మీదే కాదు హిజ్రాల మీద కూడ. శ్రీహరి అక్కడితో ఆగిపోకుండా ఒక గార్మెంట్ ఇండస్ట్రీ పెట్టి తన ఇండస్ట్రీలో ట్రాన్స్‌జెండర్స్‌కి ఉపాధి కల్పిస్తాడు. ప్రీతికని అడ్మినిస్ట్రేషన్ చూసుకోమని చెప్తాడు. ఈ కథలో నాకు నచ్చింది శ్రీహరి కేవలం తన ఏహ్య భావనని పోగొట్టుకొని మిగిలిపోకుండా వారికి తన వంతు బాధ్యతగా సహకారాన్ని అందించడం. శ్రీహరి గెలిచి తనని నమ్మినవారిని గెలిపించాడు. ఈ కథ చదివిన ప్రతి ఒక్కరికీ హిజ్రాల పట్ల ఎలా ప్రవర్తించాలో ఒక మానవీయమైన ఆలోచన వారికి ఏదైన సహకారం అందించాలనే స్పృహ తప్పక కలుగుతాయి.

ఈ 'అస్మిత' కథా సంకలనంలో ఉన్న ప్రతీ కథలో హిజ్రాలు పడే మానసిక వేదన మనకి అర్థం అవుతుంది. అందరిలా ఒక అబ్బాయిగానో, అమ్మాయిగానో అప్పటిదాకా వున్న వాళ్ళు ఒక్కసారిగా వారు, వారు కాదు అని తెలుసుకున్న క్షణం, వారి హృదయం ఎంత వేగంగా కొట్టుకుని క్రిందికి జారిపోయి వుంటుందో కదా! ఎవరితో పంచుకుంటే ధైర్యంగా వుంటుందో తెలీదు. తల్లి దండ్రి కూడా చావగొట్టి బయటికి గెంటేస్తారని నూటికి 99 మంది, వారి సంఘర్షణని, నరకాన్ని దాచుకోవడానికే ప్రయత్నిస్తారు. వారి వల్ల మిగతా సంతానానికి పెళ్ళిళ్ళుకావని ఇంట్లోంచి గెంటేసిన వారి కథలు, పరువుపోతుందని వదిలించుకున్న కథలు అనేకం. అటువంటివన్ని ఈ కథానిక సంకలనంలో మనకు తారసపడ్డాయి. అంతేకాదు హిజ్రాలకు సంబంధించి సమాజంలో రావాల్సిన మార్పులు, వారి సమస్యల పరిష్కారానికి కొన్ని నూతన సూచనలు, ఆలోచనలు కూడా చెప్పడం జరిగింది.

హిజ్రాగా పుట్టాలని ఎవరూ కోరుకోరు. వారు కానీ, వారి తల్లితండ్రులు కాని ఏ తప్పు చేయలేదు. కానీ, కొన్ని హార్మోన్ల అసమతుల్యత వలన వారిలో ఈ విధంగా మార్పు చోటు చేసుకుంటుంది. పేదవారిని, అంగవైకల్యం వున్నవారిని, ఈ సమాజం ఏదోక సమయంలో అర్థం చేసుకుని, అక్కున చేర్చుకుంది. ఎందుకంటే అలా పుట్టడం వారి తప్పు కాదు, వారి చేతుల్లో లేదని గ్రహించింది.

ఇంకా చెప్పాలంటే హత్యలు, అత్యాచారాలు చేసిన ఖైదీలను, శిక్షపూర్తి అయిన తర్వాత కూడా సమాజం చేరదీస్తుంది. అంత ఎందుకు నిర్భయ కేసులో మైనర్ విడుదలయ్యి ఈ సమాజం లోనే కదా తిరిగి కలిసాడు. మైనర్, మేజర్ సహకారం లేకుండా నేరం చెయ్యరని రాజ్యాంగంలో ఉంది కాబట్టి.

కాబట్టి మానవత్వపు దృక్పథంతో ప్రభుత్వాలు, (సమాజం) వారిని గుర్తించి అవకాశాలు (విద్య, ఉపాధి) కల్పించాయి. అలాంటి కోవకి చెందినవారే ఈ హిజ్రాలు కూడా అని నేటి సమాజం ఇప్పటికైనా గుర్తించాలి. యువతరం ఆలోచనలైనా మారాలి. హిజ్రాలకి కూడా విద్య, ఉపాధి, ఉద్యోగం అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం అండగా నిలబడాలి. సమాజం చేయూత నివ్వాలి. వారు కూడా సాటి మనుషులే. వారికి ఆకలి, దప్పులు వుంటాయి. కన్నవారు, తోడబుట్టినవారు, బంధువులు, స్నేహితులు ఇంకా యీ సమాజం అందరూ వెలి వేస్తే వారెల బ్రతుకుతారు?

వాస్తవ సంఘటనను ఈ కథలోని పాత్రతో ప్రస్తావించి అక్కడి వారికి మనకి కూడ హిజ్రాల మానవత్వపు కోణాన్ని పరిచయం చేసారు.

"రంగుటద్దం" కథలో హిజ్రా అమ్మాయిగా మారి తన

బయోపిక్‌లో తానే నటించి తనబోటి వాళ్ళ కష్టాలను అందరికీ తెలియజేస్తుంది. అందరినీ చైతన్యపరిస్తేనే ఈ సమస్యకి పరిష్కారం అంటుంది.

అంతేకాదు ఇందులో కొన్ని భిన్నమైన కథలు కూడ వున్నాయి. "ప్రేమ బృందావనం" కథలో చిన్న నాటి స్నేహితుడు, రూంమేట్ హిజ్రా అని తెలిసినా ముందు కొంచెం ఆలోచించినా తర్వాత అర్థం చేసుకొని, ఆదరించి, అండగా నిలుస్తాడు. ఆ హిజ్రా ఒక ఫౌండేషన్ అధినేత అయ్యి "పద్మశ్రీ" అందుకుంటుంది.

"మీతో మేము" కథలో హిజ్రా మొట్టమొదటి ఎయిర్‌హోస్టస్ గా విజయం సాధిస్తుంది. దానికి ఆమె చేసిన పోరాటం తెలుసుకోవాల్సిందే.

"కొత్త చిగుర్లు" కథ యువతకి మంచి సమాజం నిర్మించే దిశగా వారి బాధ్యతని గుర్తుచేసింది. ఆ కథ ద్వారా యువత సామాజికంగా అందరికి హిజ్రాల గురించి, వారి సమస్యల, సంఘర్షణ గురించి అవగాహన కల్పించి వారి సమస్యల పరిష్కారానికి మార్గాలు సూచించారు.

ఇంక రెండవ కథలో "తోటమాలి చమత్కారం" పేరున్న చిన్న వైద్యుడు హిజ్రాకి తన ఆసుపత్రిలో తోటమాలి ఉద్యోగం యిచ్చి హిజ్రాల సమూహం నుండి అతనిని కాపాడుతాడు. ఒకసారి ఆ హిజ్రా సమూహం అతనిపై అత్యాచారం చేస్తారు. అతనికి వైద్యం చేసి ధైర్యం చెప్పి ఆ హిజ్రాల సమూహాన్ని కలిసి అందులో మార్పుని కోరుకునే వారికి కూడా కొత్త ఉపాధి అవకాశాలు చూపించి గౌరవంగా బ్రతికే అవకాశం కల్పించడంతో కథ ముగుస్తుంది. వారి మీద జాలి పడితేనో, వారిని అసహ్యించుకోవడం మానుకోవటం వల్లనో వారికి ఒరిగేది ఏమీలేదు. ఒక అడుగు ముందుకు వేసి మన పరిధిలో మనం చేయగలిగినంత చెయ్యడానికి ప్రయత్నించాలని ఈ కథల ద్వారా సమాజానికి చెప్పింది "అస్మిత".

మూడవ కథ "మానవత్వం" ఒక యదార్ధ సంఘటన ఆధారంగా చేసుకుని చెప్పిన కథ. హిజ్రాలలో మానవత్వపు గుణాలు ఎలా వున్నాయో అందరికీ తెలియజేసిన కథ. తమకేమీకాని, తమని అసహ్యించుకునే సమాజం కోసం, అక్కడ జరిగే హింసాకాండ ఆపడం కోసం వారు నగ్నంగా నిలబడతామని బెదిరించి అక్కడి చిన్న, పెద్ద ప్రాణాల్ని కాపాడతారు. 2014 అక్టోబర్ 28వ తేదీన ఈస్ట్ ఢిల్లీలోని త్రిలోక్‌పూరి)లో జరిగిన సంఘటనను యదార్థంగా చూపించింది. యువత మనస్ఫూర్తిగా కోరుకుంటే ఏదైనా చేయగలదు అని తేల్చి చెప్పిన కథ. సమాజం పట్ల యువతరానికీ బాధ్యత వుందని చెప్పిన కథ.

"ఏది పాపం ఏది పుణ్యం" కథలో నాన్నమ్మే మనవుడు హిజ్రా అని తెలిసి వదిలించు కుంటుంది. కొడుకుకి పుట్టిన ఒకే ఒక్క సంతానాన్ని బయటకి నెట్టేస్తుంది. తర్వాత కాలచక్రం మహిమతో అతని పంచనే బ్రతుకుతుంది.

"వైఖరిలో మార్పు" కథలో ఒక ఉన్నత పదవిలో వున్న హిజ్రా దేశానికి ఏ విధంగా సేవ చేయగలదో సాటి హిజ్రా సమస్యలపై పరిష్కారాలు వెతికి పోరాడగలదో చెప్పారు.

"విజేత" కథలో హిజ్రా మిస్ ఇండియా అవ్వటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. వారు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని చెప్తుంది.

"కలుపుకుందాం" కథలో కుటుంబ యజమాని మరణిస్తే నైతికంగా అండగా ఒక హిజ్రా నిలబడుతుంది.

"కోకిల" కథలో ఒక హిజ్రాని ప్రేమించి పెళ్ళి చేసుకుని ఒక అనాథ పిల్లని దత్తత తీసుకున్న కథ. ఒక చిన్న ఆనందమైన కుటుంబం.

"ఛమేలీ" కథ బాగా కదిలిస్తుంది. ప్రేమించి హిజ్రా అని తెలిసి పెళ్లి చేసుకున్న మనిషి ఆ హిజ్రాని ఆర్థికంగా ఉపయోగించుకొన్న తీరు ఆమెను అణిచివేయాలని చూసినా ఆమె లొంగక ఆత్మాభిమానంగా విడిపోయి బ్రతకడం ఎలాగో చెబుతుంది.

"సమత్వం" కథలో కూడా క్రీడా రంగంలో వారు గురౌతున్న వివక్షను ప్రశ్నింపజేసారు.


ఈ విధంగా "అస్మిత" పుస్తకంలో వున్న కథలన్నీ తాము మనుషులమని దానిని గుర్తించమని వారు అనుక్షణం చేస్తున్న యుద్ధాన్ని మన కళ్ళకు కట్టినట్టు చెప్పడం జరిగింది. కొన్ని పరిష్కార మార్గాలతోపాటు, మన నైతిక బాధ్యతను కూడా తెలియజేస్తాయి. అంతేకాదు ఈ సంపుటి చదివాక ట్రాన్స్‌జండర్ల పట్ల ఉన్న తేలికభావం, అవహేళన దృక్పథం మన మనస్సుల్లోంచి చెరిగిపోతాయి. ఈ రచయితలు ఆశించేది కూడా అదే. ♦

# నేను సైనికురాలిని!

- రజిత కొండసాని
9652838920

కరోనా కవిత

ఇంతకుముందు ఎప్పుడైనా
నిన్ను చూస్తే నాకు భయమేసేది
నిజానికి నిన్ను చూస్తే
అప్పుడప్పుడు గగుర్పాటూ కలిగేది
నీ విజిల్ శబ్దం
నా వెన్నులో వణుకు పుట్టించేది
చట్ట వ్యతిరేకులపై నీ ఉక్కుపాదం
నా కళ్ళలో భయాన్ని చిత్రించేవి
అది సమాజ శ్రేయస్సుకేనని తెలుసు
ఇప్పుడు కూడా రోడ్డు మీదకొచ్చిన
నన్ను చూసి లాఠీ ఎత్తుతున్నావు
విజిలేస్తున్నావు గట్టిగా అరుస్తున్నావు
కానీ అదేమిటో
నీపై నాకిప్పుడు
కోపం రావడంలేదు
నువ్వు లాఠీ ఎత్తితే
గగుర్పాటు కలగటం లేదు
నీలో నాకో తండ్రి కనిపిస్తున్నాడు
నువ్వు విజిలేసినప్పుడు
హెచ్చరిస్తున్న అన్న అగుపిస్తున్నాడు
నీ అరుపులో నాకో గురువు గోచరిస్తున్నాడు.
నీ కోపం కళ్ళలోనూ
ఓ స్నేహితుడే కనపడుతున్నాడు.
నేను ఇన్నాళ్లూ దేశ సరిహద్దును
కాపాడుతున్నది సైనికులేననే అనుకున్న
ఇప్పుడే తెలిసింది
నా దేశ సమస్త ప్రజల్ని కూడా అదిగో
ఆ పారిశుద్ధ్య కార్మికురాలు రక్షిస్తుంది
అదిగో ఆ డాక్టర్ రక్షిస్తున్నాడు
అదిగో ఆ నర్సు రక్షిస్తుంది
వీళ్ళంతా జీతాల కోసం
పనిచేస్తున్నారనుకున్నా
ఇప్పుడే అర్థమైంది
జీతాల కోసం కాదు
జీవితాలు నిలబెట్టడానికి
ప్రమాదకర పనులు చేస్తున్నారని
దేశ శ్రేయస్సు కోసం
ప్రాణత్యాగాలు చేస్తారని
ఇప్పుడే అవగతమైంది
జీతం ప్రాణత్యాగం కోరితే
విధి నిర్వహణ మనుషుల్ని
మహనీయుల్ని చేస్తుంది
అదిగో చూడండి
నిన్నటి దాక స్టీరింగ్ తిప్పిన చేతులు
నేడు సామాజిక దూరాన్ని నేర్పుతున్నాయి
ముట్టుకోకున్నా వీరంతా ఇప్పుడు
నా ఆత్మ బంధువులు
మాస్కులు వెనకాల కూడా
మనం తీసే ఊపిరి ఒక్కటే
చేయి చేయి కలపకున్నా
మన లక్ష్యం ఒక్కటే
నా దేశం ఇప్పుడు
మరో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నది
వ్యాధుల బాధల నుండి విముక్తి కోసం!
నేనిప్పుడో పరిశుభ్రత తుపాకి
పట్టుకున్న సైనికురాలిని
నాది సరిహద్దులు లేని యుద్ధ క్షేత్రం
కనిపించని శత్రువు పైన
ప్రత్యక్ష యుద్ధం నాది
ఇప్పుడు నేను ఒక్కరినై
అనేకమై సామూహికమై
విశ్వ వ్యాపితమైన ఆరోగ్య సైన్యాన్ని
నేను ప్రపంచ ప్రాణ గానాన్ని!!




# పీడితుల విముక్తి గీతం

- కెంగార మోహన్
9000730403

*మనిషిని మనిషిగా చూడాలని, మతాలకు అతీతంగా మనిషిని ఈ సమాజంలో చూడాలని కోరుకున్న కవి షేక్ కరీముల్లా. ఈయన కవిత్వం పీడితుల పక్షాన నిలిచేది.. ఈ కవిత్వం మత ఛాందసవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించేది. ఈ కవిత్వం మానవీయ విలువల్ని ప్రపంచపటంపై ఆవిష్కరించేది.*

"తెలుగు కవిత్వంలో ముస్లింవాదాన్ని వినిపించిన తరం మాత్రం ఇప్పటిదే. తమ ఉనికిలోకి వెళ్ళి, సంస్కృతిలోకి ప్రవేశించి, మతాన్ని సైతం ప్రశ్నించి యధాతథవాదాన్ని ధిక్కరించిన స్వరం మాత్రం కొత్తదే" అంటారు అఫ్సర్. బహుశా ఈ క్రమంలో పుట్టుకొచ్చిన అనేకానేకమంది ముస్లిం కవులు తమ యాతనల్ని అక్షరీకరించారు. ఖాదర్‌మొహియుద్దీన్ పుట్టుమచ్చ దీర్ఘకవిత తెలుగు కవిత్వంలో సంచలనం రేపింది. ఇప్పటికీ మది స్మృతి పథం నుంచి వీడని కవిత "నేను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో నమోదై వుంది నాపేరు..కన్నబిడ్డని సవతికొడుకుగా చిత్రించింది చరిత్ర" అంటూ రాసిన కవిత ముస్లింవాదాన్ని బలంగా వినిపించింది. తమ అస్తిత్వం కోసమే కాక ఈ దేశంలో వివక్షకు గురిచేసిన కుటిల మనువాదకుట్రలకు వ్యతిరేకంగా బలంగా కవిత్వాన్ని వినిపిస్తున్న కవుల్లో ఒకరు కవి షేక్ కరీముల్లా. అతను రాసిన సాయిబు దీర్ఘకవిత సైతం సంచలనమైంది. ఆలోచించేలా వాస్తవ జీవితాన్ని చిత్రించే కావ్యంగా సాహిత్యలోకంలో సుస్థిరమైన స్థానం సంపాదించింది. మనుషుల మధ్య అడ్డుగోడల్ని నిర్మిస్తున్న ఈ కులసమాజంపై కన్నెర్ర జేస్తున్న ఈ కవి కవిత్వలోతుల్లోకి వెళితే...

***ఉన్మాద వరండాల్లో***
***వాళ్ళు మురిపెంగా పెంచుకుంటున్న***
***అసత్యాల కలుపుమొక్కల్ని పీకి***
***పవిత్ర ఖుర్ఆన్ సాక్షిగా***
***నిర్నిబంధాల నీతి విత్తులు చల్లండి***
***ముస్లిం అంటే..***
***నిర్మల ప్రేమకు***
***నిరాడంబర రూపమని***
***ప్రపంచపటంపై***
***నిలువెత్తు సంతకం చేయండి.***

ఈ దేశ నిర్మాణంలోనూ.. స్వరాజ్య పోరాటంలోనూ ముస్లీంల పాత్ర వెలకట్టలేనిది. వాళ్ళు వీళ్ళు కాదు..ఈ దేశం అందరిదీ..ఈ దేశం మనందరిదీ..ఓట్లకోసం చేస్తున్న విభజన రాజకీయకుట్రల్లో ముస్లింలను బలిచేస్తున్న దుర్మార్గ రాజకీయాలకు మనమే సాక్ష్యం. అటువంటి నీతి మాలిన రాజకీయాలను ఈ కవి తన కవిత్వం ద్వారా అసహ్యించుకుంటాడు. మతోన్మాదుల వరండాల్లో పెరుగుతున్న అసత్యాల కలుపుమొక్కల్ని ఖురాన్‌సాక్షిగా నీతి అనే విత్తనాలు జల్లి కలుపును పీకేయ్యాలనే సందేశం ఇస్తాడు. ముస్లింలంటే నిర్మలప్రేమకు నిరాడంబర రూపమని విశ్వసత్యాన్ని ఈ కవితలో ఆవిష్కరిస్తాడు. అందుకే..

**నిబ్బరం నా ఉనికి/నిటారుతనం నా నడక/ నిఖార్సయిన భారతీయుడ్నై/ చెమటచుక్కల నెలవంకనై/ జాతీయజెండాకు పూచిన/ అత్తరు పూవునైనందుకు/ నీకెప్పుడూ/ నేను ఎదురు**

**మతం వాడినే/ నాతిండిపై ఆంక్షలు/ నా షేర్వాణిపై ఆంక్షలు/ నా బక్రీద్‌పై ఆంక్షలు/ ఆంక్షల గాజుపెంకుల్ని విస్తరిస్తున్న/ నీ పరివారిజంతో/ నెత్తురోడ్తున్న పసిపిల్లాడిలా నేను/ నా అజాపై నింద/ నా నమాజ్‌పై నింద/ నా కన్నీరు ఒలికితే నింద/ నా కన్నీరు ఇంకితే నింద/ నిందల బందిఖానాలో నెట్టి/ నన్ను నిత్య అనుమానితుడ్ని చేశావు కదరా! ..**

సెక్యులరిజం ప్రసంగాలకే పరిమితం చేసింది ఈ రాజ్యం. ఈ రాజ్యం భిన్నత్వంలో ఏకత్వం కాదు అని నిరూపించేందుకు అప్రజాస్వామికవాదులు చేస్తున్న దాష్టీక యోచనల్ని కళ్ళకు కట్టినట్లు చూపించింది ఈ ఎదురు మతం కవిత. మనుషులు తినే ఆహారంపై ఏ దేశంలో లేని ఆంక్షలు ఈ దేశంలో అమలుచేయాలని చూశారు. ఒకప్పుడు పశుసంపదే రాజ్య సంపద. ఏ రాజుకి ఎక్కువ పశువులుంటే వాళ్ళే గొప్పధనవంతులైన రాజులు. ఆ పురాతన సమాజంలో యజ్ఞాలు, క్రతువుల పేరుతో వేలాది పశు సంపదను నిర్వీర్యం చేస్తున్న సందర్భంలోనే బౌద్ధ జైన మతాలు ఆవిర్భవించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ దేశంలో ఆహారంపై ఆంక్షలు విధించి, అదే ఆహారాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు గడించాలని చూసే పాలకులనేమనాలి. ముందుగా ముస్లీంలను పరాయివాళ్ళుగా చూసే ఆలోచనే దుర్మార్గమైనది. ఎవరిమతం వారిది..ఎవరి ఆహారం వారిది..ఎవరి జీవన విధానం వారిది..ఎవరు ఏది నచ్చితే ఆ మతం అవలంభించవచ్చు..మతం అన్నది ఆచరణ మాత్రమే నన్న సత్యాన్ని ముందు గ్రహించాలి. ఎవరు ఏది ఆచరించినా అన్ని మతాల సారం మానవత్వమే కదా. దాని స్థాపనకు కృషిచేయాల్సిందిపోయి కులాల మధ్య కార్చిచ్చు రగల్చడం దేశ పురోభివృద్ధికే ఆటంకం..

*ఈ నేలను తల్లిలా ప్రేమించిన వాడ్ని*
*తల్లిపాదాల క్రింద స్వర్గముందన్న*
*ప్రవక్తమాటలు నమ్మిన వాడ్ని..*

ఇంతకంటే మనిషికి మనుగడకు అస్తిత్వానికి ఇంకేమి అవసరం లేదు ఈ విశ్వంలో.. మనిషి ఎక్కడైనా పౌరుడే..ఏ నేల ఎవరికీ శాశ్వత సొత్తు కాదు కదా..ఎందుకింత విభజన రేఖలు గీస్తున్నారు. మనిషికి ఆకలి తీర్చని మతం, మనిషికి గూడునివ్వని మతం ఎందుకు పనికిరాదు..ఎదురుమతం కవిత్వం నిండా ఈ దేశంలో మతం ముసుగులో సాగుతున్న అరాచకాలను ఆవేదనతో కవి అక్షరీకరించాడు. ఈ కవిత్వంలో కవి విశ్వమానవ ప్రేమను కాంక్షిస్తాడు. ఈ కవికి ఈ ఎదురుమతం కవిత్వానికి దేశభక్తి ఎక్కువే..

*ఇంతకీ వాళ్ళెవరు?*
*మాలెగావ్‌లో మంటలు పెట్టినవాళ్ళు*
*తాజ్‌లో మల్లెరేకుల్ని తుంచినవాళ్ళు*
*నీ వాళ్ళా? నా వాళ్ళా..?*
*మనుషుల్ని కదా! మనవాళ్ళనుకోవాలి!*
*వసంతాన్ని కదా ! మనం కలగనాలి*
*దేశ ముఖచిత్రంపై*
*కాళరాత్రిలా కమ్మినవాళ్ళు*
*మకరందపు బోసినవ్వులపై*
*నిప్పులగుండును విసిరినవాళ్ళు*
*వాళ్ళెవరైతేనేం?*
*ఇండియాగేట్ దగ్గర పాతిపెట్టాల్సిందే*
*మేరా భారత్ మహాన్.*

మాతృభూమి మీద మమకారం ఇంతకంటే ఏం కావాలి..? ఈ దేశంలో పుట్టిన ప్రతిఒక్కరికీ ఈ భూమిమీద హక్కుంది..ఉగ్రవాదులెవరైతేనేం వాళ్ళను మనదేశ బొడ్రాయిదగ్గర ఖతం చేయాలనుకోవడం కన్నతల్లి భరతభూమిపై ఉన్న అవిభాజ్యమైన ప్రేమకు నిదర్శనం కాదా..? నిజంగా మనదేశం ఎన్ని మతోన్మాద దాడుల్ని, రక్తపాతాల్ని చూసింది. ఎన్ని నెత్తుటి చారికల్ని ఒంటిపై పూసుకుంది. మనిషి సమున్నత ఆశయం కోసం నడవాలేతప్ప మతం అనవసరమనే భావన కలుగుతుంది. ఈ కవి ఒక చోట **ప్రపంచశాంతికై ప్రతిధ్వనిస్తున్న పీడితుల విముక్తి గీతం అల్లాహెూ అక్బర్** అంటాడు. దీన్ని బట్టి ఏ మతమైనా శాంతిని కాంక్షించాలేకాని ఉన్మాదాన్ని..ఉగ్రవాదాన్ని కాదనే సందేశం ఇస్తుంది ఈ కవిత్వం. పీడితులెవరైనా..బాధితులెవరైనా..మతం అవలంభిస్తున్నారంటే ఈ ప్రపంచంలో తాము ఎదుర్కొంటున్న బాధలకు ఉపశమనమే తప్ప మరొకటి కాదు..మతమన్నది ఆచరణే తప్ప అనివార్యం కాదు..చివరికి మానవత్వమే విజయం సాధిస్తుంది. ఈ కవిత్వంలో లోతైన భావాలు మనల్ని పలకరిస్తాయి.

*ఆకలి*
*కోరికల కొయ్యలకు వేలాడినప్పుడు*
*అల్లాహ్ కరుణ అమృతమై*
*గొంతుకలో దిగితే*

కవిత

# ఎడారి బాటసారులం

- గోసల నారాయణస్వామి
8309544672

నేను " రైతును " అనీ
రొమ్ము విరుచుకునీ !
నిండైన ఆత్మాభిమానంతో
దర్పంగా నడచి ఉన్నా !
అతి దుర్భరమైన పేదరికాన్ని
పుట్టుకతోనే వారసత్వంగా పొంది ఉన్నా !
ఏటేటా దరువేస్తున్న కరువు కాటుతో !
కటిక దరిద్రపు బతుకే నెత్తికెక్కీ నడవమనీ
మెడ పట్టుకు నెడుతుంటే !
పడుతూ లేస్తూ, లేస్తూ పడుతూ !
ప్రయాణం మొదలుపెట్టీ !
ఎండా వానలకానని గూటిలో !
ముడుచుకుంటూ నడుచుకునే గువ్వలై !
ఎలుకలూ పందికొక్కుల సావాసంలోనే !
గబగబా గతికిన రుచి కోరని ఆకలి తిండీ !
సుఖమడగని బడలిక నిద్దురతో !
ఎంతకూ సాగని కాలం నదిలో కాళ్ళీడ్చుకుంటూ !
ఎదురీదడంలో ఎదురైన
ఎన్నెన్నో కడగండ్ల వడగండ్లు పోట్లెత్తితే !
తెగిన బాధల భారపు గట్ల నుంచీ !
ఎంత ఆపుకుంటున్నా ఆగకుండా పొంగుకొచ్చిన
దుఃఖ జలపాతాల్లో మునిగి తేలుతూ !
ముక్కుతూ మూల్గుతూ ముందుకు పోతున్న !



వలస ప్రయాణంలో మజిలీ మజిలీలోనూ !
గజిబిజి మలుపుల నుండీ !
కొట్టుకు పోయే సీమ చకోరాలం !!
ఎదురెక్కి వచ్చే కరోనాకు బెదరీ !
నక్కి నక్కీ వెనక్కే పరుగెత్తే ఎడారి బాటసారులం !!
పాలకులెవ్వరైనా ప్రణమిల్లీ !
నీళ్ళు తప్పా కన్నీళ్ళతో ఏమడగనోళ్ళం !!
ఎవరికేమిస్తారో మాకైతే నీళ్ళొకటివ్వండి !
పై చేతులయ్యే పనులకు
ప్రాణం పొయ్యండి !!
మా చేతి చేతలకు ఊతమవ్వండి !!
ఎండిన పేగులై నేల తల్లి ఎద మీద !
వాలీ వాడి పోయిన కణిక రాళ్ళ చేల్లోనూ !
కనక రాశుల మెరుపులు పరిచే !
మెత్తటి ఎర్రటి సీమ నేలలో !
పచ్చటి ముంగారి మొలకలై మొలిచీ !
జీవ కళలద్దుకునేలా పల్లె తల్లికి ప్రాణం పోసే !
సేద్యపు సంబరాలకి రంగుల వెలుగు రేఖలై !
విరబూయడానికి వరదాతలవ్వండి !! ◆

---

***ఎలా వుంటుంది ?***
***ఆ తృప్తి***

ఈదుల్ ఫితర్‌లో తెలుస్తుంది..ఈ కవితలో కవి మనిషి సమూల జీవితచిత్రాన్ని, జీవన గమనాన్ని ఆవిష్కరిస్తాడు. కవిత్వంతో మమేకమైన జీవితం కాబోలు ప్రతి చిన్న ఘటనలుకూడా కవితాత్మకంగా చెప్పే ప్రయత్నం చేస్తాడు. సహజంగా రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందులు చేసే ప్రార్థనలు పవిత్రంగా జరుగుతుంటాయి. అయితే అక్కడ మానవీయకోణాన్ని కవి ఆవిష్కరిస్తాడు. ***"ప్రేమ తప్పిపోయిన గొర్రెపిల్లయినప్పుడు అనురాగం ఓడనెక్కి ఓదార్పు ఒడ్డుకు చేరితే ఎలా వుంటుంది? ఆ మమత ఇఫ్తార్‌లో కురుస్తుంది."*** ఇది తను కలలుగన్న రంజాన్.

ఈ కవి కవిత్వం ఒకవర్గానికో..ఒక మతానికో చెందినది అని నేను అనుకోను..మనిషిని మనిషిగా చూడాలని, మతాలకు అతీతంగా మనిషిని ఈ సమాజంలో చూడాలని కోరుకున్న కవి షేక్ కరీముల్లా. ఈయన కవిత్వం పీడితుల పక్షాన నిలిచేది..ఈ కవిత్వం మత ఛాందసవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించేది. ఈ కవిత్వం మానవీయ విలువల్ని ప్రపంచపటంపై ఆవిష్కరించేది. కవి జావెద్ చెప్పినట్లు" గత చరిత్ర చేసిన కుట్రల పద్మవ్యూహంలో ఇప్పటికీ బయటపడలేకపోతున్న అభిమన్యుడ్ని.." ముస్లింవాద కవులు అనివార్యంగా తమ అస్తిత్వానికై పోరాడాల్సి వచ్చింది. ఈ క్రమంలో వాళ్ళు లౌకికత్వం పునరుద్ధరణకు, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి చేస్తున్న అక్షరపోరాటానికి ప్రతి ఒక్కరం సంఘీభావం తెలుపుదాం.. ◆

## కవిత

# నిశ్శబ్ద బీభత్సం

- శ్రీనివాస రాజు పెన్మెత్స
9550 981531

కరోనా కవిత

ఒక బీభత్సం నిశ్శబ్ద యుద్ధమై
మానవ జాతిపై పంజా విసిరితే...
సముద్ర గర్భం యుద్ధ నీతిని నేర్పింది
ఒక అడుగు వెనక్కి వేసేది
వేయి అడుగులు శిఖరమై
పైకి లేవడానికే అని
అడవి తల్లి నేర్పింది...
వెలుగులో చీకటి గెరిల్లావై
జీవితాన్ని సహనంతో గెలవమని!
తుఫాను బీభత్సం నేర్పింది...
నిశ్శబ్దంలో మానవ జాతి రహస్యాలు
దాక్కున్నాయి వెతుక్కోమని!
అగ్ని శిఖ నేర్పింది నీ చైతన్యం
కశేరు దండమై నిలబడే ఉండాలని
గాలిలో తరంగాలు
రహస్యాన్ని మోసుకొచ్చాయి,
జరుగుతున్నవి కరోనా మరణాలు కాదు
మానవ జాతి తప్పిదాలని!
కళ్లు తెరచి కృతజ్ఞతతో ప్రకృతికి
క్షమాపణల నమస్కారం చేయకపోతే....
మీ చేయే భస్మాసుర హస్తమై
మిమ్మల్ని మింగేస్తుందని,
అవతారం అవశేషాలు కూడా
అనంతం బయటకు
విసిరివేయ బడతాయని
ఆకాశవాణి అవకాశం తీసుకుంది
కర్తవ్యాన్ని నిష్కామ కర్మగా
నేడు పుణ్యపురుషులు చేస్తున్న
కష్టం, త్యాగం, శ్రమ, ప్రేమ...
మానవజాతిని మంచి అభ్యాసం వైపుకు
ఉత్కృష్టమైన మానవీయ విలువల వైపుకు
ఔన్నత్యం, క్రమశిక్షణ వైపుకు కదిలించకపోతే...
పొంచి ఉన్న మరిన్ని ముప్పుల్లో
మీరు మాయమైపోతారని హారతి కర్పూరంలా!
సముద్రంపై చెరిగి పోయిన సంతకంలా!
పులి నోట్లో మాయమైన జింక మాంసంలా!
మీకు అర్థం కావడం లేదా??!
ఈ బీభత్సం మీ విజ్ఞానాన్ని,
అహంకారాన్ని, మీ ఆధిపత్య ధోరణినీ
మీ లోభత్వాన్ని, మీ కర్కశత్వాన్ని, మీ డొల్లతనాన్ని,
తెరవెనుక మీ టక్కుటమార రహస్య మోసాలను,
పంచభూతాలతో మీరు ఆడుతున్న రాక్షస క్రీడను
అంతెందుకు భూమిపై మీ అస్తిత్వాన్ని
మీ మనుగడనే సవాల్ చేసిందనీ
వికటాట్టహాసం చేసి మీ కాళ్లు, చేతులు
నోరు, కళ్లు, ముక్కు మూసి మూలని కూర్చో పెట్టిందని...
ఇప్పటికైనా
భక్తితోనో, భయంతోనో, చైతన్యంతోనో
నిర్మల మందాకినీ వీచికల వైపుకు
మానవీయ పరిమళం వైపుకు మనిషి అడుగులు
కదపకపోతే–
ఈ నిశ్శబ్ద బీభత్సంపై నిజమైన విజయం సాధ్యం కాదని!
సన్నాయి నొక్కులు వొద్దు నిజాన్ని నిర్భయంగా చూద్దాం!
భావ సమూహమై, సమర శంఖమై విజయం సాధిద్దాం!

---

# నానీలు

- సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

బడికి
తాళాలు పడ్డాయి!
పిల్లల అల్లరి
గట్లు తెగింది!!!

జీవితపు
పుటల్లోకి చూశా!!
బాల్యమొక్కటే...
నెమలీకలా మెరుస్తోంది!

జబ్బు
తగ్గిపోయింది!
ఇరుగు పొరుగుల్లో..
అనుమానం పెరిగిపోయింది!!

పెరిగిన
ఆన్లైన్ మోసాలు!!
బంగారు కంకణం పులి కథ
చెప్పటం లేదుగా!!

పూర్వం చేపలకోసం
వల!
మనుషులకు
మాటల వలలేస్తున్నారు

కథ

# బేరసారాలు

- పొన్నాడ సూర్యప్రకాశరావు
9000 619267



"లేవాలి..." "లేవాలి..." ఆయాల కేకలకు మెలకువ వచ్చింది. ఉదయం ఏడు కావస్తోంది. "సాధారణంగా అరు గంటల కల్లా నాకు స్నానమే అయిపోతుంది. ఇంత నిద్రపట్టిందేమిటి? లేటు అయిపోయింది. గంట బేరాలు పోయాయి. ఉమ ఏం చేస్తున్నట్లు? లేపలేదేం.." అనుకొంటూ పూర్తిగా తెలివిలోకి వచ్చాను. ప్రక్కన బెడ్ దుప్పట్లు మారుస్తున్నారు. చుట్టూ ఇంచుమించుగా అవే దృశ్యాలు... ఒక్కసారి తల విదిల్చాను. నేను ఇంట్లో లేను. కరోనా ఆసుపత్రి వార్డ్‌లో ఉన్నాను. నిన్న ఉదయం అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. మొన్న రాత్రి నిద్దపట్టలేదని చెప్పాను. ఓ చిన్న డోస్ ఇచ్చినట్టున్నారు. బానే నిద్రపట్టింది. "గురువుగారూ! లేచారా? బాత్‌రూంల దగ్గర రష్ పెరుగుతోంది. తొందరగా వెళ్ళి వచ్చేయండి" అన్నాడు పక్క బెడ్డాయన. పరుగెట్టాను.. ఎలాగో స్నానాదుల కానిచ్చి బెడ్‌మీదకు చేరాను. డాక్టర్స్ వచ్చి చూడసాగారు. ప్రక్క బెడ్డాయన ఏదో మాట్లాడబోయి నర్సులు గుర్రున చూసేసరికి ఊరుకొన్నాడు. డాక్టర్ చెక్ చేసి వెళ్ళిపోయాక నోరు విప్పాడు.. "ఏంటి గురూగారు ఎక్కడ? ఏం చేస్తుంటారు? నిన్న జాయిన్ అయినప్పుడు బాగా డల్‌గా ఉన్నారు. ఇప్పుడు పరవాలేదనుకొంటా" అన్నాడు. నాకు వారం రోజుల క్రితం జలుబు, జ్వరం మొదలయ్యాయి. మందుల కొట్లో మాత్రలు కొని రెండు రోజులు వాడాను. మరో రెండు రోజులకు మా భవంతిలో పై అంతస్థులో ఒకాయనకు కరోనా పాజిటివ్ అని తెలవడం మొత్తం అందరికి టెస్ట్‌లు చెయ్యడం నాకు పాజిటివ్ అనగానే తీసుకొచ్చి చేర్పించడం జరిగింది. అదే ప్రక్కాయనకు చెప్పాను. నేను "జనరల్ స్టోర్స్" నడుపుతానని చెప్పాను. "గురూ గారూ...మీకు కనీసం జలుబు, జ్వరం వచ్చాయి. నాకు ఏమీ లేదు. అయినా పాజిటివ్ అన్నారు. పదేసారు' పదిరోజుల తరువాత మళ్ళీ టెస్ట్ చేస్తారుట. నేను చేరి, నాలుగు రోజులు అయింది. బాగానే ఉన్నాను. ఒక్క మందు వేసుకోవటం లేదు.." "మీరిచ్చిన మందులు వాడను కూడా లేదు. నన్ను పంపించేయండి" అంటే కుదరదు అని చెప్పి నర్సు బలవంతాన మందు నోట్లో పోస్తోంది. రెండు వారాలు ఖచ్చితంగా ఉండాల్సిందేనట." అన్నాడు. "రెండు వారాలా?" దిగులు పట్టుకొంది. రెండు వారాలు వ్యాపారం పోతున్నందన్నమాట.. నష్టం లెక్క తేలేసరికి బావురుమన్నాను. కొన్ని పెర్మినెంట్ బేరాలు ఎదురుకొట్టు వాడికి వెళ్ళిపోతాయోమోనని బెంగ పట్టుకొంది. నర్సు ఇచ్చిన మాత్ర వేసుకొని వేడి పాలు త్రాగి బెడ్‌మీద వాలాను. గతంలోకి జారుకొన్నాను.

"మా భవంతిలో మొత్తం ఎనిమిది కుటుంబాలుంటాయి. క్రింద రెండు వాటాలను నేను తీసుకొని హాల్‌ని దుఖాణంగా మార్చుకొన్నాను. పచారి కొట్టు నాది. ఇంటికి కావలిసిన సమస్తమూ నా కొట్లో దొరుకుతాయి. పాల డీలర్‌ని కూడా కావటంతో ఉదయం అయిదు నుంచే వ్యాపారం మొదలవుతుంది. పక్కా, శాశ్వత ఖాతలూ ఎక్కువే. ఎదురుకొట్టు తీవ్రమైన పోటీ ఇచ్చినా నాదే పై చేయి.. ఈ కరోనా హడావుడి మొదలయినప్పుడు మొదట్లో పదకొండు గంటల వరకూ లాగేవాన్ని... ఆ మధ్య ప్రక్క వీధిలో తొమ్మిది దాటేక కూడా

తెరిచి ఉన్నందుకు పోలీసులు రెండు దెబ్బలు కూడా వేసారు అని తెలిసాక కొంచెం జాగ్రత్తగా ఉన్నాను. సోషల్ డిస్టెన్స్‌ను చూపిస్తూ వృత్తాలు గీయడం మాస్క్, గ్లౌవ్స్ వాడటం మొదలుపెట్టాను. తొమ్మిది అవగానే ఎదుటి షాపువాడు మూసేసి లోపలికి పోతాడు. మర్నాటి వరకు కనబడడు. పిచ్చాడు.. నేను షట్టర్ వేసేస్తాను. కాని అక్కడే కూర్చొంటాను. బేరం రాగానే ప్రక్కనుంచో క్రిందనుంచో కావలిసినది తీసి ఇచ్చేస్తుంటాను. అలా చేయటం వలన వాడి ఖాతాలు కూడా నా దగ్గరకి రాసాగాయి. కష్టమర్‌కి కుదిరినప్పుడు వస్తాడు. వాడు ఎప్పుడు వచ్చినా నేను దొరుకుతాను. ఆ షాపు వాడు అందరిని క్యూలో రమ్మంటాడు. వృత్తాలలోనే నించోమంటాడు. నేను అవేవి చూడను. ఎవరు ఎటునుంచి వచ్చినా "డబ్బులు పుచ్చుకొన్నామా!! సరుకు ఇచ్చామా!!" అంతే నేను చూసేది.. వార్తలను అనుసరిస్తాను కాబట్టి మా ఏరియా కూడా కరోనా బారిన పడొచ్చని ఊహించి ముందుగానే నిత్యావసర వస్తువులన్నింటిని సమకూర్చుకొన్నాను. కొన్ని వస్తువుల దగ్గర పదికి ఇరవై పుచ్చుకొన్నా అడిగేవారు లేరు. క్యూ పాటించడం లేదని వినియోగదారులు గొడవపడినా నవ్వుతూ ఇద్దరిని సముదాయించి పంపేస్తాను. క్వింటాళ్ళ కొద్ది శాంతం, కేజీల కొద్దీ సహనం, గ్రాములలో విసుగు ఉన్న వ్యాపారికి వ్యాపారం పుష్కలమేగా."

ఇంతలో కొంత హడావుడి కనిపిస్తె అటుగా చూశాను. కొత్త పేషెంట్.. దగ్గరలో బెడ్ కేటాయించారు. కరోనా లక్షణాలు లేవు గానీ పాజిటివ్‌ట. డాక్టర్ వచ్చి చూసి వెళ్ళారు. కాసేపు అయ్యాక అతను వాష్‌రూంలోకి వెళ్ళి వచ్చి "ఎలా ఉంటున్నారండి బాబూ! కంప్లైంట్ చెయ్యొచ్చుగా నీట్‌నెస్ లేదని" అన్నాడు. "మీరు చెయ్యండి." అన్నాడు అతని ప్రక్క పేషెంట్. నా ప్రక్క బెడ్డాయన నాతో నెమ్మదిగా "ఇప్పుడు వచ్చాడు. ఇప్పుడు వాష్ రూములు ఖాళీగానే ఉన్నాయి. రేపు ఉదయం చూడాలి వీడి పాట్లు, అయినా గురూ! మనం లక్కీ. మనవార్డ్‌ని బాగానే పెట్టారు.. ఇక్కడ పది బెడ్లకు ఒక బాత్ రూం ఉంది. ప్రక్క వార్డ్‌లో మరీ ఘోరం" అన్నాడు. తల పంకించాను. ఇంటి దగ్గర మూడు బెడ్ రూములకు ఎటాచ్‌డ్ బాత్‌రూంలు ఉండగా కామన్ బాత్ రూం కూడా ఉంది. "ప్రభుత్వం మాత్రం ఎంత చేస్తుంది? గడుపుకోవాలి కానీ" అన్నాను జవాబుగా.. అంతే అన్నాడు.

"ఏమండీ లాక్ డవున్ కదా! పదింటికల్లా కట్టేసీ వచ్చేయ్యండి.. టీవీలో మంచి సినిమా వేస్తున్నారు... కలిసి చూడొచ్చు" అనేది శ్రీమతి లాక్ డవున్ మొదలైన క్రొత్తలో. మూడు నాలుగు గంటల వ్యాపారంలో ఏమొస్తుందే.. ఎదుటి కొట్టువాడు భయస్తుడు... టైంకి కొట్టు మూసేస్తున్నాడు. తొమ్మిదింటికి గాని నిద్ర లేవని వాళ్ళు బజారు కొస్తె మన దగ్గరకే రావాలి. నేను బయట కుర్చీ వేసుకు కూర్చొంటాను.. బేరమొస్తే కిటికీ లోంచి చెబుతాను. షట్టర్ దగ్గర సరుకు పెట్టేయ్ చాలు" అని చెప్పి మధ్యాహ్నం భోజనానికి మాత్రం లేచేవాడిని. కాలనీ అంతా మధ్యతరగతి వాళ్ళు ముందు జాగ్రత్తగా ఒక్కో కుటుంబం మామూలు కన్నా అధికంగానే కొనుగోళ్ళు చేయడంతో వ్యాపారం లాభసాటిగానే సాగేది."

"ఏంటీ... ఆలోచించకుండా పడుకోండి. తగ్గిపోతుంది." నర్సు మాటలతో వార్డు లోనికి వచ్చాను. రాత్రికి మళ్ళీ జ్వరం వచ్చింది. చెప్పానా.. ఆలోచనలు పెట్టుకోవద్దని.. అంటూ నర్సు డాక్టరుని తీసుకొచ్చింది. మళ్ళీ ఏవో టెస్టులు వ్రాసారు.

♦♦♦

మరునాడు సాయంత్రానికి మామూలుగా అయ్యాను.. సెల్‌ఫోన్‌లో ప్రొద్దుటా, సాయంత్రం ఇంటితో మాట్లాడుతూనే ఉన్నాను. పిల్లలకి సెలవులు కావటంతో కొట్టు వ్యాపారం చూసుకోగలరు. నేను ఫోన్‌లో హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడి కావలిసిన సరుకులు కొట్టుకు చేరవేయించగలను. కానీ వీధినే మూసేసారు.

కొట్టు పూర్తిగా మూసేసారు. అసలు మామూలు రోజులలో కూడా ప్రభుత్వ వేళలు ఎప్పుడూ పాటించలేదు. రాత్రి పదివరకు షాపు తెరిచే ఉంచేవాడిని.. అప్పుడప్పుడు అధికారులు తణికీలకు వచ్చినప్పుడు వారి చేతిలో ఓ పెద్దనోటు పెట్టేవాడిని. శ్రీమతి అనేది...'ఏమండి తొమ్మిది గంటలకల్లా కట్టేస్తే వాళ్ళకి అలా తడపక్కరలేదు కదా అనేది... పిచ్చి మొహమా! వాళ్ళు రోజూ రారు కదా! వచ్చినప్పుడు ఇచ్చేది పది అయితే రానప్పుడు నేను కొట్టేది వందకదా.. అయినా "వద్దాణం" అడిగావు కదా అని నోరు మూయించేవాడిని.

మరో నాలుగు రోజులు గడిచాయి. ప్రక్క బెడ్డాయన చేరి పదిరోజులు దాటడంతో రక్త పరీక్ష చేసారు. రిపోర్ట్ కోసం ఆశగా చూస్తున్నాడు. "నెగిటివ్" వచ్చింది. సంతోషం వెళ్ళిపోతానన్నాడు.. 'అప్పుడే.. ఇంకా రెండు రోజులాగి మళ్ళీ

టెస్ట్ చేసి నెగిటివ్ వస్తే అప్పుడే పంపించేది" నర్స్ చెప్పేసింది. "అదేమిటమ్మా.. నేను ముందూ బాగానే ఉన్నాను.. ఇప్పుడూ బాగానే ఉన్నాను.. నెగటివ్ వచ్చిందిగా పంపించెయ్యండి తల్లీ! బోలెడు పనులున్నాయి.." వేడుకొన్నాడు.. "రూల్స్ ఒప్పుకోవు.. మీరు బలంగా ఉన్నారు కాబట్టి కరోనా వచ్చినా తట్టుకొన్నారు.. మీరు బయటకెళ్ళి తిరిగితే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్ళు మీ వలన కరోనాకు గురవుతారు... ఓ రెండు రోజులాగాల్సిందే" అని వెళ్ళిపోయింది.

"అదీ నిజమే కదండి! బయట పనులు మాత్రం ఏమీ అవటం లేదుగా. ఇంట్లోనైనా కూర్చోడమే కదా! రెండు రోజులాగండి.. రెండో రిపోర్ట్ వచ్చాకా దర్జాగా, ధీమాగా వెళ్ళిపోవచ్చు" అన్నాను.

"అంతే! అంతే! అనుకొని పడుకొన్నాడు.

◆◆◆

పనులు అంటే గుర్తుకొచ్చింది.. శ్రీమతి అనేది ఎప్పుడూ "ఎక్కడ కయినా యాత్రలకు వెడదామండీ..' అని. నేను కొట్టు మూస్తే వ్యాపారం పోతుందని నేను కదలను. వేసవి సెలవులనేవాడిని. సెలవులొస్తే ఎండలలో ఏం వెడతాం అనేవాడిని. మళ్ళీ న్యూళ్ళు అనేవాడిని. ఏమండీ! మొక్కులండీ.. లేటు చెయ్యకూడదూ అనేది. నేను వినేవాడిని కాదు. వార్డ్‌లో అందరిదీ ఒకటే పరిస్థితి.. మా ప్రక్కవార్డ్‌లో అన్నీ సీరియస్ కేసులట. రోజుకి ఒకరిద్దరు ఆ వార్డ్‌లో పోతున్నారు. కడచూపు కూడా కొన్ని కేసుల్లో చూడనివ్వటం లేదట. మా వార్డ్‌లో అంత సీరియస్ కేసులు లేవు.. చిన్న చిన్న ఇబ్బందులు తప్ప. నాకు రెండుసార్లు రక్త పరీక్ష చేసి నెగటివ్ వస్తేనే పంపిస్తారు అంటే కనీసం ఇంకో వారం రోజులుండాలి. భగవంతుడా అనుకొన్నాను. కొన్ని బెడ్డులలో రోగులు బెంగపెట్టుకొని కుంగిపోతున్నారు. మామూలు వ్యాధులయితే ఈపాటికి చూడటానికి బుట్టలనిండా పళ్ళతో కొబ్బరి బొండాలతో బంధుమిత్రులు వచ్చేవారు. భార్యాపిల్లలు టచ్‌లోనే ఉండేవారు. బాధపడినా బోర్ కొట్టేది కాదు. ఇదేం జబ్బు నాయనా.. అసలు మందేలేదట. టీకాలు రావడానికి సంవత్సరం పడుతుందట..ఇలా ఒంటరిగా ఉంచటమే చికిత్సట. ప్రైవేటు హాస్పిటల్ కెడదామంటే ఈ భాగ్యానికే లక్షలు వదులుతాయట.

◆◆◆

ప్రక్క బెడ్డాయనని డిశ్చార్జ్ చేసేసారు. కొత్తపేషెంట్ వచ్చాడు. నాకు ఒక రిపోర్ట్ నెగటివ్ వచ్చింది. రెండో రిపోర్ట్ రేపు రావాలి. నెగటివ్ వస్తే రేపు సాయంత్రం పంపించేస్తారు. మళ్ళీ మామూలేనా? అదే వ్యాపారమా? అవే బేరసారాలా? అదే జీవితమా...? కాదు.. కాదు... కరోనా ఎన్నో పాఠాలను నేర్పింది.. నేర్పుతోంది.. ఏ లావాదేవీలో ఎవడిద్వారా నాకు అంటుకుందో? ఎదుటి కొట్టువాడు శుభ్రంగా ప్రభుత్వ నిబంధనలననుసరిస్తూ వ్యాపారం చేసుకుంటున్నాడు. వాడి ఖాతాలన్నీ నా ఖాతాలతో బాటూ మళ్ళీ వాడికే వెళ్ళిపోయాయి. నేను కూడా సామాజిక స్పృహ చూపిస్తూ ఖాతాదారులలోని డబ్బునే చూడకుండా ఆ చేతులను శానిటైజ్ చేసే ఏర్పాటు చేసుంటే బాగుండేది.. చాలా సంవత్సరాల తరువాత కుటుంబమంతా కలిసి భోజనం చేస్తున్నాము.. సినిమాలు చూస్తున్నాం... పని లేకుండా బయట తిరుగుతూ అవసరం లేకుండా ఖర్చు పెట్టేవాళ్ళం. ఈ రెండు నెలలూ అవసరమైన ఖర్చులే పెట్టాం. చాలా పొదుపు చెయ్యొచ్చని తెలిసింది. ప్రకృతి ధర్మానుసారం నడిస్తే భగవంతుడిచ్చిన శరీర పోషణ చాలా సులభం.. అని చెప్పడానికే వచ్చిందేమో ఈ వికృతి అనిపిస్తోంది. చిన్నప్పుడు మంచి సాహిత్యం చదివేవాడిని. వ్యాపారంలో పడి అన్నీ మానేసాను. ఇప్పుడు 'జీవితానికి' కూడా కొంత సమయం కేటాయించుకోవాలి. నన్ను తొందరగా బయట పడేయ్ స్వామి! మా ఆవిడ మొక్కులన్నీ తీరుస్తా" కొత్తగా కళ్యాణాలు, వ్రతాలు చేయిస్తా... మా ఇంట్లో పై వాళ్ళకీ తగ్గిపోవాలి.. మా ఇంట్లో వాళ్ళందరూ బాగుండాలి.

"మరి ప్రక్క బిల్డింగ్‌లో కరోనా వస్తే?" అమ్మో.. అక్కడా రాకూడదు.. "నగరమంతా ఉందిగా కరోనా.. ఎవరో ఒకడు నీలాగే నాకేం లేదు. నాకేం రాదు అని తిరిగి మీకు మళ్ళీ అంటించొచ్చు కదా! నీ షాపులోనే కొంటాడు. నాకు పది రూపాయలు ఎక్కువ ఇస్తూ నీకు మళ్ళీ అంటించి పోతాడు.. "అంటోంది అంతరాత్మ. "హమ్మ .. అసలు సిటీలో, దేశంలోనే, కాదు కాదు ప్రపంచంలోనే కరోనా మాయమయితేనే అందరం బాగుంటాం' అని సమాధానపరిచాను. బహుశ: దసరా నాటికి సమసిపోవచ్చు. "అప్పుడు కొండకొచ్చి కళ్యాణం చేయిస్తా స్వామి "మళ్ళీ మొక్కాను.." దసరా టైంలోనా.. వ్యాపారానికి మంచి సీజన్ కదా? అంటోంది అంతరాత్మ.. దాని నోరు నొక్కి "జీవితంలో ముఖ్యమైనది "జీవించటం" అని అర్థమైంది. నేను బయటకెళ్ళి సరికొత్తగా "జీవిస్తా" అన్నాను. ◆

# అగాధంలో భారత ఆరోగ్య వ్యవస్థ



- ప్రభాత్ పట్నాయక్

భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ చిక్కుకున్న సంక్షోభాన్ని వివరించడానికి డి.డి.కౌశాంబి తరచూ ఒక ఉదాహరణ చెప్పేవారు. 1761లో మూడో పానిపట్టు యుద్ధంలో ఒకవైపున ఉన్న సైన్యాలకి తిండి లేదు. రెండో వైపున ఉన్న సైన్యాలు తమ ఆకలిని తీర్చుకోవడం కోసం చుట్టుపక్కల ఉండే గ్రామాలను లూటీ చేసేవి. మొత్తానికి ఇరువైపులా తమ సైన్యాలకు కావలసిన ఆహారాన్ని ఏర్పాటు చేసుకోలేదన్నమాట. అదే విధంగా ప్రస్తుతం భారత దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎటువంటి సంక్షోభంలో ఇరుక్కుని వుందో చెప్పడానికి ఒక్క దృష్టాంతం చాలు. ఇంత భయంకరమైన మహమ్మారితో ఒక పక్కన పోరాటం జరుగుతూ వుంటే దేశ రాజధాని లోని అనేక ఆస్పత్రుల్లో పని చేసే వైద్య సిబ్బందికి కొన్ని నెలలుగా మామూలుగా అందవలసిన జీతాలు కూడా ముట్టలేదు. అయితే ఈ ఉదంతం మన ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని మాత్రమే కాకుండా భారతదేశ పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణ స్వభావాన్ని కూడా వెల్లడి చేస్తోంది. దీన్ని చూడాలంటే మనం కొద్దికాలం వెనక్కి వెళ్ళాలి.

ఈ కోవిడ్-19 మహమ్మారి రాక మునుపే, ఇంకా ఆర్థిక సంక్షోభం మన మీద తన ప్రభావాన్ని చూపక మునుపే, మన దేశంలో ఒక వైద్య ఆరోగ్య వ్యవస్థ ఉంది. నిస్సందేహంగా అది ప్రపంచంలోనే అతి చెత్త వ్యవస్థల్లో ఒకటి. మన దేశం ఒక ఆర్థిక సూపర్ పవర్ గా ఆవిర్భవిస్తోందంటూ పాలకులు హడావుడిగా ప్రచారం చేసుకొంటోన్న కాలంలోనే మన ఆరోగ్య వ్యవస్థ పరిస్థితి అలా ఉండేది. మన జిడిపిలో ఎంత శాతం ఆరోగ్యం మీద ఖర్చు చేస్తున్నామనేది ఒక కొలబద్దగా ఉంటుంది. ఆ లెక్కలను ప్రభుత్వం ఏనాడూ స్పష్టంగా ప్రకటించదు కాని ప్రపంచబ్యాంకు కొన్ని వివరాలను ప్రకటించింది. ఆరోగ్యం మీద ప్రభుత్వం వైపు నుంచి పెట్టే ఖర్చు, ప్రజలు తమ జేబుల్లోంచి పెట్టే ఖర్చు కలిపితే అది 2017లో మన దేశంలో మన జిడిపిలో 3.53 శాతం మాత్రమే. అదే సబ్-సహారన్ ఆఫ్రికాలో 5.18 శాతం. ఆ ప్రాంత దేశాలు మన కన్నా ఆర్థికంగా ఎంతో వెనకబడి వున్నాయి. వాటిలోకెల్లా కాస్త అభివృద్ధి చెందిన దేశం దక్షిణాఫ్రికా. ఆ దేశాన్ని మినహాయించి తక్కిన దేశాలలో ఆరోగ్యం మీద పెట్టిన ఖర్చుతో పోల్చి చూసినా మనం పెడుతున్నది తక్కువే. ప్రపంచబ్యాంకు ఉన్నతాదాయ దేశాలు, మధ్య స్థాయి ఆదాయ దేశాలు, అల్పాదాయ దేశాలు అంటూ ప్రపంచ దేశాలను వర్గీకరించింది. ఆ ప్రకారం ఉన్నతాదాయ దేశాలు ఆరోగ్యం మీద తమ జిడిపిలో 12.53 శాతం ఖర్చు చేస్తుంటే, మధ్య స్థాయి ఆదాయ దేశాలు 5.39, అల్పాదాయ దేశాలు 5.24 శాతం చొప్పున ఖర్చు చేస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే గణాంకాలు ఇక్కడి వాస్తవ పరిస్థితిని తెలియజెప్పడంలో కొన్ని తేడాలు వుండవచ్చు. కాని, ఒక విషయం మాత్రం స్పష్టం. మన దేశం ఆరోగ్యం మీద పెట్టే ఖర్చు మన జిడిపితో పోల్చితే అది ప్రపంచ దేశాల స్థాయిలో అతి దిగువన ఉంది. దక్షిణాసియా దేశాలన్నీ కలిపితే ఈ శాతం 3.46 ఉంది.

దీనికి ప్రధాన కారణం ఆ దేశాలలో మన జనాభాదే పెద్ద భాగం. దానికి తోడు బంగ్లాదేశ్, పాకిస్తాన్ మనకన్నా దిగువన ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో మందుల ధరలు అక్కడి విధానం ప్రకారం తక్కిన దేశాలకన్నా చాలా తక్కువగా ఉన్నాయి. అందువలన అక్కడ పెట్టే ఖర్చూ తగ్గుతుంది. అందువలన ఆ దేశంలో వైద్య వ్యవస్థ పరిస్థితి మన కన్నా అధ్వాన్నంగా ఉందన్న నిర్ధారణకు రాలేము. క్యూబాలో ఆరోగ్యంపై పెట్టే ఖర్చు అక్కడి జిడిపిలో 11.74 శాతం. ఆ దేశం సంపన్న దేశం కాకపోయినా అధికాదాయ దేశాల స్థాయితో సమానంగా ఆరోగ్యం మీద ఖర్చు చేస్తోంది. బ్రిటన్ (9.63), జర్మనీ (11.25), ఫ్రాన్స్ (11.31) వంటి సంపన్న దేశాలు సైతం క్యూబా కన్నా వెనకబడే ఉన్నాయి. ఒక్క అమెరికా మాత్రం 17.06 శాతం ఖర్చు చేస్తోంది. ఎంత ఖర్చు చేస్తే మాత్రం ఏం ఉపయోగం? అమెరికాలో ఆరోగ్య వ్యవస్థ తీరు బాగులేదని, ప్రధానంగా ఆరోగ్య బీమా ద్వారా మాత్రమే అక్కడ వైద్యం అమలు జరుగుతోందని, అటు ఆస్పత్రులూ ఇటు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలూ విచ్చలవిడిగా దోచేస్తున్నాయని అందరూ చెప్పుకుంటారు. అదే క్యూబాలో గాని, యూరోపియన్ దేశాలలో గాని ప్రభుత్వమే ప్రధానంగా బాధ్యత వహిస్తుంది. ఇక్కడ మొత్తం ఖర్చును కొలబద్దగా పెట్టుకోవడం కొంత తప్పుదోవ పట్టించవచ్చు. మొత్తం ఖర్చులో ప్రైవేటు వైద్య సదుపాయాల కోసం చేసే ఖర్చు కూడా కలిసిపోయి వుంటుంది. ఆ ప్రైవేటు సంస్థలు లాభాల కోసం చార్జీలు విపరీతంగా వసూలు చేస్తాయి. అందువలన ఖర్చు ఎక్కువైనట్టు కనపడుతుంది. మన దేశంలో చాలామంది వైద్య అవసరాలకోసం అప్పులపాలై, ఆస్తులనూ అమ్ముకుంటున్నారు. ఆ విధంగా పేదరికంలోకి దిగజారుతున్నారు. కనుక వైద్యం కోసం ఖర్చులో ప్రైవేటు వైద్యం పాలు ఎంత అన్నది కూడా ఒక అంశం. మన దేశంలో పెరుగుతున్న రైతన్నల ఆత్మహత్యల వెనక రుణభారం పెరిగిపోవడం ప్రధాన కారణం. ఆ రుణాలు పెరగడానికి ఒక ముఖ్య కారణం వైద్యం ఖర్చు విపరీతంగా పెరగడం. నయా ఉదారవాద కాలంలో వైద్యం ఎక్కువగా ప్రైవేటు పరం కావడం వలన వైద్యం ఖర్చు బాగా పెరిగిపోయింది. ఈ కారణాలన్నిటిరీత్యా వైద్యం మీద జరిగే ఖర్చులో ప్రభుత్వం పెట్టే ఖర్చు ఆ దేశ జిడిపిలో ఎంత శాతమో లెక్కించి చూడడం ద్వారా ఆ దేశపు ఆరోగ్య వ్యవస్థ పరిస్థితిని అంచనా వేయడం మెరుగైన పద్ధతి అవుతుంది. ఆ లెక్కన చూస్తే మన దేశం పరిస్థితి ఇంకా అన్యాయంగా ఉంది. 2017-18లో మన ప్రభుత్వం వైద్యం కోసం చేసిన ఖర్చు మన జిడిపిలో కేవలం 1.17 శాతం! అదే యూరోపియన్ యూనియన్ దేశాలకు చూస్తే 7 శాతం. అత్యల్ప ఆదాయ దేశాల ఖర్చు మొత్తంగా చూస్తే 1.57 శాతం ఉంది. మన దేశంలో అంతకన్నా హీనంగా ఉంది. మన ప్రభుత్వం పెట్టే ఖర్చు శాతం పొరుగు దేశాలైన శ్రీలంక, భూటాన్, నేపాల్‌లతో పోల్చినా తక్కువగానే ఉంది. నిజానికి ప్రభుత్వం వైద్యంపై పెట్టే ఖర్చు ఒక దశాబ్దంగా ఆ ఒక్క శాతం చుట్టూ పరిమితం అయిపోయింది. 2004-5 లో 0.9 శాతం, 2010-11 నాటికి 1.1 శాతం, 2017-18 లో 1.17 శాతం, 2018-19లో 1.28 శాతం ఉంది. వాస్తవానికి మన జిడిపి ఎంత మోతాదులో వృద్ధి చెందుతూ వస్తుందో అదే మోతాదులో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరుగుతూ రావాలి. ఇలా ఆదాయం పెరిగినంత మాత్రాన ప్రభుత్వ నిర్వహణ వ్యయం, రక్షణ వ్యయం వంటివి అదే మోతాదులో పెరగనవసరం లేదు. అటువంటి ఖర్చులు స్థిరంగా ఉంటే అదనంగా పెరిగిన ఆదాయాన్ని వైద్యం, విద్య వంటి ఇతర పద్దుల మీద ఎక్కువగా ఖర్చు చేయవచ్చు. అలాగనుక పెంచితే జిడిపిలో వాటి శాతం కూడా పెరుగుతుంది. ప్రస్తుత నయా ఉదారవాద పాలనలో ఉపాధి కల్పన తగినంతగా లేదు. అందువలన ఉద్యోగాలున్న వారితో పోల్చుకున్నప్పుడు సాపేక్షంగా నిరుద్యోగుల శాతం పెరుగుతోంది. దీని పర్యవసానంగా ఉద్యోగుల జీతాల స్థాయి కనీస వేతనాల స్థాయి వద్దనే నిలిచిపోయింది తప్ప జిడిపి పెరిగినా ఆ మేరకు పెరగడం లేదు. అంతకంతకూ కార్మికుల స్థితిగతులు దిగజారిపోతున్నాయి. ఆదాయాల్లో వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. ఇలా పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నప్పుడు ప్రభుత్వం మరింతగా ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు పెంచాలని ఎవరైనా కోరుకుంటారు. కాని మన దేశంలో దానికి పూర్తి రివర్స్‌లో జరుగుతోంది. అంతకంతకూ ప్రభుత్వం ప్రజారోగ్యం పైన చేసే ఖర్చు తగ్గిస్తోంది.

భారత దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం జుగుప్సాకరంగా ఉంది. వ్యవస్థ వలన పెరుగుతున్న పీడనను, పేదరికాన్ని ఎంతోకొంత మేరకు తగ్గించి ఉపశమనం కలిగించే బదులు దానిని మరింత పెంచుతున్నది. ప్రభుత్వ వైద్యసేవలలో ఉన్న ఉద్యోగుల జీతాలను కూడా చెల్లించకుండా నిలిపివేయడం ఈ జుగుప్సాకర స్వభావానికి అద్దం పడుతోంది. ◆

## కవిత

# పునర్నిర్మించుకుందాం..!

కరోనా కవిత

బి. కళాగోపాల్
9441631029

అవును దిద్దుకుందాం..
ఇన్నాళ్ల తప్పులన్నీ
బతుకు పలక మీద పరిశుభ్రంగా చెరిపేసి
మళ్ళీ దిద్దుకుందాం..!
విశ్వవిజేత అని విర్రవీగే మానవుడి నడ్డి విరిచి
వెన్నెముక లేకుండా చేస్తున్న పురుగు యుద్ధంలో
ఇప్పుడిక చావో రేవో తేల్చుకుందాం
బయోవార్ నేపథ్యంలో దేశదేశాలను స్వాహా చేసి
శవాల దిబ్బగా మార్చేస్తున్న వైరస్ దెబ్బకు
ఇంటికప్పే ఆశ్రయమైన వైనం కథలు కథలుగా
భవిష్యత్ తరాలకు చెప్పుకుందాం
హాట్ స్పాట్లు, రెడ్ జోన్లు గా చీలిన దేశంలో
ఐసోలేషన్, క్వారంటైన్ అంటున్న నయా జీవనవిధానాన్ని
నేడు ఒకింత జాగరూకతతో గమనిద్దాం
ఇల్లంతా అమరిన ట్రంకుపెట్టె తలకెక్కగా
ఊరు పిలుస్తుంటే.. దేశం శత్రువై ఊపిరి తీస్తుంటే..
రామన్న గోసగా సాగుతున్న వలసకాళ్ళ పాదయాత్రను
విడమరిచి మరీ చెప్పుకుందాం
ఒకప్పుడు మన కడుపులు నింపిన బడుగు జీవులు
గిన్నెల చమక్కుల్లో చందమామలై మెరిసినోళ్ళు
నేడు పిడికెడు బియ్యం, నిత్యవసరాల కోసం
చాంతాడంత క్యూలైన్లలో నిరీక్షిస్తున్న దురదృష్టాన్ని
కళ్ళకు కట్టినట్లుగా చరిత్ర పుటల్లో లిఖించుకుందాం
నాలుగు గుంజలు లేని ఒంటినిట్టాడి బ్రతుకు చిత్రంలో
సామాజిక దూరం భారమైన మురికివాడల మృత్యుగీతాలు
అలుపు లేని టీవీ తెర అంకెల్లో ఆగమాగమవుతుంటే
రెండు కన్నీటి బొట్లతో శ్రద్ధాంజలి ఘటిద్దాం
కేంద్రకమే లేని వైరస్‌తో చేసే యుద్ధంలో
అమరులవుతున్న తెల్లకోటు వీరులు
బ్రతికొచ్చిన నైటింగేల్లా సేవలు చేస్తున్న నర్సమ్మలు
అనుక్షణం దండనతో ఆకతాయిలను దిద్దుతున్న
పోలీసుల కరకు లాఠీల నృత్యాన్ని
లాక్ డౌన్ కాని కంటిరెటీనాలో భద్రంగా
రికార్డ్ చేసుకుందాం
వసుదైక కుటుంబ భావనకు చెల్లుచీటీ పలికిన
కరోనా ముందు.. వెనుకలుగా విడిపోయిన
కాలవిభజన శకాలను మళ్ళీ సరిదిద్దుకొందాం
నేడు మనిషి చేతులే కాదు.. చేతల్ని శుభ్రపరుచుకుంటూ..
ముసుగు తొడగని మానవత్వంతో చెప్పని కథగా
మిగిలిపోతున్న కరోనా కన్నీటి వ్యథ మాటున
చెదిరిపోయిన బ్రతుకు గూటిని పునర్నిర్మించుకుందాం..!! ♦

---

## నానీలు

- ముట్నూరు బాలసుబ్రహ్మణ్యం
9440745728

శాంతికపోతం
ఎగరకుండా చెరో రెక్క
లాగుతున్నాయి
ఇరుదేశాలు!

పట్టాలెక్కనున్న
ప్రైవేటు రైళ్లు!
ఏ రంగాన్నీ
వదలలేదు వీళ్ళు!!

ఫెయిర్ అండ్ లవ్లీ
పేరు మార్చుకుంది.
ముఖం రంగును
మారుస్తుందో? లేదో?

మండడం పెట్రోల్
స్వభావమైతే,
ధరలను మండించడం
పాలకుల స్వభావం!

వృద్ధాశ్రమం
ముస్తాబైంది!
నేడు తల్లిదండ్రుల
దినోత్సవం!!

ఆన్ లైన్ పాఠాలు
చేతిలో సుద్దముక్క
జారిపోయినట్టు
రాత్రి కల!

పిల్లల్ని చేర్పిస్తేనే
ఉపాధ్యాయుని
మనుగడ
ప్రై'వేటు' వ్యాపారం!

అరగక ఒకడు!
జరగక ఒకడు!!
నడుస్తున్నారు
ఎవరి త్రోవల్లో వారు!

ఆరోహణ,
అవరోహణలు
ఇటు సంగీతంలో
అటు జీవితంలో! ♦

# సహృదయ సాహితీ మిత్రుడు



*2019లో విశాఖపట్నంలో జరిగిన కందుకూరి శతవర్ధంతి సభలో మాట్లాడుతున్న నూనెల శ్రీనివాసరావు*

- ఏ. వి. రమణారావు
9848710507

ఈ నెల 23న ఉదయాన్నే మిత్రులు స్వతంత్రకుమార్ గారి నుండి మెసేజ్. 'మన మిత్రుడు నూనెల శ్రీనివాస్ రాత్రి (22.07.2020) కె.జి.హెచ్ లో కోవిడ్ వలన మరణించాడు' అని. నిశ్చేష్టుడనయ్యాను. నమ్మబుద్ధికాలేదు. తేరుకుని స్వతంత్రకుమార్ గారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నాను. ఆశచావక మా ఇద్దరికీ మిత్రుడు, పోర్ట్ ఉద్యోగి యూనియన్ నాయకుడు సత్యనారాయణకు ఫోన్ చేసాను. అతను మరిన్ని వివరాలతో శ్రీనివాస్ మరణాన్ని ధ్రువపరిచాడు. విషయాలను వాస్తవదృష్టితో స్వీకరించే నేను శ్రీనివాసు మరణాన్ని అలా తీసుకోలేక పోయాను. మా సాహితీ మిత్రురాలు యెల్లాప్రగడ రమాదేవి గారు తెల్ల వారుఝామున 3గంలకే ఈ వార్త పంపారు వాట్సాప్ లో. అది తరువాత చూశాను. సాహితి మిత్రుల ఫోనులు మొదలయ్యాయి. మా మిత్రుడు, సాహితీస్రవంతి విశాఖ కమిటీ సభ్యుడు, పోర్టులో శ్రీనివాస్ సహఉద్యోగి, శివకోటి నాగరాజు ఉదయాన్నే డ్యూటీలో చేరగానే వార్త తెలిసి వీరప్రసాద్ గారికి, రఘుబాబుగారికి తెలియచేసాడు. నాకు చేశాడట కానీ నా ఫోను అందలేదు.

మిత్రులందరికి ఇది ఒక షాకే. వీరప్రసాద్ గారు, పెద్దలు తెలకపల్లి రవి గారు, దివాకర్ ఫోన్ చేశారు. రవిగారు విషయాన్ని తెలుసుకోవడమే గాకుండా శ్రీనివాసుతో మాకున్న సాహితీ అనుబంధాన్ని వివరంగా ప్రస్తావించారు. రఘుబాబు సందేశాన్ని, శ్రీనివాస్ కవితని పంపించారు. నాకన్నా 10 ఏళ్లు చిన్నవాడు, ఎంతో భవిష్యత్తు ఉన్నవాడు, శ్రీనివాస్ గురించి నేను శ్రద్ధాంజలి రాయాల్సిరావడం అత్యంత విషాదకరం.

విశాఖలో సాహితీస్రవంతి బాధ్యతలను చూస్తున్న జి.వి.ఎన్.చలపతి గారు వేరే ఇతర బాధ్యతలకు వెళ్లడంవలన నేను ఆ బాధ్యత స్వీకరించాను. ఎల్.ఐ.సి.యూనియన్ నాయకులు ఎన్.రమణాచలం గారు, ఎన్.వి.ఎన్.స్వామి గారు నేను కార్యక్రమాలు ప్రారంభించాము. మాకు నూనెల శ్రీనివాస్ తోడయ్యాడు. స్వయంగా కవి, పాటల రచయిత శ్రీనివాసు మా బృందంలో చేరడంతో ఎంతో సంతోషించాము. మేమంతా సాహిత్యాభిమానులమే కానీ అతనిలా కవులము కాము. సౌమ్యుడు, మితభాషి. కొద్ది సమయంలోనే తన సహోద్యోగి శివకోటి నాగరాజును బృందంలో చేర్చాడు. రమణాచలంగారు గౌరవాధ్యక్షులుగా, నేను అధ్యక్షునిగా, శ్రీనివాస్ కార్యదర్శిగా సాహితీస్రవంతి విశాఖ శాఖ పనిచేయడం ప్రారంభించింది. ఇద్దరం సమన్వయంతో, మిత్రుల సహకారంతో సాహిత్య సభలు గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నాము.

ప్రతీసంవత్సరం కవిసమ్మేళనాలు, మహకవులు శ్రీశ్రీ, గురజాడ, జాషువాల జయంతి, వర్ధంతి సభలు నిర్వహిస్తూ ఉండేవాళ్లం. 2015 ఏప్రిల్‌లో విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరి లో "జనకవనం" ను పెద్దయెత్తున నిర్వహించడంలో శ్రీనివాస్ ముఖ్యపాత్ర వహించాడు. అధికసంఖ్యలో హాజరైన కవులకు భోజనాలు వడ్డించడం శక్తికి మించినపని అయింది. శ్రీనివాస్ వెంటనే తన మేనల్లుళ్ళనిద్దరిని రప్పించి ఆదుకున్నాడు. సభకి వచ్చిన మా నాగరాజు వాళ్ల మావయ్యగారు కూడా సహాయపడ్డారు. 10రోజులపాటు ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వైజాగ్ ఫెస్ట్ 2015 లో అన్నిరోజులూ "గురజాడ సాహిత్యవేదిక" పేరిట కవిసమ్మేళనాలు, సాహిత్యప్రసంగాలు నిర్వహించాము. ఈ

ఫెస్ట్ లో సాహితీస్రవంతి బుక్ స్టాల్ నిర్వహణకు కూడా శ్రీనివాస్ తోడ్పడ్డాడు. స్టాల్ నిర్వహణ బాధ్యతను 10రోజులూ అత్యంత శ్రద్ధతో నిర్వహించిన సాహితీమిత్రురాలు కృష్ణవేణి గారికి సహాయం చేయడానికి తన సోదరిని శ్రీనివాస్ తీసుకొచ్చేవాడు.

"జనకవనం" లో ఎంపికైన కవితలతో వచ్చిన "చైతన్య స్వరాలు" సంచిక ఆవిష్కరణ సభ, ఆ సంధర్భముగా నిర్వహించిన కవితల రచనపై "వర్క్ షాప్" మేము నిర్వహించిన పూర్తిరోజు పెద్ద కార్యక్రమం. ఇది కూడా విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరిలోనే నిర్వహించాము. సుమారు 125 మంది కవులు ప్రవేశ రుసుము చెల్లించి పూర్తిరోజు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమయం మించిపోయి హాలు ఖాళీ చేయాల్సివచ్చినా ఆరుబయట కూడా సభ జరగడం ఒక విశేషం. మిత్రుడు దివాకర్ సభలు విజయవంతం అవడానికి తోడ్పడ్డారు. శ్రీనివాసు, నేను, నాగరాజు మేము శక్తిమేరకు ఏర్పాట్లు చేశాము.

ఇదే సంవత్సరం (2015) నవంబరులో "మహాకవి గురజాడ" శతవర్ధంతిని శతాధిక సంస్థల ఆధ్వర్యంలో పెద్ద కార్యక్రమాన్ని తలపెట్టాము. అప్పటికి ఎమ్మెల్సీగా ఉన్న ఎం.వి.ఎస్.శర్మ గారి ఆధ్వర్యంలో ఒక నిర్వహణ కమిటీ ఏర్పరచి ఏర్పాట్లు చేశాము. ప్రజాసంఘాల ఆధ్వర్యములో నవంబరు 28న ఆంధ్రా యూనివర్శిటీ, అసెంబ్లీ హాల్ లో పూర్తిరోజు కార్యక్రమం విజయవంతముగా జరిగింది. సహజంగానే శ్రీనివాసుది ఇందులో సముచితపాత్ర. జూన్ 16, 2016 న విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరిలో సాహితీస్రవంతి నిర్వహించిన "విశాఖ కాలుష్యంపై కవితాభేరి" విజయవంతం చేయడంలో మా నూనెల శ్రీనివాస్ ది కీలక పాత్ర. ఈ కార్యక్రమం సాహితీస్రవంతి కి మంచి పేరు తెచ్చింది. ఆ సందర్భంగానే కవయిత్రి వైష్ణవిశ్రీ పరిచయం అయ్యారు. అప్పటినుండి ఆమెకు శ్రీనివాసు సోదరసమానుడై కవితల రచనలో ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చేవాడు. ఈ విషయాన్ని శ్రీనివాసు మరణం వార్త తెలిసిన వైష్ణవిశ్రీ గారు ఎంతో వేదనతో ఫేస్బుక్ లో పంచుకున్నారు.

2017 డిసెంబరు 1– 10 వరకు ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ లో మరలా వైజాగ్ ఫెస్ట్ జరిగింది. గురజాడ సాహిత్య వేదిక నేర్పరచి పది రోజులూ సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడంలో, ఆ సందర్భంగా నిర్వహించిన "కవితలపోటీ" కి వచ్చిన కవితల ఎంపికలోను నూనెల శ్రీనివాసు తన పాత్రను సముచితముగా నిర్వహించాడు. వైజాగ్ ఫెస్ట్ కమిటీ సహాయముతో, ఎంపిక చేసిన కవితలతో "కవితాకెరటాలు" అనే సంపుటిని జూలై, 2018లో వెలువరించాము.

ఏ కార్యక్రమం తలపెట్టినా వెంటనే అంగీకారం తెలిపి తన భాగాన్ని చిత్తశుద్ధితో నిర్వహించేవాడు. అంశాన్ని ఎంచుకోవడం, వక్తలను నిర్ణయించుకోవడం, సాహితీ మిత్రులను ఆహ్వానించడం, బేనర్ వ్రాయించడం, హాల్ ఏర్పాట్లు, అన్నిటిని పంచుకుని నిర్వర్తించేవాళ్లం. ఏ పని చెప్పినా వెంటనే అందుకునే మిత్రుడు నాగరాజు కూడా మాకు తోడయ్యేవాడు. గత ఏడాదికి పైగా గాజువాక లో సొంత ఇల్లు నిర్మాణములో మునిగి సాహిత్య వ్యాసంగంలో కాస్త వెనుకబడ్డాడు. అయిన గత ఏడాది సాహితి స్రవంతి నిర్వర్తించిన కార్యక్రమాలలో వెసులుబాటు చేసుకుని పాల్గొన్నాడు. జనవరి 31,2019న ప్రముఖ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన "శ్రమకావ్యం" ను ఆవిష్కరించుకున్నాం. ఏ కార్యక్రమమైనా అయిన వెంటనే ఇంటికి చేరగానే నాకు ఫోన్ చేసి తన సంతోషాన్ని వంచుకోవడం "చాలా బాగా జరిగింది కదండీ" అని పొంగిపోవడం అతని నైజం. గత పార్లమెంట్ ఎన్నికలముందు వైజాగ్ ఫెస్ట్ సహకారంతో "వోటు విలువ" పై కవిసమ్మేళనం నిర్వహించి మంచి కవితలను రాబట్టాము. ఈ సంధర్భంగా సాహితీవేత్త రామతీర్థగారిని కూడా సన్మానించాము. ఇది శ్రీనివాసు ప్రతిపాదనే.

ప్రజాసంఘాల సహకారంతో జూన్ 5,2019న కందుకూరి వీరేశలింగం గారి శతవర్ధంతి సభ కళాభారతిలో పూర్తిరోజు విజయవంతంగా నిర్వహించేము. తన ఇంటిపని వొత్తిడిలోకూడా సభ జయప్రదం కొరకు నిధుల సేకరణకు శ్రీనివాసు మంచికృషి చేశాడు. దీని తరువాత జూన్ 15, 2019 న నిర్వహించిన మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ ఊహించినదానికన్నా జయప్రదం అవడాన్ని పలుమార్లు శ్రీనివాసు ప్రస్తావించేవాడు. అదే మేమిద్దరం నిర్వహించిన ఆఖరి సాహిత్యసభ. సాహితీస్రవంతి రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు ప్రకారం ఈ సంవత్సరం మహాకవి శ్రీశ్రీ 110 వ జయంతి సభను 26.4.2020 బాగా నిర్వహించాలనుకున్నాము. ఈ కార్యక్రమం ఎలా జయప్రదం

## నివాళి కవిత



### జోహార్....

- సందీప్ రుద్రాక్షుల
94941394101

కాగితమై ఎగిరిపోయారా కామ్రేడ్
కల్మషమంటని ప్రకృతి పొరల్లోకి

కవిత్వంతో నిండిన మీ చివరి పేజీని
నే చదవనే లేదు...
పుస్తకంలో మొదటిపేజి చిరిగి ఎగిరి
పోయిందని గమనిగ్రాంతిలో
దిగులుగా
కూర్చుండిపోయాను...
కళ్ళలో గిర్రున సుడిగుండాలు
గుండంతా ఎండమావులు

నిన్నటి మన రోజులన్ని
చక్రంలో ఊసల్లా, ఊసుల్లా
ఒకదాని తరవాత ఒకటి
గుర్తులుగా కదిలిస్తున్నాయ్
నిన్నే కదా ఆ రైలు బండిలో
కిటికీలంచున కూర్చొని
ఒకరి గురించొకరం తెలుసుకున్నాం
మొన్నే కదా కవిసమ్మేళనంలో
కలుసుకున్నాం

ఎన్నో నిన్నలు, మరెన్నో మొన్నలు
అన్నింటా మీ తియ్యని మాటలు
సాహిత్యానికి మీరు చేసిన సేవ
ఇవే కనపడుతున్నాయిప్పుడు

విశాఖ సాహితీ లోకం ఇకనుండి
ఏదో వెలితిగానే ఉంటుంది
మీ కలం, మీ పాటల గళం
అభ్యుదయ అంబరంగా
వెలుగుతూనే ఉంటుంది

మీ కలంలోని అక్షరాల భావాలు
స్ఫూర్తిని నిండా నింపుకున్నవాడనై
ఇదిగో అందుకోండి నా నివాళి
జోహార్ శ్రీనివాసరావు జోహార్
జోహార్....

జోహార్.... శ్రీనివాసరావు
జోహార్ జోహార్.... ♦

---

చేయాలి, అలాగే మార్చ్15 న విజయవాడలో "భారత కవనం" సదస్సుకు ఎవరిని కదిలించాలి అన్న అంశాలను చర్చించేందుకు ఫిబ్రవరి27న కంచరపాలెంలో ఉన్న "బొట్టా నరసింగరావు భవన్"లో సమావేశమయ్యాం. అదే మేము ఆఖరి సారి కలుసుకోవడం. అదే శాశ్వతమవుతుందని కలలోకూడా ఊహించలేదు.

కరోనా విలయం పై కవితల పోటీ నిర్వహించాలని ఇద్దరం భావించి విశాఖ సాహితి మిత్రులకు పిలుపునిచ్చాము. ఆ పోటీకి కవితలను సేకరించడంకోసం చాలా మంది కవులకు శ్రీనివాసు పలుమార్లు ఫోన్లు చేసి వెంటబడ్డాడు. సుమారు 25 కి పైగా కవితలు వచ్చాయి. సభ జరిపి బహుమతులు ఇద్దామనుకున్నా కరోనా వలన సాధ్యపడలేదు.

తాను ఏ కవిత వ్రాసినా ముందు నాకు పంపి చూడమనే వాడు. సవరణలు చేయమనేవాడు. నేను ఏ సవరణను సూచించినా భేషజం లేకుండా అంగీకరించేవాడు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం వలన తన తెలుగులో కొన్ని అక్షరదోషాలుంటాయని వాటిని పరిష్కరించమని అడిగేవాడు. కవితలను వచనాలుగా వ్రాస్తున్నా ఎంతో భేషజం చూపే కవులు తయారైన నేడు, తాను మంచి కవిత్వం వ్రాస్తూ కూడా ఏ మాత్రం భేషజం లేకుండా, నమ్రతగా మెలగడం శ్రీనివాసు ప్రత్యేకత. కరోనా విలయం పైన కూడా మంచి కవితలను వ్రాశాడు. తన సహాధ్యాయులకోసం వాటిని ఇటీవల ఇంగ్లిష్ లోనికి తర్జుమా కూడా చేయడం ప్రారంభించాడు. అతని ఇంగ్లిష్ కూడా బాగానే ఉండేది. ఇతర యువ కవులను ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేసే వాడు. ఆ విధంగానే మిత్రురాలు, కవయిత్రి ఉండవిల్లి సుజాతమూర్తి, యువకవి సందీప్ రుద్రక్షుల మా బృందంలో సభ్యులు అయ్యారు.

మహమ్మారి అంతమవగానే విశాఖలో సాహితీస్రవంతి కమిటీని పునర్నిర్మించుకోవాలని, వాయిదా పడిన మహాకవి శ్రీశ్రీ 110వ జయంతిని ఘనంగా జరపాలని ఇద్దరం ఫోన్లో చర్చించుకునేవాళ్లం. కానీ ఇంతలోనే ఆ మహమ్మారి శ్రీనివాసును బలితీసుకోవడం నాకు వ్యక్తిగతంగాను, సాహితిస్రవంతికి, విశాఖ సాహితీ లోకానికి పూడ్చలేని లోటు.

సాహితీస్రవంతి, విశాఖశాఖకు కూడా శ్రీనివాసు లేకుండా పనిచేయడం పెద్దయెత్తున్నమే. అయినా పరిస్థితులు చక్కబడగానే మా యత్నాలను ముమ్మరం చేయడమే అతనికి మేమిచ్చే సాహితీ నివాళి. ఆ సాహితీ సహచరుడికి నా శ్రద్ధాంజలి. అతని కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

**(అధ్యక్షుడు, సాహితీస్రవంతి, విశాఖ.)**

నివాళి

# కథా రచయిత బి పి కరుణాకర్ కన్ను మూత



- ప్రొ. ఎండ్లూరి సుధాకర్
8500192771

ప్రముఖ కథా రచయిత బి పి కరుణాకర్ (76) జూలై 20న హైదరాబాద్ బాచుపల్లి లోని SLG ఆసుపత్రి లో మరణించారు. అంతకుముందు మూడు రోజుల కింద నుంచి ఆయన ఊపిరి తీసుకోడంలో ఇబ్బంది పడుతున్నారు. ఆయన గుండె జబ్బుతో బాధ పడుతున్నారు. బై పాస్ సర్జరీ జరిగింది. ఈ మధ్యనే రెండు స్టంట్లు కూడా వేశారు. హఠాత్తుగా అనారోగ్యంపాలు కావడంతో చిన్న కూతురు ఆసుపత్రిలో చేరిపించారు. ఆయనను వెంటిలేటర్స్ మీద పెట్టారు. మృత్యువుతో తీవ్రంగా పోరాడి తుది శ్వాస విడిచారు.

బండారు ప్రసాద్ కరుణాకర్ గారికి ఇద్దరు కూతుళ్ళు. పెద్ద కూతురు అమెరికాలో ఉంటుంది, చిన్న కూతురు హైదరాబాద్ సంగారెడ్డిలో ఉంటుంది. ఆయన భార్య పేరు హేమలత, 23 ఏళ్ల కిందటే ఆవిడ కన్ను మూసింది. హైదరాబాద్‌లోని విద్యా నగర్ లోని అనురాగ్ సదన్ అపార్టమెంట్‌లో ఉండేవారు. కరోనా కారణంగా చిన్న కూతురు జోనా విజయ ప్రియ ఆయన బాగోగులు చూసుకోడానికి తండ్రిని తన ఇంట్లో పెట్టుకుంది. అంతా బావుంది అని అనుకున్న సమయంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. మూడు రోజుల కిందటే నేను ఆయనతో చాలా విషయాలు మాట్లాడాను. కరుణాకర్ మృదుస్వభావి, సరసుడు, సహృదయుడు. జీవితాన్ని తేలిగ్గా తీసుకునే మనస్తత్వం కలవాడు. కథలు రాయడంలోనే కాదు, స్నేహితులకి కథలు చెప్పడంలో కూడా నేర్పరి. మంచి హాస్య ప్రియుడు. BHEL లో పని చేసిన ఉన్నతాధికారి. వీరి తాతగారు A.C కిన్సింగర్, గుంటూరులోని లూథరన్ క్రైస్తవ నాయకులలో ఒకరు, గొప్ప గీత రచయిత.

“ఏసుతో ఠీవి గాను పోదమా! అడ్డుగా వచ్చు వైరి గెల్వను” లాంటి కీర్తనలు ఆయన రచించారు. ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంథంలో ఆయన పాటలు లభిస్తాయి.

కరుణాకర్ అమెరికాలో ఉండే పెద్దమ్మాయి జయశ్రీ మనోరమ దగ్గరికి వెళ్లొచ్చినప్పుడల్లా సెంట్ సీసాలతోనూ, షివాస్ రీగల్స్ తోనూ, కొత్త ఇంగ్లీషు కథా సంపుటాలతోనూ వచ్చేవాడు. వాటిని మిత్రులతో ఆత్మీయంగా పంచుకునే వాడు. చిన్న కథ రాయడంలో కరుణాకర్ ది అందె వేసిన చేయి. ఆయన కథల్లోని కొసమెరుపు చివరి దాకా ఉత్కంఠను కలిగిస్తుంది. ఓ హెన్రీ, గైడీ మపాసా, చలం, బుచ్చి బాబులంటే ఇష్టపడే వాడు. ‘అంబాలిస్’, ‘నిర్నిమిత్తం’, ‘రెల్లు’, ‘డియర్’ వంటి కథా సంపుటాలను తీసుకొచ్చారు. ఆయన కథలు హిందీ లోనూ, ఇంగ్లీషులోనూ కన్నడ భాషల్లోనూ అనువాదాలు అయ్యాయి.

ఆయన కథల మీద నా పర్యవేక్షణలోనూ, ప్రొ. జి. యోహాన్ బాబు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, మరికొందరి నేతృత్వంలోనూ పరిశోధనలు జరిగాయి. విశేషమేమిటంటే సుప్రసిద్ధ కథా రచయిత ప్రొ. కొలకలూరి ఇనాక్, ఏసీ కాలేజ్ లో ట్యూటర్ గా ఉన్నప్పుడు కరుణాకర్ ఆయన విద్యార్థి. ఎందరో మిత్రుల్ని కుటుంబ బంధువుల్ని ఒంటరి వాళ్ళని చేసి కరుణాకర్ వెళ్లిపోయాడు. ఆయన చిన్న కథలు సంపాదించి చదవడమే ఆయనకి మనమిచ్చే పెద్ద నివాళి. ◆

## నివాళి

# ప్రముఖ రచయిత ఎం.డి. సౌజన్య ఇకలేరు




ప్రముఖ రచయిత ఎం.డి. సౌజన్య (76) జూలై22న తుదిశ్వాస విడిచారు. ఆయన అసలు పేరు మహమ్మద్ నఫీజుద్దీన్. ఎం.డి.సౌజన్య కలం పేరుతో సాహితీప్రపంచానికి వీరు చిరపరిచితులు. గుంటూరు జిల్లా తెనాలి కి చెందిన వీరు మే 25, 1945న జన్మించారు. భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెనాలిలో వి.ఎస్.ఆర్ అండ్ ఎన్.వి.ఆర్. కళాశాల ఆంగ్ల శాఖాధిపతిగా, వైస్-ప్రిన్సిపాల్ పనిచేసారు. 'కనకపు సింహాసనం', 'ధర్మ సంరక్షణార్థం', 'దేవుడూ నీకు దిక్కెవరు', 'శుత్రుశేషం', 'పరిహారం', 'కళ్ళు తెరవండి', 'దేశం కోసం', 'గురుదేవోభవ', 'అల్లిబిల్లి అప్పారావు' తదితర నాటకాలు కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడే రాసారు. ఆ కళాశాలలోనే విద్యార్థిగా ఉంటూ ప్రముఖ హాస్యనటుడు ఏ.వి.ఎస్ వీరి నాటకాలలో నటించి అనేక బహుమతులు పొందారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, స్వాతి, ఆంధ్రప్రభ వంటి ప్రముఖ వారపత్రికలలో వీరి అనేక నవలలు ప్రచురితమైనాయి. విముక్తి, విధి విన్యాసాలు, కావ్యనాయిక, స్వప్న తరంగాలు, కలలు అలలు, ఈ చరిత్ర ఎవరు వ్రాస్తారో, ఆపదలో అనురాధ, జాదూనగర్, మృత్యులోయ, క్షణక్షణం మృత్యు నీడలో, ఈ నేరం ఎవరిది, మాయాబజార్, ఓ నటి కథ, బలికోరిన ప్రేమ, మరో ధరిత్రి, త్రికాల్ తదితర 20 నవలలకు పైగా రాసారు. వీటిలో స్వప్న తరంగాలు, ఓ నటి కథ, ఈ చరిత్ర ఎవరు వ్రాస్తారో నవలలు కన్నడ, హిందీ భాషల్లోకి అనువాదం అయ్యాయి.

విద్యార్థుల కోసం వ్యాససుధ, నమ్మలేని నిజాలు, చరిత్ర పురుషులు, చారిత్రక ఘట్టాలు, ప్రపంచ అద్భుతాలు, రాబిన్‌సన్ క్రూసో అనువాద గ్రంథం, బాలల జానపద నవల రాక్షస ద్వీపం, ఇంగ్లీషు వ్యాకరణ పుస్తకాలు వంటివి రాశారు. ప్రముఖుల వ్యాసాలు, నవరసాల తెలుగు హాస్యం, హాస్యవల్లరి, మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు, దాదాపు 20 ఆంగ్ల వ్యాకరణ గ్రంథాలు రాశారు. చందమామ, బాలజ్యోతి, బాలమిత్ర, బాలభారతి, బొమ్మరిల్లు వంటి బాలల పత్రికల్లో వందకు పైచిలుకు కథలు వీరివి ప్రచురించబడ్డాయి. 1970 దశకంలోనే నఫీజుద్దీన్ మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పాత్రల ద్వారా తన నవలల్లో ప్రస్తావించారు. లైంగిక వేధింపులు, ఫైనాన్స్ పేరుతో మహిళలను ఉచ్చులో ఇరికించటం, సినిమాలు, నాటకాలు పేరుతో లైంగికంగా వేధించటం, పేదరికంలో మగ్గుతున్న మహిళలను వృద్ధులకు ఇచ్చి పెళ్ళిచేయటం వంటి సమస్యలను నఫీజుద్దీన్ కథాంశాలుగా తీసుకొని నవలలు రాశారు.

## దసరా కథల పోటీ

దసరా సందర్భంగా పాలపిట్ట-జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో - దసరా కథల పోటీ- నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి- రూ. 10,000, రెండో బహుమతి- రూ. 5000, మూడో బహుమతి- 3000. ఒక్కొక్క కథకు వెయ్యి రూపాయల చొప్పున పది కథలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తారు. కథలకు పేజీల నిడివి లేదు. ఎన్ని పేజీలయినా, ఎన్ని పదాలయినా ఉండొచ్చు. ఇతివృత్తం రచయితల యిష్టం. ఎలాంటి షరతులు లేవు. కథ కథగా ఉండటమే ప్రధానం. తెలుగు కథకులు ఎక్కడి వారయినా ఈ పోటీలో పాల్గొనవచ్చు అని ఆ ప్రకటనలో తెలిపారు. కథలు పంపడానికి చివరి తేదీ 15 ఆగస్టు 2020. కథలను ఈమెయిల్‌లోనూ, పోస్టులోనూ పంపవచ్చు. చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్-500 036. ఇతర వివరాలకు 9848787284 ద్వారా సంప్రదించవచ్చును. ఈ మెయిల్స్: palapittamag@gmail.com, palapittabooks@gmail.com ◆

# స్వీకారం




## అస్మిత ట్రాన్స్‌జండర్లపై కథానికల సంకలనం


**సమన్విత కోవూరి ట్రస్టు ఐద్వా**

వెల : 200/- పేజీలు: 162

ప్రతులకు : 9490098620

ఈ కథలు ట్రాన్స్‌జండర్ సమస్యలను సానుకూలంగా చూపించడమే కాక వారి సమస్యలను అక్షరబద్ధం చేశాయి. సమస్య పరిష్కారం కోసం పలు సూచనలు, ఆలోచనలు కూడా ఈ కథలలో చోటుచేసుకున్నాయి. సమాజంలో హిజ్రాల ఎడల ఉన్న చులకన భావాన్ని పోగొట్టేందుకు ఖచ్చితంగా ఈ కథలు దోహదపడతాయి.

**- డి. రమాదేవి**





## కందుకూరి వీరేశలింగం సమకాలీన సమాజం

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

వెల : 20/- పేజీలు: 32

ప్రతులకు : 9490099059

కందుకూరి వీరేశలింగం 101 వ వర్ధంతి సందర్భంగా ప్రొ॥ కె. ఆశాజ్యోతి గారి ఆన్‌లైన్ ప్రసంగాన్ని ఐద్వా, సాహితీస్రవంతి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్, ఎం.బి. విజ్ఞానకేంద్రం నిర్వహించి పుస్తకంగా తెచ్చారు. కందుకూరి వీరేశలింగం జీవితం, సాహిత్యకృషి గురించి ఈ పుస్తకం ఒక మంచి అవగాహన ఇస్తుంది. ఈ తరం తప్పకుండా చదవ వలసిన పుస్తకం.




## లోచన

బహుజన వ్యాసాలు

**చల్లపల్లి స్వరూపరాణి**

వెల : 180/- పేజీలు: 184

ప్రతులకు: 9989265444

ఇవి వట్టి వ్యాసాలు కాదు. అవమానవీయంత నుంచి...అమానుషత్వం నుంచి.. దేవుళ్ల పేరు మీద జరిగే హింస నుంచి.. మతాల నుంచి.. సమానత్వం వైపు కరుణ వైపు మన చూపును ప్రసరింప చేసే జ్ఞానవంతమైన పరిమళాలివి.

**- షాజహానా**




## మొలకెత్తిన పిడికిళ్ళు కవిత్వం


**చౌశా**

వెల :100/- పేజీలు: 144

ప్రతులకు: 9490445484

కవికి సమాజం పట్ల అమితమైన ప్రేమ. ప్రజల బాధలు, కష్టాలు చూసి చలించిపోయే మనస్తత్వం. సమాజాన్ని ఈ వ్యవస్థను అపసవ్య దిశలో అస్తవ్యస్తంగా నడిపిస్తున్న కుహనా రాజకీయనాయకుల మీద, దుర్నీతి పాలకుల మీద కట్టలు తెంచుకునన ఆవేశం పొరలు పొరలుగా విస్తరించి కవిత్వమైంది. నిరంతరం సమాజంలో జరిగే ఘటనలే కవిత్వమై మనల్ని పలకరిస్తాయి.

**- కెంగార మోహన్**




## ప్రేమలహరి హాఫెజ్ కవిత్వం


**తెలుగు: జలజం సత్యనారాయణ**

వెల :200/- పేజీలు: 200

ప్రతులకు: 9490099378

హాఫెజ్ పండితులచే పామరులచే ఎంతో ప్రేమించబడిన కవి. అట్లాగే పర్షియాలో అగ్రశ్రేణి కవులందరిలో నమస్యాత్మకమైన కవి కూడా. ఇరాన్‌లో ప్రతి ఇంట్లో రెండు గ్రంథాలు తప్పకుండా వుంటాయి. అందులో ఒకటి ఖురాన్. రెండోది హాఫెజ్ దివాన్ (కలెక్టెడ్ పోయెమ్స్ ఆఫ్ హాఫెజ్). ఇరాన్ సాహిత్యంలో దివాన్ స్థానం శిఖరాయమానం. ఇది జాతీయ శాస్త్ర సంపద (నేషనల్ సెరిప్టైన్ గా గుర్తించబడుతున్నది. ఆనాటి నుంచి నేటి వరకు ఫిరదౌసికి కూడా పర్షియాలో ఇలాంటి జాతీయ గౌరవం లభించింది.

**- జలజం సత్యనారాయణ**




## ఒక్క క్షణం కథా సంపుటి


**కోపూరి పుష్పాదేవి**

వెల :100/- పేజీలు: 152

శ్రీమతి పుష్పాదేవి గారి కథనంలో అసలైన మెరుపు - నిరాడంబరత, ఆమె చెప్పే తీరులో సౌమ్యత, స్థిమితత్వం, వినయ స్పర్శ ఉంటాయి. ఆప్యాయంగా కళ్లల్లోకి చూస్తూ ఆర్ద్ర చిత్తంతో సంభాషిస్తున్నట్లు రాసుకుపోతారు. వీటివలన కథకి చదివించే గుణం పుష్కలంగా లభిస్తుంది. కథలన్నిటా ఆమె చిత్తశుద్ధీ, మానవీయ విలువల పరిరక్షణపట్ల నిబద్ధత కనిపిస్తాయి. వ్యక్తి చైతన్యాన్నీ, సమాజాభ్యుదయాన్నీ కాంక్షిస్తున్న ఆదర్శఫణితి కనిపిస్తుంది. ఇవన్నీ నిజానికి ఆమె ఉత్తమ వ్యక్తిత్వ ప్రతిఫలనాలే!

**- విహారి**

# స్వీకారం



## ప్రకృతి - వికృతి పిల్లల కథలు

**మూరిశెట్టి గోవిందు**

వెల : 100/- పేజీలు: 101

ప్రతులకు : 9502200749

ఈ పుస్తకంలో వున్న మంచి, మామూలు విషయాల గురించి మామూలు శైలిలో, నక్క మీదా, పూల మొక్క మీదా, చెట్టు మీదా, గుట్ట మీదా, కోడిపెట్ట మీదా - కథలు చెప్పినట్టే వుంటాడు. మనకూ విన్నట్టే వుంటుంది. ఈ కథల వెనక మనకు కొన్ని జీవిత సత్యాలూ, మానవుడి దర్భులతా, ప్రకృతి విధ్వంసమూ రణభేరిలా మోగుతూ - ప్రమాద ఘంటికలు వినిపిస్తూ భయవిహ్వలుల్ని చేస్తాయి.

**- సాకం నాగరాజు**



## నిప్పుల వాన దళిత కథలు


**సంకలనం: కెంగార మోహన్**

వెల :150/- పేజీలు: 136

ప్రతులకు: 9493375447

ఈ నిప్పులవాన కథా సంకలనం కథలన్నీ వస్తు ప్రాధాన్యత కల్గిన కథలు. భారతీయ సమాజంలో పాతుకుపోయి ఉన్న సామాజిక వివక్షత, అంటరానితనం, వృత్తి నిర్బంధం, విలువలేనితనం వీటిచుట్టూనే మొత్తం కథలన్నీ సంచరించాయని చెప్పాలి. వివక్షలో నలిగిపోయే బతుకు దృశ్యాలను చిత్రించడానికే కథకులందరూ ప్రయత్నించారు.

**- జి. వెంకటకృష్ణ**



## కంచెమీద పక్షిపాట

కవిత్వం


**డా॥ నూకతోటి రవికుమార్**

వెల : 110/- పేజీలు: 120

ప్రతులకు: 9989265444

బయటా, లోపలా కంచెలు విస్తరిస్తున్న వేళ కనీసం ఆ కంచ తీగల మీద నుంచొని అయినా తన వేదనను పాడే పక్షులు ఉంటాయి. ఆ పక్షి డాక్టర్ నూకతోటి రవికుమార్. కంచెల్ని బద్దలు చేసే రవికుమార్ కవిత్వం రావడం బహుజన సాహిత్యంలో ఒక ముఖ్యమైన సందర్భం. తన మిత్రులకు ఒక వేడుక, ఒక పండగ.

**- ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి**



## కొత్త వేకువ కవిత్వం


**పద్మావతి రాంభక్త**

వెల :100/- పేజీలు: 144

ప్రతులకు: 9966307777

ఆడవాళ్ళను, రైతులను, శ్రమని నమ్ముకున్న విభిన్నవృత్తుల వారి సంవేదనల్ని కవిత్వం చేయడం ద్వారా కవిగా పీడితుల పక్షం నిలిచారు పద్మావతి. ఈ నేపథ్యాన మనుషుల్లో మానవీయ భావనల్ని మేల్కొల్పేందుకు కవిత్వాన్ని వాహికగా చేసుకున్నారు. ఇతివృత్తానికి తగిన వ్యక్తీకరణ సంవిధానాన్ని అనుసరించారు. తనదైన భాషనీ, డిక్షన్‌ని రూపొందించుకొని కవిత్వాన్ని సృజించారు.

**- గుడిపాటి**



## పక్షితనాన్ని కలగంటూ.. కవిత్వం

**పక్కి రవీంద్రనాథ్**

వెల :120/- పేజీలు: 80

ప్రతులకు: 9440364486

రవీంద్రనాథ్ ఇప్పుడు పద్యాన్ని అనుభవిస్తున్నాడు. పద్యనిర్మాణంలో ఆనందాన్ని చేదుకుంటున్నాడు. ప్రతి వనిలోనూ వరమానందాన్ని పొందటం అనుభవ పరిపక్వతకి గుర్తు. రవీంద్రనాథ్ ఒక మెచ్యూర్ దశకి చేరుకున్నాడు. ఏది ముట్టుకున్నా కవిత్వమయ్యే స్థితిలో వున్నాడు. అన్నింటినీ సమతూకంతో అందుకుని, తట్టుకుని కవిత్వం రాయగలడని ఈ సంపుటి చెబుతోంది.

**- శివారెడ్డి**



## కరోనా శాపమా? వరమా?

**శ్రీమతి పుప్పాల సూర్యకుమారి**

వెల :100/- పేజీలు: 182

ప్రతులకు: 9391113756

మనిషిలో నెలకొన్న భయాన్ని తొలగించి, మనుషుల్లో ఆశలు నింపి, కుటుంబ సంబంధాలు పరిఢవిల్లేలా కథను నడిపిస్తూ కరోనా ఉపద్రవాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ భవిష్యత్తు సుఖమయం, శుభప్రదం అవుతందన్న ఆశాభావంతో ఈ నవల వెలువరించారు పుప్పాల సూర్యకుమారి. కొద్దిరోజుల్లోనే దీన్ని పూర్తిచేయడం విశేషం. బహుశా కరోనా ఇతివృత్తంగా వెలువడిన తొలి నవల ఇదే. ఒక విజయాన్ని, విషాదాన్ని, విపత్తును, దాని అంతర్ స్వరూపాన్ని, స్వభావాన్ని సందర్శించిన రచయితలే ఈ సాహసం చేయగలుగుతారు.

**- ముత్యాల ప్రసాద్**


# స్వీకారం




**కరోన** దీర్ఘ కవిత
**ఎస్. ఆర్. పృథ్వీ**
వెల : 50/- పేజీలు: 32
ప్రతులకు : 9989223245

**క**రోన మీద వస్తున్న వార్తలు నన్ను దీర్ఘ కవిత వ్రాసే దిశగా మరల్చాయి. ఆ ప్రేరణతో మార్చి 30 నుండి ఏప్రిల్ 5 మధ్య వారంలో రోజుల్లో ఈ దీర్ఘ కవిత వ్రాసాను. మీ ముందుకు తీసుకొచ్చాను. గతంలో పలు దీర్ఘకవితలు వ్రాసిన అనుభవం నన్ను ముందుకు నడిపించింది. ఇదే కరోన మీద మొట్టమొదటి ముద్రిత దీర్ఘ కవిత కావచ్చు. ఆదరిస్తారని ఆశిస్తున్నాను.


**- ఎస్.ఆర్. పృథ్వి**




**వైరాగ్యంలోని మహిమ**
(కథా సంకలనం - మూలభాష: కన్నడం)
తెలుగు : **శాఖమూరు రామగోపాల్**
వెల :300/- పేజీలు: 297
ప్రతులకు: 9052563666

**మీ** ముందున్న 'వైరాగ్యంలోని మహిమ' నా నుంచి వచ్చిన 14వ అనువాద పుస్తకంగా ఉంది. కర్నాటకలో పలు ప్రాంతాలకు చెందిన మూల రచయిత(త్రు)లైన వారి కథలను పరకాయ ప్రవేశం చేసి యథాతథ అనువాదంగా ఈ కథా మాలికను మీ ముందు ఉంచుతున్నాను.


**- శాఖమూరు రామగోపాల్**




**అంకితం** కథలు
**ఉండవల్లి . ఎమ్**
వెల : 200/- పేజీలు: 118
ప్రతులకు: 9441347679

**వ్య**క్తిగత అభిరుచులు మనిషి అంతశ్చేతనను నిర్మిస్తాయి. అదే జీవితంలో వారి ప్రవర్తనకు ఊతమిస్తుంది. ఆ శక్తిని పాజిటివ్‌గా అందించి సమాజ సంస్కరణలో తనదైన ముద్ర వేయడంలో రచయిత కృతకృత్యులయ్యారు. అన్ని వయసుల పాఠకుల హృదయాలకు చేరే కథలివి.


**- డా॥ కాళ్లకూరి శైలజ**




**ఒక ఆదివారం సాయంత్రం**
**ఇంకా ఇతర కవితలు**
**విజయ్ కోగంటి**
వెల :130/- పేజీలు: 96
ప్రతులకు: 8801823244

**మా**మూలు కవుల మూసపద్ధతికి భిన్నంగా ఆత్మకేంద్రంగా ఆత్మాశ్రయం (సబ్జెక్టివ్) గా సాగుతుంది విజయ్ కవిత. కొన్ని ఆలోచనలు మనలో రేకెత్తిస్తుంది. అనుభూతుల్ని పరిశుభ్రం చేస్తుంది. అదే సమయంలో అదెక్కడా didactic purpose ని నెరవేర్చదు. పెద్దరికంతో హితబోధ చేయదు. స్నేహంతో మంచి మాట చెపుతుంది. స్నేహశీల కవిత్వం ఇది. ఆస్వాదిద్దాం.


**- డా॥ పాపినేని శివశంకర్**




**మట్టినై పుట్టాలనుంది** కవిత్వం
**డా॥ బి. బాలకృష్ణ**
వెల :80/- పేజీలు: 128
ప్రతులకు: 040-27678430

**బా**లకృష్ణలో మంచి తాత్త్విక చింతన ఉంది. మనిషి పుట్టుక, జీవనం, మరణం వంటి వాటిని గురించి బాలకృష్ణకు అనేక ప్రశ్నలున్నాయి. వాటిలో కొంత భావవాదమున్నా ఆయన తాత్త్విక చింతన గాఢమైనది. 'మరణం ఒక నిరంతర ప్రవాహం' అన్నారు బాలకృష్ణ. 'మట్టి ఒక సమదర్శి' అనడంలో కవి లోతైన భావుకుడిగా కనిపిస్తాడు.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**




**వాళ్ళెందుకు నడుస్తున్నారు?**
**లాక్‌డౌన్‌లో వలస కార్మికుల వెతలు**
**డా॥ మాడభూషి శ్రీధర్**
వెల :30/- పేజీలు: 72
ప్రతులకు: 9032467057

డా॥ మాడభూషి శ్రీధర్ గారు వలసకార్మికుల స్థితిగతుల గురించి చేసిన విశ్లేషణ మనందరిని కదిలిస్తుంది.ఎంతో మానవీయంగా, వేదనా భరితంగా సాగి మన హృదయాల్ని కదిలిస్తుంది. మనందరిలో ఆలోచనలను రేకెత్తించే విధంగా, ఎన్నో ప్రశ్నలను సంధించారు. చట్టాల గురించి, వలసకార్మికుల హక్కుల గురించి ఎంతో సమాచారాన్ని ఇచ్చారు. కరోనా కల్లోలంలో మనదేశ వాస్తవ ముఖచిత్రాన్ని ఈ పుస్తకం మనకు చూపిస్తుంది.



గిడుగు రామమూర్తి పంతులు
(29.08.1863-22.01.1940)



మగ్దూం మొహియుద్దీన్
(04.02.1908-24.08.1969)




ఆరుద్ర
(31.08.1925-04.06.1998)




దాశరథి రంగాచార్య
(24.08.1928 - 08.06.2015)

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 11 ▪ KRISHNA ▪ AUGUST 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 29.07.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



**పండుగలు - ప్రజాసంస్కృతి** పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి– అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ. 65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు – పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.


## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన




పేజీలు 32
రూ. 25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు – బౌద్ధతత్వం




పేజీలు 32
రూ. 25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధారించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
# లోకాయత




పేజీలు 32
రూ. 25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2, ఫోన్ : 0866 – 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**